అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 18-12-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 349 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 16 పేజీలు వెల : 6.50



జమిలీ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించిన ప్రతిపక్షం


మద్దతిచ్చిన టీడీపీ, జనసేన

తీవ్ర వ్యతిరేకతతో బిల్లును జేపీసీకి పంపిన కేంద్రం

బిల్లుకు మద్దతుగా మాట్లాడని జేడీయూ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఫెడరలిజంతో సహా రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' లక్ష్యంగా రూపొందించిన వివాదాస్పద రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి.. ఈ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందని, ప్రజాస్వామ్య స్వరూపం, సమాఖ్య వాదంపై దాడి చేస్తుందని పేర్కొన్నాయి. అందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ పదవీకాలం, ఎలా కేంద్ర పదవీకాలంలోకి మార్చుతారని ప్రశ్నించాయి. అలా మార్చడం సాధ్యం కాదని తెలిపాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును, లోక్‌సభ ఎన్నికలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రవేశపెట్ట డాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అలాగే ... 15లో







ఏడాదిలో రూ.1.27 లక్షల కోట్ల అప్పేంటి?
- ఇలాగైతే ఐదేండ్లలో 6.37 లక్షల కోట్లకు అప్పు : హరీశ్‌రావు

మీరు చేసిన అప్పులు, వడ్డీలకే రూ.66 వేల కోట్లు కట్టాం
- ప్రతిపైసాకూ జవాబుదారీతనంగా ఉంటాం..మీ మాదిరిగా లెక్కలు దాచం
- ఇది లఘు చర్చ కాదు...ప్రశ్నోత్తరాల సమయం
- కావాలంటే ప్రత్యేకంగా దీనిపైనే చర్చించేందుకు మేం రెడీ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మీరంటే..మీరే

అప్పులకుప్పపై సభలో అధికార ప్రతిపక్షాల వాగ్యుద్ధం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎఫ్‌ఆర్‌బీఎమ్ రుణాలపై వాడీవేడిగా చర్చ నడిచింది. అప్పులకు కారణం మీరంటే..మీరే కారణమంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లకు దారి తీసింది. 'ఏడాదిలో రూ.1.27 లక్షల కోట్ల అప్పేంటి? ఇలాగైతే ఐదేండ్లలో రాష్ట్ర అప్పు 6.37 లక్షల కోట్లకు చేరుకుంటుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అప్పు కేవలం రూ.4.17 లక్షల కోట్లే' అని హరీశ్‌రావు వివరించగా.. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అందులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకే రూ.66 వేల కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వం 40 వేల కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను మాపై రుద్దిపోయింది. వాటిని క్లియర్ చేసుకుంటూ వస్తున్నాం. గత ప్రభుత్వం మాదిరిగా అప్పుల లెక్కలు దాచం. ప్రజల ప్రతిపైసాకూ జవాబుదారీగా ఉంటాం. ఇది లఘు చర్చ కాదు. ప్రశ్నోత్తరాల సమయం. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేశాం. ప్రతిపక్ష సభ్యులు అడుగుతున్నారు కాబట్టి దీనిపై మరోమారు సుదీర్ఘంగా చర్చించేందుకు మేం సిద్ధం' అని కౌంటర్ ఇచ్చారు. ఇలా ఇద్దరి మధ్యా అరగంటకుపైగా చర్చ నడిచింది.

అప్పులు రాష్ట్రానికి క్షేమకరం కాదు : హరీశ్‌రావు

రాష్ట్రంలో ఎఫ్‌ఆర్‌బీఎం, దాని కిందకు రాని రుణాలపై టి.హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. 2024 నవంబర్ నాటికి ప్రభుత్వ ... 15లో



నల్ల చొక్కాలు.. చేతులకు బేడీలు..

'లగచర్ల'పై బీఆర్ఎస్ వినూత్న నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లగచర్ల రైతులకు బేడీలు వేసిన ఘటనపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ వినూత్నంగా నిరసన వ్యక్తం చేసింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంగళవారం నల్లచొక్కాలు ధరించి ఉదయం 9 గంటలకే శాసనసభ ప్రాంగణానికి చేరుకున్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత... 15లో

ప్రతిదాన్నీ రాజకీయం చేయొద్దు

హరీశ్‌రావుకు స్పీకర్ చురకలు

శాసనసభ మంగళవారం ప్రారంభం కాగానే..స్పీకర్ ప్రసాద్ కుమార్ సభలోకి వచ్చే సమయంలో 'రైతులకు బేడీలా సిగ్గుసిగ్గు... ఇదేమి రాజ్యం..ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం..లూటీల రాజ్యం' అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. 'ఇది సభా సాంప్రదాయం కాదు. కూర్చొని సభ్యులు సహకరించాలి' అని స్పీకర్ ఆదేశించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఎఫ్ఆర్ బీఎం రుణాలపై హరీశ్‌రావు, పలువురు సభ్యులు అడిగిన ప్రశ్న టేబుల్‌పైకి వచ్చిన సమయంలో మంత్రి భట్టి సభలో లేరు. సమాధానం చెప్పాల్సిన మంత్రి సభకు రాకపోవడమేంటి? 21 ఏండ్లలో ప్రశ్న చర్చకు వచ్చిన సమయంలో మంత్రి లేకపో వడం ఇదే తొలిసారి. సభ హుందాతనాన్ని వదిలేస్తున్నారు' అంటూ కామెంట్ చేశారు. అదే సమయంలో 'సమాధానం చెప్పాల్సిన మంత్రి ఇంకా రాకపోవడమా.. షేమ్.. షేమ్..' అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినా దాలు చేశారు. వెంటనే స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుని.. 'హరీశ్‌రావు ప్రతి విషయాన్ని ఇలా రాజకీయం చేయొద్దు' అని చురకలు అంటించారు. మంత్రి వస్తున్నారు..అని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ చెబుతున్న సమయంలోనే భట్టి విక్రమార్క సభలో అడుగుపెట్టారు.

బీజేపీ ఎంపీలు డుమ్మా..

లోక్‌సభలో జమిలీ బిల్లు పెడుతున్న దృష్ట్యా ఎంపీలంతా హాజరుకావాలని బీజేపీ పార్లమెంటరీ పార్టీ విప్ జారీచేసింది. అయినా పదిమంది ఎంపీలు గైర్హాజరయ్యారు.ఆ ఎంపీల తీరుపై కమలం పార్టీలో కలవరం మొదలైంది. వెంటనే తేరుకుని ఆ పది మంది ఎంపీలకు సంజాయిషీ నోటీసులు జారీ చేసింది.

రాష్ట్రాల హక్కులను ఎలా లాక్కొంటారు? : సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్

సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్ మాట్లాడుతూ ఈ బిల్లును తమ పార్టీ వ్యతిరేకిస్తున్నదని స్పష్టం చేశారు. ఈ బిల్లుతో దేశ గణతంత్ర రాజ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీ, మండలపరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ రాష్ట్ర ... 15లో

బీజేపీది అప్రజాస్వామ్య పాలన

మోడీ తన బాధ్యతలు నిర్వర్తించడం లేదు

కాషాయ పార్టీలోకి 830 మంది ప్రజా ప్రతినిధుల ఫిరాయింపు

వివరాలు 11లో

దీంతో వారు పవిత్రులయ్యారు : రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఎద్దేవా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశానికి 11 ఆజ్ఞలను ప్రతిపాదించిన ప్రధాని నరేంద్ర మోడీ తన బాధ్యతలను మాత్రం నిర్వర్తించడం లేదని సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ జాన్‌బ్రిట్టాస్ విమర్శించారు. మంగళవారం రాజ్యసభలో రాజ్యాంగంపై కొనసాగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్‌ని ఏడాదిన్నర ... 15లో



కేటీఆర్‌పై విచారణకు రంగం సిద్ధం

గవర్నర్ అనుమతి లేఖను పంపిన సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫార్ములా వన్ (ఈ కార్) రేసుకు సంబంధించి మాజీ మంత్రి, బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతిచ్చారు. ఈ క్రమంలో సోమవారం నాటి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించిన ... 3లో



ఎప్‌సెట్ కన్వీనర్‌గా బి డీన్‌కుమార్

- ఐసెట్ కన్వీనర్‌గా అలువాల రవి
- త్వరలో ప్రవేశ పరీక్షల తేదీల ప్రకటన : ఉన్నత విద్యామండలి వెల్లడి

వివరాలు 3లో





హైదరాబాద్‌కు రాష్ట్రపతి

ఘన స్వాగతం పలికిన గవర్నర్, సీఎం

శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్ర పర్యటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శీతాకాల విడిది నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం హైదరాబాద్ విచ్చేశారు. సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక విమానంలో హకీంపేట విమానాశ్రయం చేరుకున్న ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దనసరి అనసూయ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, త్రివిధ దళాల అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ద్రౌపదిముర్ము హకీంపేట నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. శీతాకాల విడిదిలో భాగంగా ఈ నెల 21 వరకు ఐదు రోజుల పాటు రాష్ట్రంలో బస చేయనున్నారు. బుధవారం ఆమె పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం, అధికారులు, పౌరులతో రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహిస్తారు.



'జులై 19' కటాఫ్ డేట్

ఆ తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలు కూల్చేస్తాం : హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ హెచ్చరిక

వివరాలు 15లో


(ఫైల్)

సాయుధ పోరాట కొదమసింహం

దర్గ్యానాయక్

విస్నూర్ దేశ్‌ముఖ్ పాలిట ఫిరంగి గుండు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

దర్గ్యానాయక్ అంత్యక్రియలు పూర్తి, పలువురి నివాళి

వివరాలు 15లో

"కాదేదీ కబ్జాకు అనర్హం అన్నట్టుగా పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రతిదీ కబ్జామయమవుతోంది. ఓఆర్ఆర్ పక్కనే వేల కోట్ల విలువ చేసే సర్కార్ భూముల్ని కాజేసేందుకు కీలకమైన ప్రజాప్రతినిధులే ఎసరు పెట్టారు. పడావుగా ఉన్న ప్రభుత్వ భూముల్లో ప్లాట్లు చేసి క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. ఒకటా రెండా 384 ఎకరాల భూముల్ని కబ్జాబెట్టారు. రూ.5 వేల కోట్ల విలువ చేసే సర్కార్ భూముల్ని అప్పనంగా మింగేయచూస్తున్నారు. ఇనాం పేరిట కొందరు కాజేయగా.. ఓఆర్‌సీల పేర ఇంకొందరు కబ్జా పెట్టారు. మరి కొందరేమో కొనుగోళ్ల పేరిట కోర్టుకెళ్లారు. ఇద్దరు కీలకనేతల కనుసన్నల్లో అప్పనంగా అమాంతం వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూముల్నే మాయం చేసే ప్రయత్నాలు సాగుతుండటం గమనార్హం.

పెద్దల భూదందా

384 ఎకరాలకు ఎసరు పెట్టిన నేతలు

- మార్కెట్ విలువ రూ.5 వేల కోట్ల పైనే
- అనర్హులకు ఓఆర్‌సీ..
- గతంలో అసెంబ్లీ హౌజ్ కమిటీ
- తప్పుడు ఓఆర్‌సీలపై విచారణ..
- రద్దు చేసిన సీసీఎల్ఏ
- పడావు భూముల చదును
- ప్లాట్లుగా మార్చి క్రయవిక్రయాలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజక వర్గం అంటేనే భూ కబ్జాలు.. భూ దందాలనే పేరుంది. అందులో అమీన్‌పూర్ మండలమంటే కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. హైడ్రా వచ్చాక అమీన్‌పూర్ రాష్ట్రంలోనే చర్చనీయాంశమైంది. అమీన్‌పూర్ రెవెన్యూ మండల పరిధిలో సుల్తాన్‌పూర్, బొమ్మన్‌కుంట రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న మెడికల్ డివైజెస్ పార్కు పక్కనే 30 సర్వే నెంబర్‌లో 722.20 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ఈ భూములపై అనేక వివాదాలున్నాయి. అట్టి భూములు నిజాం నవాబ్ కాలంలో ఎండీ ఫరీదొద్దీన్ పేరుతో ఇనామ్ భూమిగా ఉండేదని చెబుతారు. అయితే సదరు వ్యక్తి ఎప్పుడూ అట్టి భూముల్ని సాగు చేయలేదు. కబ్జాలోనూ లేరు. నిజాం కాలంలో ఎండీ ఫరీదొద్దీన్ ఇనామ్‌దారుగా ఉన్నట్టు చెప్పబడుతున్నా 1954-55 నాటి రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఇనామ్‌దార్ల పేరుతో ఎలాంటి రికార్డులూ లేవు. కొందరు సాగు చేసుకుంటున్న గ్రామస్తుల వివరాలు మాత్రమే ఉన్నాయి. స్థానిక ... 16లో



నిర్బంధాలు.. అరెస్టులు

జీపీ సిబ్బంది చలో హైదరాబాద్ విజయవంతం



ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా..

ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి : తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాలడుగు భాస్కర్

వివరాలు 6లో

డీపీఆర్ ఖరారు తర్వాతే అంచనా

మూసీ ప్రాజెక్టుపై మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ నది పునరుజ్జీవనానికి సంబంధించిన డీపీఆర్ వచ్చిన తర్వాతే ప్రాజెక్టు అంచనా వ్యయం తెలుస్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం శాసనమండలిలో మూసీ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ సభ్యులు సుంకరి రాజు, మధుసూదనాచారి సరికొండ, కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్ రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ప్రాజెక్టు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపకల్పన కోసం ఎంఆర్డీసీఎల్‌కు కన్సార్టియం మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్‌ను ఎంపిక చేసినట్టు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తూ వరద ముంపునకు గురయ్యే 309 కుటుంబాలు స్వచ్ఛందంగా తరలిపోయారనీ, వారి నిర్మాణాలకు, భవనాలకు చట్టబద్ధ అనుమతులు లేవని చెప్పారు. తరలిపోయిన కుటుంబాలు స్వచ్ఛందంగా 181 ఇండ్లను వారే కూల్చివేశారని తెలిపారు. ప్రభుత్వం మానవత్వంతో ఆ కుటుంబాలకు 2 బీహెచ్‌కెలను కేటాయించిందనీ, ప్రతి రీలొకేటెడ్ కుటుంబానికి రూ.25 వేలు వన్ టైం షిఫ్టింగ్ అలవెన్స్ ఇచ్చినట్టు తెలిపారు. జీవనోపాధి కమిటీని ఏర్పాటు చేసి ఒక్కొక్క ఎస్‌హెచ్‌జీకి రూ.2 లక్షల చొప్పున 172 మంది సభ్యులకు రూ.3.44 కోట్లు పంపిణీ చేసిందని చెప్పారు. 1.40 లక్షలు సబ్సిడీగా మిగిలిన రూ.60 వేలను జీరో వడ్డీ రేటుపై వాయిదా పద్ధతిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. అంగన్‌వాడీ పాఠశాలలు, కళాశాలల్లో 331 మంది పిల్లలకు అడ్మిషన్ ఇచ్చినట్టు చెప్పారు.

అంతకుముందు బీఆర్ఎస్ సభ్యులు సుంకరి రాజు మాట్లాడుతూ 1.50 లక్షల కోట్లు అంచనా వ్యయమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. డీపీఆర్ రాలేదంటూనే లక్షల ఇండ్లను మార్క్ చేశారని విమర్శించారు. పేదల ఇండ్లను బుల్డోజర్లతో కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రోత్ స్టోరీ పుస్తకంలోనూ ప్రాజెక్టు వ్యయం రూ.1.50 లక్షల కోట్లని పేర్కొన్నారని తెలిపారు. బీఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ డీపీఆర్ కాలేదంటూనే ప్రపంచ బ్యాంకుకు



రూ.4,100 కోట్ల కోసం దరఖాస్తు చేశారనీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి కలిసి ప్రాజెక్టుకు రూ.14 వేల కోట్ల సాయం ఎలా అడిగారని ప్రశ్నించారు. మంత్రి శ్రీధర్ బాబు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో ప్రివిలేజ్ మోషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ, సొంత వార్తాపత్రికల్లో వార్తలు రాసుకుని చెబుతున్నారన్నారు. అన్నింటికీ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయడమే లక్ష్యంగా రాసే వార్తలకు జవాబు చెప్పడం ఎవ్వరి తరం కాదని స్పష్టం వ్యాఖ్యానించారు. ప్రపంచ బ్యాంకుకు పంపిన ప్రతిపాదనలు ఈ ప్రాజెక్టుకు సంబంధించనవి కాదని తెలిపారు. వేములవాడలో రైతు చనిపోయిన నాలుగేండ్లకు ఒక్క పైసా ఇవ్వని వారు తమకు చెబుతారా? అని ప్రశ్నించారు. అందుకు కల్వకుంట్ల కవిత, ముఖ్యమంత్రి సొంతూరులో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేశారు. సభ్యులు భానుప్రసాద్ మాట్లాడుతూ హైదరాబాద్ నార్సింగి చౌరస్తాలో పెద్ద భవనాన్ని రాత్రివేళల్లో లైట్లు వేసి నిర్మిస్తున్నారనీ, అది మూసీ జోన్ పరిధిలోకి వస్తుందనే అనుమానం వ్యక్తం చేశారు. పేదల ఇండ్లు కూలుస్తున్న సర్కారు... ముందు ఇలాంటి వాటిని గుర్తించి కూల్చివేయాలని సూచించారు. నల్ల దుస్తులతో బీఆర్ఎస్ సభ్యులు రైతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ చర్యకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు శాసన మండలికి నల్ల దుస్తులను ధరించి వచ్చారు. ఇదే విషయాన్ని ఆ పార్టీ సభ్యురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు.



తొలితరం కథకుల పరిచయం

కర దీపికలా 'తెలంగాణ తొలితరం కథకులు-కథన రీతులు' : నందిని సిధారెడ్డి

నవతెలంగాణ-కల్చరల్

తొలి తరం కథకుల పరిచయం.. వారి కథన రీతుల విశ్లేషణతో 'తెలంగాణ తొలితరం కథకులు- కథన రీతులు' సంపుటి నేటి రచయితలకు కర దీపికగా ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు నందిని సిధారెడ్డి అన్నారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు కె.ఆనందాచారి అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన సభలో నందిని సిధారెడ్డి 'తెలంగాణ తొలితరం కథకులు- కథన రీతులు' సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ గడ్డ మీద ప్రేమ, కథపై ప్రేమనే కె.పి.అశోక్ కుమార్‌ను ఈ పనికి పురికొల్పిందని అన్నారు. విస్మరణకు గురైన తొలితరం కథల సాహిత్యాన్ని ఈ తరానికి పరిచయం చేశారని చెప్పారు. దాశరథి, సురవరం ప్రతాపరెడ్డి లాంటి వారిని కథకులుగా కూడా నాటి సమాజం అంగీకరించలేదన్న సంగతి ఆయన గుర్తు చేశారు. వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ.. సంపుటిలోని 30 మంది కథకులలో ఎనిమిది-తొమ్మిది మంది పేర్లు మాత్రమే తెలుగు ప్రామాణిక సాహిత్య, కథా చరిత్రల్లో కనబడతా యన్నారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, ఒద్దిరాజు సోదరులు, వెల్దుర్తి మాణిక్య రావు, దాశరథి, భాస్కరభట్ల కృష్ణారావు, బూర్గుల రంగనాథరావు, నందగిరి వెంకటరావు, నందగిరి ఇందిరాదేవి వంటి వారి పేర్లు ఇతర కారణాల వల్ల కొంత ప్రాచుర్యంలోకి వచ్చాయి గానీ, మిగిలిన సగం పేర్లు తెలంగాణ సాహిత్యాభిమానులకు, కథాభిమానులకు వివరంగా తెలిసినవి కావని అన్నారు. కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయని చెప్పారు. ప్రముఖ విమర్శకులు ఎ.కె.ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో సంస్కృతిపరమైన జీవనం గురించి పరిశోధన జరగాల్సి ఉందన్నారు. అశోక్ కుమార్ ఆ ప్రయత్నం చేశారని అభినందించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు మాట్లాడుతూ..విశ్వవిద్యాలయాలు, పరిశోధక విద్యార్థులు, అకాడమీలు చేయాల్సిన పనిని అశోక్ కుమార్ చేశారని, ఇది విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అధ్యక్షత వహించిన ఆనందాచారి మాట్లాడుతూ.. అశోక్ కుమార్ చేసిన ఈ విశ్లేషణను తీసుకొని ఇంకా ఎంతో పరిశోధన చేయడానికి అవకాశం ఉందని చెప్పారు. వీరి కథల అధ్యయనం ద్వారా నాటి తెలంగాణ జీవితం, సాంఘిక- సాంస్కృతిక, రాజకీయ అంశాలు అర్థమవుతాయని చెప్పారు. మన గతాన్ని తెలుసుకోకుండా వర్తమానాన్ని అర్థం చేసుకోలేమని, భవిష్యత్‌ను ఊహించనూ లేమని అన్నారు. 70 ఏండ్ల కిందట తెలంగాణ మొదటి తరం రచయితల వస్తు ఎంపిక, శైలి, భాష రీతి ఏ విధంగా ఉన్నదో తెలుసుకోవడానికి నేటి యువ రచయితలకే కాక అందరికీ సంపుటిలోని అంశాలు తెలియజేస్తాయన్నారు. ఈ సభలో తెలంగాణ సాహితీ నాయకులు అనంతోజు మోహన్ కృష్ణ, తంగిరాల చక్రవర్తి, కందుకూరి శ్రీరాములు, మహేందర్, తాటికొండల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం



- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో పెన్షన్ అదాలత్-2024 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేల అభివృద్ధిలో పెన్షన్‌దారులు కూడా భాగస్వాములని అన్నారు. పెండింగ్‌లో ఉన్న వారి కేసుల సంఖ్యను భారీగా తగ్గించడం ద్వారా సమస్యలు, ఫిర్యాదులను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం పర్సనల్, అకౌంట్స్ విభాగాల సిబ్బంది తమ వంతుగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 271 కేసులు స్వీకరించగా, వాటిలో 229 కేసులను అధికారులు పరిష్కరించారు. దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్, ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ ఎస్.వివేకానంద్, ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిర్మలా రాజారాం, చీఫ్ పర్సనల్ ఆఫీసర్(అడ్మిన్) జీఆర్ఎస్.రావు పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- ఇందిరమ్మ ఇండ్ల కోసం భారీగా దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి సమస్యలను ఏకరువు పెట్టారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ధరఖాస్తులు వెల్లువెత్తాయి. మొత్తం 465 దరఖాస్తులు రాగా అందులో పంచాయతీరాజ్ 130, మైనార్టీ 87, విద్యుత్ 68, రెవెన్యూ60, హెూంశాఖ 20, ఇతర శాఖలకు సంబంధించిన 100 దరఖాస్తులు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జి చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఆన్‌లైన్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విధివిధానాలు రూపొందించినప్పటికీ ఆ విషయం తెలియని ప్రజలు ప్రజావాణికి తరలి వచ్చారు. చిన్నారెడ్డి సూచన మేరకు సిబ్బంది ప్రజల నుంచి దరఖాస్తులు సేకరించి హౌసింగ్ శాఖ అధికారులకు ప్రత్యేకంగా అందజేశారు.

నిరసనల్లోనూ దురంహకారం

- కేటీఆర్, హరీశ్‌రావు దొరతనం మరోమారు బయటపడింది :

అసెంబ్లీ లాబీల్లో మంత్రి సీతక్క చిట్‌చాట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బేడీలు వేశారు తప్ప కేటీఆర్, హరీశ్‌రావు వేసుకోలేదనీ, నిరసనల్లోనూ దురంహకారం, వారి దొరతనం బయటపడిందని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. నిరసనలో కూడా బీఆర్ఎస్ నేతల్లో సమానత్వం లేదని విమర్శించారు. రైతులకు బేడీలు వేయడంపై బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదని చెప్పారు. టీఆర్ఎస్ హయాంలో రైతులకు కనీసం పదిసార్లు బేడీలు వేశారని గుర్తుచేశారు. అప్పుడు కనీసం అధికారుల మీద చర్యలు కూడా తీసుకోలేదన్నారు. రైతుకు బేడీలు వేసిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారనీ, అధికారులపై చర్యలు కూడా తీసుకున్నారని చెప్పారు.

ఎమ్మెల్యే నాయినిపై స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రాజేందర్‌రెడ్డి మంగళవారం అసెంబ్లీలో రూల్స్‌కు విరుద్ధంగా మాట్లాడారని వివరించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు రూ.1,000 కోట్లు సంపాదించారంటూ చేసిన వ్యాఖ్యల పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. రూల్ 319, 320, 45 ప్రకారం సభలో మాట్లాడేటప్పుడు ఇతర సభ్యులపై వ్యక్తిగత ఆరోపణలు, అవహేళనలు, ప్రతికూల ప్రభావం చూపించే చర్యలకు పాల్పడకూడదని స్పీకర్‌కు ఇచ్చిన లిఖిత పూర్వక ఫిర్యాదులో పేర్కొన్నారు. రికార్డులు పరిశీలించి తొలగిస్తానని ఈ సందర్భంగా స్పీకర్ వారికి హామీ ఇచ్చారు.

నేడు చలో రాజ్‌భవన్

- టీపీసీసీ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అమెరికాలో గౌతమ్ అదానిపై వచ్చిన ఆర్థిక అవకతవకలకు నిరసనగా బుధవారం చలోరాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఏఐసీసీ ఇచ్చిన పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రదర్శనకు పార్టీశ్రేణులు భారీగా తరలిరావాలని ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 11 గంటలకు నెక్లెస్‌రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద భారీ జనసమీకరణతో రాజ్‌భవన్ వరకు ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొంటారు.

సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- కార్యదర్శిగా ఎండి.జహంగీర్

నవ తెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా ఎండి.జహంగీర్ ఎన్నికయ్యారు. చౌటుప్పల్‌లో జరిగిన సీపీఐ(ఎం) జిల్లా మూడో మహాసభ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా కార్యదర్శితోపాటు 34 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కొండమడుగు నర్సింహా, బట్టుపల్లి అనురాధ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేషం, దాసరి పాండు, జల్లెల్ల పెంటయ్య, బూర్గు క్రిష్టారెడ్డి, గుంటోజు శ్రీనివాసాచారిని ఎన్నుకున్నారు.



జిల్లా కమిటీ సభ్యులుగా సిరిపంగి స్వామి, దయ్యాల నర్సింహా, మాయ క్రిష్ణ, బొల్లు యాదగిరి, మద్దెల రాజయ్య, ఎండి.పాష, బొడ్డుపల్లి వెంకటేష్, ముక్కెర్ల యాదయ్య, గుండు వెంకటనర్సు, గంగాదేవి సైదులు, డోడ యాదిరెడ్డి, మద్దెపూరం రాజు, బోలగాని జయరాములు, అవ్వారు రామేశ్వరి, రాచకొండ రాములమ్మ, ఎంఏ.ఇక్బాల్, వనం ఉపేందర్, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం వెంకటేష్, రాగిరు కిష్టయ్య, మల్లెపల్లి లలిత, బలుగూరి అంజయ్య, కోట రామచంద్రారెడ్డి, గోశిక కరుణాకర్, పైళ్ళ గణపతిరెడ్డిని ఎన్నుకున్నారు.

ఈ మహాసభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

భవిష్యత్ ఎర్రజెండాలదే..

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ- చౌటుప్పల్ రూరల్

ప్రపంచంలో అనేక దేశాల్లో కార్మికులు, రైతులు, ప్రజలు పెద్దఎత్తున పోరాటాలు చేసి కమ్యూనిస్టులను అధికారంలోకి తీసుకొచ్చారని, భవిష్యత్ ఎర్రజెండాలదేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. చౌటుప్పల్‌లో జరుగుతున్న సీపీఐ(ఎం) యాదాద్రిభువనగిరి జిల్లా మూడో మహాసభ చివరి రోజైన మంగళవారం ఆయన మాట్లాడారు. పక్కనున్న శ్రీలంకలో, నేపాల్‌లో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారని చెప్పారు. ఫ్రాన్స్ పార్లమెంట్ ఎన్నికల్లో పెద్ద పార్టీగా కమ్యూనిస్టు పార్టీ అవతరించిందని, జర్మనీ స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కమ్యూనిస్టులు గెలిచారని తెలిపారు. అమెరికా



చుట్టూత ఉన్న వెనిజులా, అర్జెంటీనా లాంటి దేశాల్లో కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నారని చెప్పారు.

ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం చలాయిస్తోందన్నారు. భారతదేశ పాలకులు కూడా అమెరికా కనుసన్నల్లో నడుచుకుం టున్నారని ఆరోపించారు. బీజేపీ అనుసరిస్తున్న విభజన రాజకీయాలను తిప్పికొడుతూ ఉద్యమాలు చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. భవిష్యత్ ఎర్రజెండా పార్టీలదేనని, బీజేపీ నిజస్వరూపం బయటపడిందని అన్నారు.

రైతాంగ పోరాటంతో వెనక్కి తగ్గినట్టే తగ్గి మూడు నల్ల చట్టాలను తిరిగి దొడ్డిదారిన తెచ్చే ప్రయత్నం చేస్తోం దని విమర్శించారు. నరేంద్రమోడీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడుతున్నాయన్నారు. ఇప్పటికే చావుతప్పి కన్ను లొట్టతప్పినట్టు నితీష్‌కుమార్, చంద్రబాబు సహాయంతో మూడో సారి అధికారం చేపట్టారన్నారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, పైళ్ల ఆశయ్య, సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగ నర్సింహులు, మాటూరు బాలరాజు, కల్లూరు మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లచట్టాల అమలును ఆపాలి

కనీస మద్దతు ధర కల్పనపై మోడీ సర్కారు మోసం

- 23న 500 జిల్లా కేంద్రాల్లో ఆందోళనలను జయప్రదం చేయాలి
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే చట్టం తీసుకొస్తామని రాతపూర్వకంగా రైతాంగానికి ఇచ్చిన హామీని తుంగలో తొక్కి దొడ్డిదారిన నల్లచట్టాలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవ్వటం దుర్మార్గమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. నల్లచట్టాలను తీసుకురావడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీరును నిరసిస్తూ ఈ నెల 23న దేశంలో 500 జిల్లా కేంద్రాల్లో ఎస్కేఎం తలపెట్టిన ఆందోళనలను జయప్రదం చేయాలని రైతులకు పిలుపు నిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నల్లచట్టాల్లోని సారాంశం ఆధారంగా మార్కెట్ ఆధారిత చట్టం కొత్తగా రూపొందించి అమలు చేయాలని చూడటం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. దేశవ్యాప్తంగా రైతుల పోరాటంపై ఉక్కుపాదం మోపుతూ అరెస్టులు చేయడా న్ని ఖండించారు. ఉత్తరప్రదేశ్, హర్యానా ప్రభుత్వాలు రైతు సంఘాల నాయకులపైనా, రైతులపైనా అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి వేధించడాన్ని తప్పుబట్టారు.



నోయిడాలో రైతుల నిరవధిక దీక్షలు కొనసాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రైతు సంఘాల నేతలతో చర్చలు జరపాలనీ, గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల పోరాటానికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు 23న జరిగే ఆందోళనల్లో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించడం అంటే భారతదేశ ఆహార భద్రతను కాపాడటమేనని చెప్పారు. నేడు చాలా దేశాలు ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తీరును, కోవిడ్ కాలంలో ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. నేషనల్ క్రైమ్ బ్యూరో లెక్కల ప్రకారం దేశంలో 5,400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వ్యవసాయ కార్మికులు 5,800 మందికిపైగా చనిపోయారని తెలిపారు. గతంలో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులు కేటాయిస్తే.. కేంద్రంలోని ప్రస్తుత మోడీ సర్కారు 1.37 శాతానికి నిధులను కుదించిందని విమర్శించారు. ఆధార్ పేరుతో ఏడు కోట్ల జాబ్‌కార్డులను తొలగించిందని తెలిపారు. ఆహార భద్రతా కార్డుల్లోని 5.86 కోట్ల మంది లబ్దిదారులను తొలగించిందనీ, 2 కోట్ల రేషన్‌కార్డులను రద్దు చేసిందని విమర్శించారు. ఈ చర్యలను తక్షణమే వెనక్కి తీసుకుని రైతాంగ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించకపోతే మోడీ సర్కారు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి.ప్రసాద్ పాల్గొన్నారు.

నమూనా చీరలను పరిశీలించిన సీఎం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించేందుకు ఎంపిక చేసిన నమూనా చీరలను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పరిశీలించారు. మంగళవారం తన తన చాంబర్‌లో నమూనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి పాలకవర్గంతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పెండింగ్ ఫీజులను దశల వారీగా చెల్లిస్తాం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంజినీరింగ్, సాంకేతిక కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రయివేట్ కళాశాలల యజమానులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు, అసలు కలిపి ఏడాదికి 66 వేల కోట్లు, రైతు రుణమాఫీ కోసం రూ. 21 వేల కోట్లు మొత్తం ఈ ఏడాది రెండు అంశాలకే రూ. 87 వేల కోట్ల నగదును చెల్లించామని వారికి వివరించారు. ఆర్థిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారించుకుంటూ ముందుకు వెళు _న్నామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం



బకాయిలు దశలవారీగా చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీలకు చట్టబద్ధత కల్పించాలి

- రుణ మాఫీ కోసం పథకం అవసరం
- వ్యవసాయానికి మరింత బడ్జెట్
- వ్యవసాయ కార్మికుల కోసం జాతీయ కమిషన్
- కేంద్రానికి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫారసు



న్యూఢిల్లీ : పంటలకు అందిస్తున్న కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పీ) చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని వ్యవసాయం, పశుసంవర్ధకం, ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని అన్నదాతలు, పలు రైతు సంఘాలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంఎస్‌పీలకు చట్టబద్ధత కోరుతూ శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద రైతులు ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ సిఫారసు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, జలంధర్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చెన్నీ నేతృత్వంలోని కమిటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించిన గ్రాంట్ల డిమాండ్లపై లోక్‌సభకు తన తొలి నివేదికను అందజేసింది. ఎంఎస్‌పీలకు చట్టబద్ధత కల్పించాలన్న సిఫార్సును తన నివేదికలో కమిటీ చేర్చిందని లోక్‌సభ సచివాలయం ఓ ప్రకటనలో తెలిపింది.'దేశంలో వ్యవసాయ సంస్కరణలు, రైతుల సంక్షేమం కేంద్రంగా జరుగుతున్న చర్చలో ఎంఎస్‌పీల అమలు కేంద్ర బిందువుగా ఉన్నదని కమిటీ అభిప్రాయపడింది. ఎంఎస్‌పీలకు చట్టబద్ధత కల్పిస్తే దేశంలో రైతుల ఆత్మహత్యలను తగ్గించవచ్చునని అది భావిస్తోంది. రైతులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం, మార్కెట్‌లో నెలకొంటున్న అస్థిర పరిస్థితుల నుండి వారికి రక్షణ కల్పించడం, రుణ భారాన్ని తగ్గించడం ద్వారా ఆత్మహత్యల నుండి రైతులను కాపాడవచ్చు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎంఎస్‌పీలకు చట్టబద్ధత కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది' అని లోక్‌సభ సచివాలయం ఆ ప్రకటనలో వివరించింది.

రైతుల ఇక్కట్లకు రుణభారం, ఆత్మహత్యలే కారణమని అభిప్రాయపడిన కమిటీ... అన్నదాతలు, వ్యవసాయ కార్మికుల రుణాలను మాఫీ చేసేందుకు ఓ పథకాన్ని ప్రవేశపెట్టాలని కూడా కేంద్రానికి సూచించింది. 2021-22, 2024-25 మధ్యకాలంలో వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖకు అధిక కేటాయింపులు జరిపినప్పటికీ కేంద్ర ప్రణాళికా వ్యయంలో ఈ శాఖ వాటా 3.53 శాతం (2020-21) నుండి 2.54 శాతానికి (2024-25) తగ్గిపోయిందని కమిటీ అందజేసిన గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పాదకతను మెరుగుపరచడానికి వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కేంద్రాన్ని కమిటీ కోరింది. పీఎం-కిసాన్ పథకానికి అందిస్తున్న వార్షిక మద్దతును రూ.6,000 నుండి రూ.12,000కు పెంచాలని కూడా సిఫారసు చేసింది. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అందేలా చూడడానికి సాధ్యమైనంత త్వరగా జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, దీనివల్ల వారికి లభించాల్సిన హక్కులు దక్కుతాయని కమిటీ తెలిపింది.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్నది. మంగళవారంతో ఎనిమిది రోజులు పూర్తయ్యింది. మంగళవారం హైదరాబాద్‌లోని సమ్మె శిబిరంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది సెప్టెంబర్ 13న హన్మకొండలోని ఏకశిల పార్క్ దీక్షా శిబిరంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రీఎంగేజ్ విధానం తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలని సూచించారు. ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలనీ, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎనిమిది రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉండడం వల్ల ఎంఈవో, డీఈవో కార్యాలయాలు మూతపడ్డాయని అన్నారు. విద్యాశాఖ పరిపాలన పూర్తిగా స్థంభించిపోయిందన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలల్లో బోధన కొనసాగడం లేదన్నారు. పాఠశాల విద్యాశాఖలో



యూడైస్, అపార్, మధ్యాహ్న భోజనం ఆన్‌లైన్ పనులు కుంటుపడ్డాయని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సంఘ నాయకులను పిలిచి చర్చలు జరిపి సమస్యలను పరిష్కారం చేయ్యాలని కోరారు. పే స్కేల్ అమలు చేస్తామంటూ అసెంబ్లీలో ప్రకటన చేయాలన్నారు. తమ సమస్యలు తీర్చే వరకు సమ్మె కొనసాగుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ చారి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సహదేవ్, సురేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ అభ్యర్థి పడాల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు, జానకి రామ్, కనుకుల రమేష్ , రాష్ట్ర కార్యదర్శి సత్య నారాయణ, ప్రవీణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై విచారణకు రంగం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం గవర్నర్ అనుమతించిన విషయాన్ని పేర్కొంటూ సదరు లేఖను ఏసీబీకి పంపాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను విచారించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి...'గవర్నర్ అనుమతి లేఖ'ను మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఏసీబీకి పంపారు. సోమవారం నిర్వహించిన క్యాబినెట్‌లో ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారంపైన, విద్యుత్తు వ్యవహారాలకు సంబంధించి జస్టిస్ మదన్ లోకూర్ ఇచ్చిన నివేదికపైనా సమగ్రంగా చర్చించారు. ఫార్ములా రేసు పూర్వాపరాలు, అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ ఒప్పందం చేసుకోవడం, ఆర్బీఐ అనుమతి లేకుండా రూ.46 కోట్ల మేర విదేశీ కరెన్సీ చెల్లించడం వంటి వ్యవహారాలపై పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఫిర్యాదు మేరకు ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో కేటీఆర్‌తోపాటు పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను, చీఫ్ ఇంజినీర్‌ను బాధ్యులుగా పేర్కొన్నారు. అధికారులపై విచారణకు ప్రభుత్వం ఇంతకుముందే అనుమతి ఇచ్చింది. కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ నుంచి అనుమతి కోరగా, సుమారు నెల రోజుల తర్వాత ఇటీవల అనుమతి లభించింది.

ఎఫ్‌సెట్ కన్వీనర్‌గా బి డీన్‌కుమార్

- ఐసెట్ కన్వీనర్‌గా అలువాల రవి
- త్వరలో ప్రవేశ పరీక్షల తేదీల ప్రకటన
- ఉన్నత విద్యామండలి వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ సహా వివిధ వృత్తి విద్యా, ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలను నిర్వహించే విశ్వవిద్యాలయాలు, కన్వీనర్లను ఉన్నత విద్యామండలి ఖరారు చేసింది. ప్రవేశ పరీక్షలు నిర్వహించే విశ్వవిద్యాలయాలు, కన్వీనర్ల పేర్లను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి బాలికిష్టారెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ మంగళవారం ప్రకటించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎఫ్‌సెట్ నిర్వహణ బాధ్యతను జేఎన్టీయూ హైదరాబాద్‌కు మళ్లీ అప్పగించారు. ఎఫ్‌సెట్ కన్వీనర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్ సివిల్



అలువాల రవి



ఎ. అరుణకుమారి




పి. చంద్రశేఖర్



బి. విజయలక్ష్మి



ఎస్ఎస్ దిలీప్



బి. వెంకట్రామ్‌రెడ్డి

ఇంజినీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ బి డీన్‌కుమార్‌ను నియమించారు. ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీఈసెట్ నిర్వహణ బాధ్యతను జేఎన్టీయూ హైదరాబాద్‌కు అప్పగించారు. పీజీఈసెట్ కన్వీనర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్ మెకానికల్ విభాగం ప్రొఫెసర్ ఎ అరుణ కుమారి నియమితులయ్యారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్ నిర్వహణ బాధ్యతను మహాత్మాగాంధీ విశ్వవిద్యాలం (ఎంజీయూ)కు అప్పగించారు. ఐసెట్ కన్వీనర్‌గా బిజినెస్ విభాగం విభాగం ప్రొఫెసర్ అలువాల రవిని నియమించారు. పాలిటెక్నిక్ అభ్యర్థులు ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాల్లో చేరేందుకు నిర్వహించే ఈసెట్ నిర్వహణ బాధ్యతను ఓయూకు అప్పగించారు. ఈసెట్ కన్వీనర్‌గా ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ నిర్వహణ బాధ్యతను మళ్లీ ఓయూకు అప్పగించారు. కన్వీనర్‌గా ఓయూ లా కాలేజీ ప్రొఫెసర్ బి విజయలక్ష్మిని నియమించారు. బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్ నిర్వహణ బాధ్యతను కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)కు అప్పగించారు. ఎడ్‌సెట్ కన్వీనర్‌గా కేయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ బి వెంకట్రామ్ రెడ్డిని నియమించారు. బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీఈసెట్ నిర్వహణ బాధ్యతను పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ)కు అప్పగించారు. కొత్త కన్వీనర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్ నియమితులయ్యారు. మేలో ప్రవేశ పరీక్షలను నిర్వహించాలని ఉన్నత విద్యామండలి ఆలోచిస్తున్నట్టు సమాచారం. ప్రవేశ పరీక్షల తేదీలను త్వరలోనే ఖరారు చేసి ప్రకటిస్తామని వారు తెలిపారు.

ప్రవేశ పరీక్షల కన్వీనర్ల వివరాలు

సెట్	విశ్వవిద్యాలయం	కన్వీనర్
ఎఫ్‌సెట్	జేఎన్టీయూహెచ్	బి డీన్‌కుమార్
పీజీఈసెట్	జేఎన్టీయూహెచ్	ఎ అరుణకుమారి
ఐసెట్	ఎంజీయూ	అలువాల రవి
ఈసెట్	ఓయూ	పి చంద్రశేఖర్
లాసెట్	ఓయూ	బి విజయలక్ష్మి
ఎడ్‌సెట్	కేయూ	బి వెంకట్రామ్ రెడ్డి
పీఈసెట్	పీయూ	ఎన్ఎస్ దిలీప్

సంపాదకీయం

ఆగిన సంగీత ఝరి



తన మహోన్నత ప్రతిభా పాటవాలతో దేశ విదేశాల్లో కోట్లాది మంది మనసుల్ని గెలుచుకున్న సంగీత భానుడు అస్తమించాడు. భారత శాస్త్రీయ వాయిద్య కళను ప్రపంచానికి చేరువ చేసిన మ్యూజిక్ మాస్ట్రో, తబలా వాయిద్య మాంత్రికుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ నిష్క్రమణతో తబలా మూగబోయింది. తోడు వాయిద్యంగా ఉన్న తబలాకు ప్రత్యేక గుర్తింపుతెచ్చిన అద్వితీయ ప్రతిభావంతుడు ఇకలేరన్న వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచింది. ఆల్‌టైం గ్రేట్ తబలా విద్వాంసుడిగా పేరొందిన ఉస్తాద్ అల్లారఖా ఖాన్ కుమారుడైన జాకిర్ హుస్సేన్ అల్లారఖా ఖురేషికి పసిబిడ్డగా ఉన్నప్పుడే తబలాతో ఏర్పడిన అనుబంధం, అంతకు మించిన అకుంఠిత దీక్ష, అద్వితీయ ప్రతిభ... ఆయన్ను సంగీత ప్రపంచంలో శిఖరాగ్రాన నిలిపాయి. శాస్త్రీయ వాయిద్య కళాకారులకిచ్చే బిరుదైన 'ఉస్తాద్' అని కాకుండా... జాకీర్ బాయ్ అని పిలవాలని కోరుకోవడం ఆయన వినమ్రతకు, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి నిదర్శనం.

ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చినప్పుడు ముస్లిం సంప్రదాయం ప్రకారం తండ్రి కొడుకు చెవిలో 'కల్మా' చదివి, పేరు పలికి లోపలికి తీసుకెళ్లాలి. ఉస్తాద్ అల్లా రఖా తన కొడుకు చెవిలో తబలా జతులు వినిపించాడట. ఇదే మిటని భార్య ప్రశ్నిస్తే... 'నా ప్రార్థనలు ఇవే.. నేను ప్రార్థన చేసే విధానం ఇదే' అన్నాడట. తనకు గురువుల నుంచి సంక్రమించిన జ్ఞానాన్ని కొడుకుకు పంచాలన్న ఆయన తపన...తండ్రికి మాట రాకూడదన్న పట్టుదల జాకీర్‌ను జగద్విఖ్యాతం చేశాయి. మూడేళ్లకే తబలాను మీటిన ఆ పసివేళ్లు...ఏడేళ్లకే అకుంఠిత దీక్షతో సాధన చేశాయి. పన్నెండేండ్లకే ప్రదర్శనలిచ్చాయి. అన్ని మతాలు, అన్ని ధోరణుల విద్వాంసులతో అతి సులువుగా కలిసిపోయి తన తబలాను వారి సంగీతానికి జత చేయగలగడం జాకీర్ ప్రతిభకు, సర్వమత సారం ఒక్కటేనన్న ఆధ్యాత్మిక భావనకు తార్కాణం. 'నేను స్కూల్‌కు వెళ్లే దారిలో చర్చిలో సంగీతం వినేవాణ్ణి. గుడిలో వినిపించే భక్తి గీతాలు ఆలపించేవాణ్ణి. ప్రపంచంలో ఏ మతమూ ఇంకో మతంపైన జబర్దస్తీ చేయదు. ఏ మతమైనా చెప్పేది నీ పొరుగు వారిని ప్రేమిం చమనే' అన్న ఆయన మాటలు... మతం పేరుతో విద్వేష విషం చిమ్మే తిరోగమన వాదులకు చెంపపెట్టు. 1989లో ఢిల్లీలో ప్రముఖ నాటక రచయిత సఫ్దర్ హష్మీని కాంగ్రెస్ గూండాలు హత్య చేసినప్పుడు ఆయన సృజనాత్మకంగా నిరసన తెలిపారు. కుల, మతాలకు అతీతంగా అందరినీ ప్రేమించారు. తన స్నేహితుడైన ప్రముఖ సంతూర్ విద్వాం సుడు శివకుమార్ 2022లో మరణించినప్పుడు భౌతికకాయాన్ని భుజాలపై మోసి ప్రేమను చాటుకున్నారు. అందరూ వెళ్లిపోయినా...చితిపక్కన విచారంగా నిలబడి కన్నీళ్లు పెట్టుకున్న ఫొటోలు వైరల్‌గా మారాయి. 'ఇదీ నిజమైన ఇండియా... స్నేహానికి కుల, మత భేదాలు లేవు' అన్న నెటిజన్ల వ్యాఖ్యలు అక్షర సత్యం కదా!అందుకేనేమో... క్రిస్టియన్ అయిన కథక్ నృత్యకారిణి ఆంటోనియా మిన్నెకోలాను వివాహం చేసుకున్నారు.

తండ్రి అల్లారఖాకు అనారోగ్యం కారణంగా 19 ఏళ్ల వయసులో తొలిసారి అమెరికా వెళ్లి పండిట్ రవి శంకర్‌కు సహవాయిద్యం అందించే అవకాశం దక్కింది. ఆయనతోపాటు అలీ అక్బర్ ఖాన్, బీమ్‌సేన్ జోషి, మంగళం పల్లి బాలమురళీకృష్ణ, శివకుమార్ శర్మ వంటి భారతీయ సంగీత ప్రముఖులతోనే కాక అంతర్జాతీయ దిగ్గజాలందరి తోనూ చేసిన జుగల్ బందీలు అజరామరంగా నిలిచాయి. పలు సినిమాలకు సౌండ్ ట్రాక్స్ అందించడం, నటించ డమే కాకుండా... మిస్టర్ అండ్ మిసెస్ అయ్యర్ వంటి చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు. 'వాహ్ తాజ్' వంటి ప్రకటనలతో దేశంలో ప్రతి ఇంటికీ చేరువయ్యారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, సంగీత నాటక అకాడమీ, గ్రామీ వంటి లెక్కలేనన్ని పురస్కారాలను అందుకున్నారు. హిందూ, ముస్లిం శాస్త్రీయ సంగీత భాగస్వామ్యాన్ని స్థిరంగా ప్రచారం చేయడంతోపాటు కొనసాగాలని కోరుకున్న కళా స్రష్ట. గాత్ర సంగీతమైనా, వాయిద్య సంగీతమైనా, జుగల్ బందీ అయినా, వ్యక్తిగత ప్రదర్శన ఇచ్చినా, ఫూజన్ అయినా... తనదైన శైలిలో రక్తికట్టించే ఆయన తబలా వాయిద్యం... గాలిలో ఊగే గుబురు జుత్తు... జనం కళ్లలో ఎప్పుడూ కదలాడుతూనే ఉంటాయి. వచ్చే ఏడాది ముంబైలో వరుసగా సంగీత కచేరిలిచ్చేందుకు సిద్ధమైన ఆ బహుముఖ ప్రజ్ఞాశాలి ఇంతలోనే అస్తమించడం సంగీత ప్రపంచానికి తీరని లోటు. సంగీతానికి భాష అంటూ ఉంటే అది ప్రేమ, ఐక్యత అని చాటిచెప్పిన జాకీర్ భాయ్ ఎన్నటికీ సంగీత ప్రపంచంలో మకుటాయమానంగా వెలుగొందుతూనే ఉంటారు. కొత్త వెలుగులను అన్వేషించే భావి తరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారు.

> **అన్ని మతాలు, అన్ని ధోరణుల విద్వాంసులతో అతి సులువుగా కలిసిపోయి తన తబలాను వారి సంగీతానికి జత చేయగలగడం జాకీర్ ప్రతిభకు, సర్వమత సారం ఒక్కటేనన్న ఆధ్యాత్మిక భావనకు తార్కాణం. 'నేను స్కూల్‌కు వెళ్లే దారిలో చర్చిలో సంగీతం వినేవాణ్ణి. గుడిలో వినిపించే భక్తి గీతాలు ఆలపించేవాణ్ణి. ప్రపంచంలో ఏ మతమూ ఇంకో మతంపైన జబర్దస్తీ చేయదు. ఏ మతమైనా చెప్పేది నీ పొరుగు వారిని ప్రేమిం చమనే' అన్న ఆయన మాటలు... మతం పేరుతో విద్వేష విషం చిమ్మే తిరోగమన వాదులకు చెంపపెట్టు.**

ట్రంప్ ఉక్రోషం: సిరియాలో ఏం జరిగింది? భవిష్యత్తేమిటి!



ఎం కోటేశ్వరరావు
8331013288

ఐదు దశాబ్దాలకు పైగా సాగిన అసద్ కుటుంబ పాలన సిరియాలో ముగిసింది.అరబ్ సోషలిస్టు బాత్ పార్టీనేత, అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పాలన 2000 సంవత్సరం జూలై 17 నుంచి 2024 డిసెంబరు 8వరకు సాగింది. అంతకు ముందు బషర్ తండ్రి హఫీస్ ఆల్ అసద్ 1971 మార్చి 14 నుంచి మరణించిన 2000 జూన్ పది వరకు అధికారంలో ఉన్నాడు. మధ్యప్రాచ్యంలో పాలస్తీనాకు మద్దతుగా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పూర్వపు సోవియట్ యూనియన్, తరువాత రష్యా పాలకులు సిరియాకు ప్రధాన మద్దతుదారులుగా ఉన్నారు. నవంబరు చివరివారం నుంచి హయత్ తహ్రిర్ అల్ షామ్(హెచ్‌టిఎస్) సాయుధ సంస్థ, దానికి మద్దతు ఇచ్చిన వారు కలసి అసద్ మిలిటరీపై పెద్ద ఎత్తున దాడులు ప్రారంభించి డిసెంబరు ఎనిమిదో తేదీన రాజధాని డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవటం, అసద్ కుటుంబం రష్యాకు ప్రవాసం వెళ్లటంతో సిరియాలో నూతన అధ్యాయం మొదలైంది. సిరియా ఉగ్రవాదుల చేతికి చిక్కిన తరువాత తాను ప్రవాసం వెళ్లినట్లు మాజీ అధ్యక్షుడు అసాద్ చేసినట్లుగా చెబుతున్న ప్రకటనలో ఉంది. ముందుగా రూపొందించిన పథకం ప్రకారమే తాను తప్పుకున్నట్లు చేస్తున్న ప్రచారం వాస్తవం కాదన్నాడు. సిరియా తమ తొత్తుల చేతికి చిక్కనందుకు డోనాల్డ్ ట్రంప్ ఉక్రోషాన్ని వెళ్లగక్కాడు. అక్కడ తాము పోరాటం జరపలేదని తొలుత ప్రకటించిన ట్రంప్ సోమవారం నాడు మరోసారి స్పందించాడు. ఫ్లోరిడాలోని తన ఎస్టేట్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా టర్కీ పని ముగించిందని అంటూనే బలవంతంగా ఆక్రమించిందని వ్యాఖ్యానించాడు.మొదటిసారి అధికారంలోకి వచ్చినపుడు సిరియాలో ఉన్న 900 మంది తమ సైనికులను ఉపసంహరించనున్నట్లు ప్రకటించిన ట్రంప్ తరువాత మాట మార్చాడు. సోమవారం నాడు అదే ప్రశ్నకు తరువాత చూద్దామన్నట్లుగా స్పందించాడు. ఇప్పుడు సిరియా భవిష్యత్ ఏమిటన్న ప్రశ్నకు ఎవరికీ ఏమీ తెలియదని, టర్కీ కీలక పాత్ర పోషించనుందని చెప్పాడు.

అసద్ స్థానంలో కొత్తగా అధికారానికి వచ్చిన వారు ఉగ్రవాదులా, కాదా అంటే అవును అన్నది వాస్తవం.హెచ్‌టిఎస్ నేత అబూ మహమ్మద్ అల్ జొలానీది అదే నేపథ్యం. ఆల్‌ఖైదా ఉగ్రవాద సంస్థలో పనిచేశాడు. తాజాగా అధికారానికి రావటం కోసం అలాంటి వారితో చేతులు కలిపాడు. ఇదే సమయంలో ఆల్‌ఖైదాతో విడగొట్టుకోవటంతో పాటు జీహాదీలకు వ్యతిరేకంగా పనిచేసిన చరిత్ర కూడా ఉంది. అతగాడిని అమెరికా ఇప్పటికీ ఉగ్రవాదిగానే పరిగణిస్తున్నది, గతంలో అరెస్టు చేసి జైల్లో కూడా పెట్టింది. అయితే తాజాగా అమెరికన్లు అధికారంలో ఉన్నవారితో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వచ్చాయి. అసద్ ప్రభుత్వం కూలిపోయినందుకు అక్కడి జనం ఆనందంతో ఉన్నారు. అది ఎంతకాలం ఉంటుంది? రానున్న రోజుల్లో జొలానీ నాయకత్వంలోని ప్రభుత్వం ఎలా ఉంటుంది, అసలు స్థిరత్వం చేకూరుతుందా అనే ప్రశ్నలు తలెత్తాయి. గాజాలో ఇజ్రాయిల్ మారణకాండ ప్రారంభమై పద్నాలుగు నెలలు గడిచాయి. పాలస్తీనియన్లకు మద్దతుగా ఉన్న లెబనాన్‌లోని హిజబుల్లా సాయుధ సంస్థతో ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న తరువాత సిరియా పరిణామాలు జరిగాయి. 2011లో ప్రారంభమైన అంతర్యుద్ధంతో సిరియన్లు అనేక విధాలుగా దెబ్బతిన్నారు, దేశం సర్వనాశనమైంది. కుక్కలు చింపిన విస్తరిలా సాయుధ ముఠాలు కొన్ని ప్రాంతాలను తమ అదుపులో ఉంచుకున్నాయి. ఆరు లక్షల మంది వరకు పౌరులు, సాయుధులు, సైనికులు మరణించినట్లు అంచనా, 70లక్షల మంది అంతర్గతంగా నెలవులు తప్పగా మరో 70లక్షల మంది వరకు ఇరుగుపొరుగు దేశాలకు శరణార్థులుగా వెళ్లారు. అంతర్యుద్ధం ముగిసినా సాధారణ జీవన పరిస్థితి ఎంతకాలానికి పునరుద్ధరణ అవుతుందన్నది పెద్ద ప్రశ్న.

కొత్త ప్రభుత్వం కొలువు తీరలేదు,వారు తమతో ఎలా ఉంటారో తెలియదు కనుక రానున్న రోజుల్లో సిరియాను దెబ్బతీయాలంటే దాని పాటవాన్ని దెబ్బతీసేందుకు ఇజ్రాయిల్ పెద్ద ఎత్తున దాడులు చేస్తూ ఆయుధ ఫ్యాక్టరీలు, నౌకా దళం ఇతర మిలిటరీ వ్యవస్థలను నాశనం చేస్తున్నది. వాటిలో ఇరాన్, రష్యా సరఫరా చేసిన ఆయుధాలు, వాటి నిల్వకేంద్రాలు కూడా ఉన్నాయి. ఇదంతా అమెరికా కనుసన్నల్లో జరుగుతున్న దని వేరే చెప్పనవసరం లేదు. గత కొద్ది నెలలుగా లెబనాన్‌పై దాడి అక్కడ పెద్ద సాయుధ శక్తిగా ఉన్న హిజబుల్లాపై దాడులు, దాని నేతల హత్యలో ఇజ్రాయిల్ పాత్ర గురించి తెలిసిందే. సిరియాకు మద్దతుగా అది ఇంకేమాత్రం దాడులు చేసే స్థితిలో లేదని చెబుతు న్నారు. కొనసాగుతున్న ఉక్రెయిన్ సైనిక చర్య కారణంగా రష్యా, ఆంక్షల వలన ఇరాన్ మిలిటరీ సరఫరాలు కూడా తగ్గిపోయాయి. సిరియాలో ఉన్న తన నౌకా కేంద్రాన్ని రక్షించుకోవటంలోనే రష్యా మునిగి ఉంది. సిరియాలో అధికారాన్ని చేజిక్కించుకున్న హెచ్‌టిఎస్ సంస్థకు టర్కీ ప్రధాన మద్దతుదారుగా ఉంది. పరోక్షంగా ఇజ్రాయిల్ కూడా ఒక దశలో సాయం చేసిందని నిఘావర్గాలు చెబుతున్నాయి. అసద్ ప్రభుత్వం అణచివేతలకు పాల్పడిందనే విమర్శలు ఉన్నప్పటికీ అది ఇస్లామిక్ మత ఛాందసవాదాన్ని ప్రోత్సహించిన దాఖలాలు లేవు. ముస్లింలలో అనేక తెగలు ఉన్నాయి. అవి ఒక్కో ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నాయి. వాటిలో కర్దులు ఒకరు. ఇస్లామిక్ తీవ్ర వాద ఐసిస్, ఆల్‌ఖైదా కూడా అసద్‌ను వ్యతిరేకించాయి. వీటితో పాటు అమెరికా తనకు అనుకూలమైన శక్తులకు భారీఎత్తున సాయం చేసింది. అవేవీ అసద్ ప్రభుత్వాన్ని కదిలించలేక పోయాయి. సిరియాలో చమురు నిల్వలున్న ప్రాంతాల మీద అమెరికా ఆధిపత్యం ఉంది. అక్కడ దాని సైనికులు కూడా ఉన్నా రు. గతంలోనే సిరియాలోని గోలన్ గుట్టల ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించింది. కొంత ప్రాంతాన్ని ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణలో బఫర్‌జోన్‌గా ఉంచారు. అక్కడికి ఎవరూ ప్రవేశించకూడదు. అయితే డిసెంబరు ఎనిమిది నుంచి ఇజ్రాయిల్ దళాలు అతిక్రమించి సిరియాలోకి చొచ్చుకుపోయాయి.

ఇప్పుడు సిరియా భవితవ్యం ఏమిటి? అంటే ఎవరూ ఏమీ చెప్పలేని స్థితి.అమెరికా కుట్రలకు వ్యతిరేకంగా దశాబ్దాలపాటు జోక్యం చేసుకున్న రష్యా రానున్న రోజుల్లో ఎలాంటి పాత్ర పోషించేది తెలియదు.నూతన పాలకులు టర్కీ కనుసన్నలలో పని చేసే అవకాశం ఉంది. నాటోలో అది అమెరికా అనుయాయి.అదే సమయంలో కొన్ని అంశాలలో దానితో విబేధించి రష్యాతో సంబంధాలు కలిగి ఉంది. సిరియా పరిణామాల్లో రష్యా, అమెరికా రెండూ తమ ప్రభావాన్ని చూపేందుకు ప్రయత్నించాయి. దాన్ని అదుపులోకి తెచ్చుకొనేందుకు అమెరికా పెద్దఎత్తున తిరుగుబాటుదార్లను ప్రోత్సహించింది.ఇటీవల జరిగిన పరిణామాలను చూసినపుడు సిరియాలో ఇంక అమెరికా చేసేది ఏముంది అని కొందరు నిరుత్సాహాన్ని ప్రకటించారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన 1990 దశకం తరువాత "ఆపరేషన్ టింబర్ సైకామోర్ " పేరుతో అమెరికా భారీ మొత్తాలను సిరియాలో కుమ్మరించిందని చెబుతున్నారు. ఉదారవాద తిరుగుబాటుదార్ల ముసుగులో 2013 నుంచి 2017వరకు నాలుగేండ్లలో అమెరికా సిఐఏ ద్వారా వివిధ సంస్థలకు వంద కోట్ల డాలర్లకు పైగా అందచేసిందని అంచనా. ఆ తరువాత కూడా తరతమ తేడాలతో ఇదే విధంగా తిరుగుబాటుదార్లకు చేరుస్తున్నది. అసద్ వ్యతిరేకులకు మద్దతుతో పాటు సిరియాలో అమెరికాను కూడా వ్యతిరేకించే శక్తులను దెబ్బతీసేందుకు చూసింది. అమెరికా మిలిటరీ కూడా 50 కోట్ల డాలర్లతో తిరుగుబాటుదార్లకు శిక్షణ, ఆయుధాలను అంద చేసింది. ఇవన్నీ ఘోరంగా విఫలమ య్యాయి. టర్కీ మద్దతు ఉన్న తిరుగుబాటుదార్లు డమాస్కస్‌ను పట్టుకుంటారని కూడా అమెరికా ఊహించినట్లు కనపడదు.లేదా నిస్సహాయంగా ఉండిపోయిందని చెప్పవచ్చు. అందుకే ట్రంప్ అందని ద్రాక్ష పుల్లన అన్నట్లుగా మాట్లాడుతున్నాడు.

ఒబామా గనుక కాస్త ముందుగా జాగ్రత్తపడి ఉంటే అసద్ తొలగింపు మరింత వేగిరం, అమెరికా ప్రమేయం కూడా ఉండేదని రణోన్మాదులు కొందరు నిష్ఠూరాలాడుతున్నారు. అమెరికా మద్దతిచ్చిన మిలిటెంట్ సంస్థలన్నీ అంతర్గత కుమ్ములాటలు, అవినీతి, గూండాయిజాలతో కొట్టుకు చచ్చాయని, ఆల్‌ఖైదాకు ఆయుధాలు అమ్ముకున్నట్లు విమర్శిస్తున్నారు. ఈ శక్తులు అసద్ మీద ఒత్తిడి తెచ్చి అంతర్జాతీయ సమాజంతో చర్చలకు నెడతాయని అమెరికా ఊహించినదానికి భిన్నంగా అసద్ బలమైన శక్తితో అనేక నగరాలను స్వాధీనం చేసుకున్నట్లు సిరియాలో మాజీ అమెరికా రాయబారి రాబర్ట్ ఫోర్డ్ చెప్పాడు. సిఐఏ మద్దతు ఇచ్చిన తిరుగుబాటుదార్లు ఒక బాల ఖైదీ తలనరికే వీడియోను చూసిన డోనాల్డ్ ట్రంప్ సిరియా మీద ఆసక్తి కోల్పోయాడని, అమెరికా మిలిటరీ తరువాత సిరియాలోని కర్దులకు మద్దతు ఇవ్వటంపై కేంద్రీకరించిందని చెబుతున్నారు.

అమెరికా నుంచి నిధులు పొందిన ఫ్రీ సిరియన్ ఆర్మీ వంటి సంస్థలు చివరకు టర్కీ అనుకూల సిరియన్ నేషనల్ ఆర్మీగా మారిపోయాయని, వారు కర్దులపై లైంగికదాడులు, దోపిడీలకు పాల్పడటంతో అదే అమెరికా చివరికి మానవహక్కులకు భంగం కలిగించారనే పేరుతో ఆంక్షలు విధించిందని అంటున్నారు. చివరికి నవంబరు చివరివారంలో ఈ శక్తులు లూటీలకు పాల్పడుతుం డటంతో తాజాగా అధికారానికి వచ్చిన హెచ్‌టిఎస్ దళాలు వారిని అణచివేసి అరెస్టు చేశాయని, ఇలాంటి పనులు చేసిన తరువాత అమెరికాకు సిరియాలో ఇంక చేసేందుకు ఏమి మిగిలిందని ప్రశ్నిస్తున్నారు.ఈ విమర్శలన్నీ మరింత గట్టిగా వ్యవహరించలేదని, సిరియాను తమ అదుపులోకి తెచ్చుకోలేదని తప్ప పరాయి దేశంలో జోక్యం తప్పనే కోణం నుంచి కాదు. రాబోయే రోజుల్లో ఏమి జరిగినప్పటికీ అమెరికా డ్రైవర్ సీట్లో కూర్చొనే అవకాశం లేదని, చేసిన ఖర్చంతా వృధా అయిందని విమర్శిస్తున్నారు.

సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోయటంలో ఏకీభావంతో ఉన్న శక్తులన్నీ తరువాత అధికారాన్ని అలాగే పంచుకుంటాయని చెప్పలేకపోతున్నారు. లిబియాలో అమెరికాను వ్యతిరేకించిన గడాఫీ ప్రభుత్వాన్ని కూలదో సేందుకు నాటో కూటమి దేశాలన్నీ తిరుగుబాటు శక్తులను ప్రోత్సహించాయి, తీరా 2011లో గడాఫీ సర్కారు కూలిపోయిన తరువాత ఇప్పటి వరకు అధికారం కోసం కుమ్ములాడుకుంటూనే ఉన్నాయి. అదే స్థితి సిరియాలో తలెత్తవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికీ హెచ్‌టిఎస్‌ను ఉగ్రవాద సంస్థగా దాని నేత జొలానీ ఉగ్రవాదిగా వర్ణిస్తున్న అమెరికా రానున్న రోజుల్లో అతని నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడితే ఎలా వ్యవహరిస్తుందన్నది ప్రశ్న.అతనికీ అదే పరిస్థితి.

ఈ సంస్థ రానున్న రోజుల్లో ఇరాన్‌తో చేతులు కలపవచ్చని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అనుమానిస్తున్నాడు. అది గనుక తమపై దాడికి దిగితే ప్రతిస్పందన గట్టిగా ఉంటుందని, గత ప్రభుత్వానికి ఏమి జరిగిందో దీనికీ అంతే అని హెచ్చరించాడు. నూతన పాలకులతో రష్యా సంబంధాలు పెట్టుకోవచ్చని, ఇరాన్ కూడా అదే చేయవచ్చని కూడా పశ్చిమదేశాల పరిశీలకులు చెబుతున్నారు. సిరియాలో ఉన్న తమ సైన్యాన్ని వెనక్కు రప్పిస్తానని గతంలో డోనాల్డ్ ట్రంప్ చెప్పాడు. అయితే జనవరి 20న కొలువు తీరనున్న ట్రంప్ సర్కార్‌లో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న మార్కో రుబియో మాత్రం వేరుగా స్పందించాడు. రానున్న రోజుల్లో ఉగ్రవాద ముప్పు తలెత్తితే ఎదుర్కొనేందుకు అక్కడ తమ సైన్యం ఉండటం అవసరమని సెలవిచ్చాడు.సిరియాలో ఇప్పటికైతే పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ■



> **సిరియాలో అధికారాన్ని చేజిక్కించుకున్న హెచ్‌టిఎస్ సంస్థకు టర్కీ ప్రధాన మద్దతుదారుగా ఉంది. పరోక్షంగా ఇజ్రాయిల్ కూడా ఒక దశలో సాయం చేసిందని నిఘావర్గాలు చెబుతున్నాయి. అసద్ ప్రభుత్వం అణచివేతలకు పాల్పడిందనే విమర్శలు ఉన్నప్పటికీ అది ఇస్లామిక్ మత ఛాందసవాదాన్ని ప్రోత్సహించిన దాఖలాలు లేవు. ముస్లింలలో అనేక తెగలు ఉన్నాయి. అవి ఒక్కో ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నాయి. వాటిలో కర్దులు ఒకరు. ఇస్లామిక్ తీవ్రవాద ఐసిస్, ఆల్‌ఖైదా కూడా అసద్‌ను వ్యతిరేకించాయి. వీటితో పాటు అమెరికా తనకు అనుకూలమైన శక్తులకు భారీఎత్తున సాయం చేసింది. అవేవీ అసద్ ప్రభుత్వాన్ని కదిలించలేక పోయాయి. సిరియాలో చమురు నిల్వలున్న ప్రాంతాల మీద అమెరికా ఆధిపత్యం ఉంది. అక్కడ దాని సైనికులు కూడా ఉన్నారు. గతంలోనే సిరియాలోని గోలన్ గుట్టల ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించింది.**

> **సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోయటంలో ఏకీభావంతో ఉన్న శక్తులన్నీ తరువాత అధికారాన్ని అలాగే పంచుకుంటాయని చెప్పలేకపోతున్నారు. లిబియాలో అమెరికాను వ్యతిరేకించిన గడాఫీ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు నాటో కూటమి దేశాలన్నీ తిరుగుబాటు శక్తులను ప్రోత్సహించాయి, తీరా 2011లో గడాఫీ సర్కారు కూలిపోయిన తరువాత ఇప్పటి వరకు అధికారం కోసం కుమ్ములాడుకుంటూనే ఉన్నాయి. అదే స్థితి సిరియాలో తలెత్తవచ్చని పరిశీల కులు చెబుతున్నారు. ఇప్పటికీ హెచ్‌టిఎస్‌ను ఉగ్రవాద సంస్థగా దాని నేత జొలానీ ఉగ్రవాదిగా వర్ణిస్తున్న అమెరికా రానున్న రోజుల్లో అతని నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడితే ఎలా వ్యవహరిస్తుందన్నది ప్రశ్న.**

పెరుగుతున్న పట్టణ జనాభా - 'కాగ్' ఆందోళన

మన దేశంలో నగరాలు, పట్టణాలు సుస్థిర అభివృద్ధిని సాధించి అహ్లాదకర జీవనానికి ఉపాధి, ఉద్యోగాల కల్పనకు నెలవులుగా బాసిల్లాల్సి ఉంది. కానీ ప్రభుత్వాల అలక్ష్యం, పట్టణ స్థానిక సంస్థ దౌర్బల్యం, యంత్రాంగం ఉదాసీనత, వ్యవస్థీకృత అవినీతి మూలంగా ఇవి జీవకళను కోల్పోతున్నాయి. ఒకవైపు ఆదాయాల కొరత, మరో వైపు కిక్కిరిసిన జనసాంద్రతతో పట్టణాలు, నగరాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. వీటికి తోడ్పాటునందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలు, రాజ్యాంగం ద్వారా కల్పించ బడిన అధికారుల విభజన, స్వేచ్ఛ కల్పించాలి. బడ్జెట్‌లో నిధులు, వాటాలు పెంచాలి. తద్వారా మౌలిక వసతుల కల్పన పెరుగుతుంది. వ్యవస్థాగత నిర్లక్ష్యం మూలంగా చెరువులు,నాళాలు కబ్జాల కారణంగా వానాకాలంలో కొద్దిపాటి వర్షాలకే వరద నీరు ముంచెత్తడంతో పట్టణాలు,నగరాలు జనావాసాలకు వరద నీరు ముంచేస్తుంది. దీంతో కాలనీలు, రోడ్లు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ నిర్మాణాలు, నాలాల ఆక్రమణలతో పట్టణ, నగర ప్రజల్ని ఎప్పుడు ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అనే అంతుపట్టని వాతావరణం కనిపిస్తుంది. ఇటీవల హైదరాబాద్‌లో ఓ బాలుడు నాలలో పడి శవమై తేలాడు. ఇలాంటి ఘటనలు ప్రతి ఏడాది ఏదో ఓచోట జరుగుతూనే ఉన్నాయి. బాధిత కుటుంబాలకు కన్నీళ్లే మిగులుస్తున్నాయి.ప్రణాళిక బద్ధమైన పట్టణీకరణతోనే ప్రజా జీవితాలు మెరుగుపడటంతో పాటు ప్రగతి ప్రస్థానం చురుగ్గా ముందుకు



సాగుతుంది. పర్యావరణాన్ని దెబ్బతీయని రీతిలో వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, సంపదను సృష్టించడం తద్వారా అభివృద్ధికి నాందిగా మారుతాయి. అంతే కాదు, దేశంలోని గ్రామీణ ప్రజల జీవితాలు ఆర్థిక ఒడిదుడుకులతో ఉద్యోగ, ఉపాధి అవ కాశాల అన్వేషణలో పట్టణాల, నగరాల బాట పడుతున్న వారి సంఖ్య నానాటికి పెరిగిపోతోంది. ఈ వలసలతో పట్టణ భారతం జనాభా రాబోయే కాలంలో 90 కోట్లకు చేరుతుందని పరిశీలనలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో పట్టణాల, గ్రామాల మధ్య అభివృద్ధిలో సమతూకం పాటించాలి. పట్టణ(నగరా)ల్లో పెరుగుతున్న జనాభా తగినట్లుగా వసతుల కల్పనపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి.

దేశవ్యాప్తంగా నగర, పట్టణ స్థానిక సంస్థల్లో పరిస్థితులపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆందోళన వ్యక్తం చేస్తుంది. వనరులకు వ్యయానికి మధ్య తీవ్ర అంతరాన్ని కాగ్ ఎత్తి చూపింది. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లోని పట్టణ స్థానిక సంస్థల్లో ఈ అంతరం 42 శాతంగా ఉందని గుర్తించింది. ఇవి చేసే వ్యయంలో 29శాతం మాత్రమే ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి పనికి వెళ్తున్నదని వివరించింది. వీటిలో పనిచేసే సిబ్బందిలో సగటున 37శాతం ఖాళీలు ఉన్నాయి.రెండు తెలుగు రాష్ట్రాలతో సహా 18 రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉంది. మనదేశంలో పట్టణ స్థానిక సంస్థల అధికారాన్ని కల్పించే 74వ రాజ్యాంగ సవరణ 1993లో అమల్లోకి వచ్చింది. అయితే, 31 ఏండ్ల తర్వాత కూడా ఈ 18 రాష్ట్రాలు ఈ చట్టాన్ని పూర్తిగా అమలు చేయడం లేదని కాగ్ గుర్తించింది. 18 రాష్ట్రాల్లో 74 వ రాజ్యాంగ సవరణ అమలు విషయంలో ఆడిట్ నివేదికల పోలికలను కాగ్ ఇటీవల విడుదల చేసింది. తెలంగాణ, ఏపీలతో పాటు అస్సాం, ఛత్తీస్‌గఢ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కేరళ, కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, ఒడిస్సా, పంజాబ్, రాజస్థాన్, తమిళ నాడు, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మొత్తం 393 పట్టణ స్థానిక సంస్థ(యూఎల్ఎస్ జీ)లను ఇది కవర్ చేసింది. కాగ్ సమాచారం ప్రకారం.. పట్టణ సంస్థలు సగటున 32శాతం రెవెన్యూ సొంతంగా సమకూర్చుకుం టున్నాయి. మిగతాది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తుంది. పదహారు రాష్ట్రాల్లోని పట్టణ సంస్థలకు నియామకాల విషయంలో ఎలాంటి అధికారం లేకపోవడం గమనార్హం.

74వ రాజ్యాంగ సవరణ ప్రకారం రాష్ట్రాలు.. పట్టణ స్థానిక సంస్థలకు పద్దెనిమిది పనుల్ని పంపిణీ చేయాలి. అందులో పట్టణ ప్రణాళిక, భూమి విని యోగం, నిర్మాణ నియంత్రణ, నీటి సరఫరా, ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళిక, ప్రజారోగ్యం వంటివి ఇందులో ఉంటాయి. నాలుగు మాత్రమే పూర్తిగా స్వయం ప్రతిపత్తితో ఉన్నాయని కాగ్ పేర్కొన్నది. ప్రణాళిక వంటి కీలకమైన విధుల్లో రాష్ట్రాలు పట్టణ స్థానిక సంస్థలను భాగస్వామ్యం చేయాలని కాగ్ సిఫారసు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యం, రాజకీయ గ్రహణం వీడాలి. రోజురోజుకూ పెరిగిపోతున్న పట్టణ జనాభాకు ప్రణాళికాబద్ధమైన ప్రగతి చాలా అవసరమన్నది గుర్తించాలి.

మేకిరి దామోదర్, 9573666650

రాజకీయ నియంత్రృత్వానికే 'జమిలీ'!



షేక్ కరిముల్లా
9705450705

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం భారత్. గతంలో స్వేచ్ఛాయుతంగా, సమయానికి ఎన్నికలు సక్రమంగా జరిగేవి. రాను రానూ ఎన్నికల వ్యవస్థ ఒక తంతుగా మారి నవ్వుల పాలైంది. ఈవీఎంల ట్యాంపరింగ్ నుంచి మొదలుకుంటే ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజ కీయ పార్టీలకు అందుతున్న విరాళాలు, దానిమీద పార్లమెంట్ ఎన్నికల ముందు రేగిన దుమారం, ఓటుకు నోటు, ఎన్నికల వేళ పంచుతున్న డబ్బులు, పాలకవర్గాలు చేస్తున్న అధికార దుర్వినియోగం అంతా ఇంతా కాదు. పైగా కులం, మతం, దేవుడు, ప్రాంతం, భాష అంశాలతో ప్రజలను మభ్య పెట్టడం, విద్వేషాలు రెచ్చగొట్టడం మామూలై పోయింది. ఇలా అన్ని రాజకీయ పార్టీలు పూర్తిగా పతనమైపోయాయి. వామ పక్షాలొక్కటే ప్రజలకు సరైన దారిదీపంగా వెలుగొందుతున్నాయి. అయితే సరైన ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయాలను గుర్తించని ప్రజలు కార్పొ రేట్ శక్తులకు కొమ్ముకాసే పార్టీలనే మారుస్తూ ఎన్ను కుంటూ వస్తున్నాయి. కానీ, రేపటి రోజుల్లో దాని క్కూడా అవకాశం లేకుండా ఏకఛత్రాధిపత్య పాలన సాగే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి. మరి ఇలాంటి నియంతృ త్వ విధానాలకు అడ్డుకట్ట వేయలేమా?

నేడు దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. దేశంలో ప్రతిపక్షమే లేకుండా చేసే వ్యవస్థను సృష్టించటం కోసం బీజేపీ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నది. ఇందుకు తాజా ఉదాహరణే జమిలీ ఎన్నికలు. కిందపడ్డా నాదే పై చేయి అన్నట్టుగా ఉంది మోడీ ప్రభుత్వ తీరు. ఏకపక్ష నిరంకుశ విధానాలు ఇక చెల్లవంటూ 2019 గెలిచిన 303 స్థానాల నుంచి 63 స్థానాలు కోతపెట్టి 240 స్థానాలకు పరిమితం చేసినా, ప్రాంతీయ పార్టీలపై ఆధార పడి ప్రభుత్వం ఏర్పాటు చేసినా పాలనా పరమైన నిరంకుశ విధానాలు ఈ పార్టీ అనుసరిస్తూనే ఉంది. ప్రజల మౌలిక అవసరాలైన ధరలు, పేదరికం, నిరుద్యోగం, నాణ్యమైన విద్య, వైద్యం అందించే విషయంలో ఏంచేయకుండా ప్రజలకు కష్టాలు, కన్నీళ్లు మిగిల్చింది. ఈ ప్రజల ప్రధాన సమస్యల నుంచి పక్కదారి పట్టించటానికి జిమ్మిక్కులు, ఎత్తులు వేయడం చేస్తూనే ఉంది. భిన్న సంస్కృతులు, బహుళత్వం గల ఈ దేశంలో ఒకే మతం, ఒకే రకమైన పన్ను, ఒకే రకమైన తిండి తినాలని, ఒకే భాష (హిందీ) ఉండాలని మొత్తం ప్రజల సంస్కృతిపైనే దాడిచేస్తోంది. ఇప్పుడు ఆచరణా సాధ్యం కాని, అవసరం లేని ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటూ జమిలీ ఎన్నికలకు శ్రీకారం చుట్టింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీ వేయడం, ఆ కమిటీ కొద్దికాలంలోనే 'బాగా కష్టపడి' 18వేల పేజీల నివేదిక సమర్పించడం, దీనికి కేబినేట్ ఆమోదం తెలపడం చకచకా జరిగిపోయాయి.

దేశంలో 47రాజకీయ పార్టీలలో 32 పార్టీలు జమిలీ ఎన్నికలకు అనుకూలత తెలిపాయని, 21వేల సూచనలు అందాయని, అందులో 81శాతం మంది జమిలీ ఎన్నికలను సమర్థించాయని కమిటీ చెబుతున్నది. దేశంలో ఉన్న ఓటర్ల సంఖ్యతో పోలిస్తే ఈ సూచనలు చేసిన 21వేల మంది అభిప్రాయానికి ఏ మాత్రం విలువ ఉంటుందో కమిటీయే చెప్పాలి. ఏడు దేశాల్లో జమిలీ ఎన్నికల గురించి అధ్యయనం చేశామని చెప్పింది. తొలిదశలో లోక్‌సభ, శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు జరిపి, రెండో దశలో పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్లకు వంద రోజుల వ్యవధిలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పింది. ఈ జమిలీ ఎన్నికల అమలుకు కనీసం ఆరు రాజ్యాంగ సవరణలు చేయ వలసి ఉంటుందని చెప్పింది. 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయడంతో పాటు, లోకసభ, రాజ్యసభ కాలపరిమితిని నిర్ణయించే 83వ ఆర్టికల్, రాష్ట్రాల శాసనసభల కాలపరిమితి నిర్ణయించే 172వ ఆర్టికల్, ఎన్నికల సంఘం అధికారులకు సంబంధించిన 324వ ఆర్టికల్, స్థానిక పంచాయతీరాజ్‌కు సంబంధించిన ఆర్టికల్స్ 243 కె, 243జెడ్, ఏలను కూడా సవరించాలని సూచించింది. ఈ రాజ్యాంగ సవరణలు జరగాలంటే లోక్‌సభ, రాజ్యసభలలో రెండు బై మూడోవంతు మెజార్టీతో ఆమోదించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉభయ సభల్లో బీజేపీకి ఉన్నబలం సరిపోదు. స్థానిక సంస్థల రాజ్యాంగ సవరణలకు సగం రాష్ట్రాల శాసనసభలు ఆమోదించాల్సి ఉంటుంది. ఇదంతా సాధ్యమయ్యే పనేనా?



స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో అంటే 1952, 1957, 1962లలో జమిలీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కేంద్ర, రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత కొనసాగింది. 1967 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎనిమిది రాష్ట్రాలలో ఓటమి చెందింది. తదుపరి చాలా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. 1989 నుంచి 2014 వరకు కేంద్రంలో, రాష్ట్రాలలో ప్రస్తుతం ఇప్పుడు కూడా సంకీర్ణ (కూటమి) ప్రభుత్వాలు నడుస్తున్నాయి. దేశంలోని భిన్న సంస్కృతులు, చారిత్రక పరిస్థితుల రీత్యా బహుళ పార్టీలు మనుగడలో ఉన్నాయి. ఈ తరుణంలో జమిలీ ఎన్నికలు ఆచరణలో సాధ్యం కాదు. గతంలో 1989, 1996, 1998లలో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడి కీచులాడుకుని ముందే రద్దయ్యాయి. జమిలీ ఎన్నికల వ్యవస్థలో దీనికి సమాధానం లేదు. ఎన్నికల తదనంతరం లోక్‌సభ, శాసనసభలు ముందే రద్దయితే పరిస్థితి ఏమిటి? రాజ్యాంగంలో 83వ ఆర్టికల్ లోక్‌సభ, 172వ ఆర్టికల్ శాసనసభలు ముందే రద్దు కావటానికి అవకాశమిచ్చాయి కదా? ఏదైనా జమిలీ ఎన్నికల ప్రక్రియ మొత్తం రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా ఉంది. రాజ్యాంగంలో ఒకటవ నిబంధన భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా పేర్కొంది. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా బలంగా సమాఖ్య స్ఫూర్తితో మెలగాలని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సూచించారు. ఈ జమిలీ ఎన్నికల ద్వారా బీజేపీ సమాఖ్య విధానాన్ని దెబ్బకొట్టి ఏకపార్టీ (బీజేపీ) నియంతృత్వం కోసం పాకులాడుతోంది. అన్ని రాష్ట్రాలలో బీజేపీ మాత్రమే అధికారంలో ఉండాలని కలలు కంటూ నిరంకుశ పోకడలు పోతున్నది. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని పథకం పన్నుతున్నది.

ఆది నుంచి బీజేపీ మాతృసంస్థ ఆరెస్సెస్ ప్రజాస్వామిక, లౌకిక విలువలకు, రాజ్యాంగానికి విరుద్ధంగా నడుస్తున్నది. దీని పుట్టుకలోనే ఆ స్వభావం ఉంది. 1947 ఆగస్టులో త్రివర్ణ జాతీయ జెండాను గౌరవించబోమని ఆరెస్సెస్ ప్రకటించింది. నాగపూర్‌లోని తమ కేంద్ర కార్యాలయంపై 2002 వరకు జాతీయ జెండాను కూడా ఎగురవేయలేదు. ఇప్పుడు ఈ 'అపరదేశభక్తులే' మొన్న ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగ' అంటూ ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అలాగే 1949 నవంబర్‌లో మనుస్మృతి తప్పితే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అంగీకరించమని ప్రకటించారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటిస్తూనేవున్నారు. ఇలా చాపకింద నీరులా భిన్నత్వంలో ఏకత్వంగా కలిసిమెలిసి ఉండే ప్రజల్ని మొత్తంగా హిందూ దేశంగా విభజించాలని చూస్తున్నారు. ఏదైనా ప్రజలేచరిత్ర నిర్మాతలు. వీరి నియంతృత్వ విధానాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రగతిశీల, లౌకికవాద శక్తులు, ప్రజలపై ఉంది. ఈ ఆగడాలపై పౌరసమాజంలో చర్చ జరగాలి. వీరి నిరంకుశత్వాన్ని తిప్పికొట్టాలి. రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్య విలువలను రక్షించుకోవాలి. ■



విద్యామంత్రిని నియమించాలి

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యాశాఖకు మంత్రిని నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏండ్లు గడుస్తున్నా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని విమర్శించారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని కోరారు. విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి నరసింహారావు, ఎస్ అనిల్, ఎమ్ నరేందర్, భాస్కర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, సాయి, కోశాధికారి సురేష్, రాష్ట్ర నాయకులు వి వెంకటేష్, రాకేష్, సీతారాం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విమానాల్లో నకిలీ బాంబు బెదిరింపులకు

- రూ. 1 కోటి జరిమానా, ప్రయాణాలపై నిషేధం : కేంద్రం కొత్త నిబంధనలు



న్యూఢిల్లీ : విమానాల్లో నకిలీ బాంబు బెదిరింపు నేరాలపై కేంద్రం కొరడా ఝులిపించింది. ఈ నేరాలకు పాల్పడే వారికి రూ. 1 కోటి వరకూ జరిమానా విధించే విధంగా ఎయిర్ క్రాఫ్ట్ (సెక్యూరిటీ) రూల్స్ 2023ను సవరించింది. 'ఎయిర్ క్రాఫ్ట్, ఏరో డ్రోమ్, పౌరవిమానం యొక్క భద్రత, రక్షణకు హాని కలిగించే విధంగా తప్పుడు సమాచారాన్ని సృష్టించడం, వ్యాప్తి చేయడం శిక్షార్హమైనది' పేర్కొంది. సాధారణ ప్రజలు, ప్రయాణీకులు, విమాన సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బందిలో భయాందోళనలు కలిగించడం, పౌర విమాన కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం కూడా శిక్షార్హమైన నేరాలుగా స్పష్టం చేసింది. అలాగే కొత్తగా పొందుపర్చిన నిబంధన 29ఎ ప్రకారం, ఇలాంటి వ్యక్తులకు లేదా సమూహాలకు విమాన ప్రయాణం నిషేధం విధించే అధికారాన్ని డైరక్టర్ జనరల్‌కు కట్టబెట్టింది. ఈ మేరకు ఈ నెల 16న కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఒక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇటీవల కాలంలో విమానాలకు బాంబు బెదిరింపులు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్‌లో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబర్ 14 వరకూ విమానయాన సంస్థలకు మొత్తంగా 999 నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి. కేవలం అక్టోబర్ నెలలో 666 బెదిరింపులు వచ్చాయి. అయితే వీటిలో ఇప్పటి వరకూ ఇద్దర్ని మాత్రమే పోలీసులు అదుపులోకి తీసుకోగలిగారు. ఇందుకు ఇప్పటి వరకూ ఉన్న నిబంధనలే కారణమని పోలీసులు వివరణ ఇస్తున్నారు.

మాస్కోలో పేలుడు

- రష్యా ఉన్నత స్థాయి సైనిక జనరల్ సహా ఇద్దరు మృతి



మాస్కో : రష్యా రాజధాని మాస్కోలో మంగళవారం జరిగిన బాంబు దాడిలో అత్యంత సీనియర్ మిలటరీ నేత, రష్యా ఆర్మీకి చెందిన రసాయన ఆయుధాల విభాగాధిపతి ఇగర్ కిరిలొవ్ మరణించారు. కాగా ఈ బాంబు దాడి జరిపింది తామేనని ఉక్రెయిన్ ప్రకటించింది. ఆగ్నేయ మాస్కోలో ఒక అపార్ట్‌మెంట్ భవనం వెలుపల నిలిపి వుంచిన స్కూటర్‌లో పేలుడు పదార్థం పెట్టారు. దాన్ని పేల్చివేయడంతో ఇగర్ కిరిలొవ్ ఆయన అసిస్టెంట్ చనిపోయారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌లో రష్యా బలగాలు విజయం సాధించాయని అధ్యక్షుడు పుతిన్ చెప్పుకున్న మరుసటి రోజే రాజధానిలోని నివాస ప్రాంతంలో ఈ దాడి జరగడం గమనార్హం. రష్యా సైన్యంలో రసాయన, జీవ, రేడియోలాజికల్ ఆయుధాల విభాగానికి కిరిలొవ్ (54) నేతృత్వం వహిస్తున్నారు. కాగా, కిరిలొవ్‌ను యుద్ధ నేరస్తుడిగా ప్రకటిస్తూ స్పెషల్ ఆపరేషన్‌లో భాగంగానే ఈ పేలుడు జరిపినట్లు ఉక్రెయిన్‌కి చెందిన ఎస్‌బియు సెక్యూరిటీ సర్వీస్ వర్గాలు తెలిపాయి. పేలుడు ధాటికి ఆ భవనంలోని పలు కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ముందు తలుపు దారుణంగా దెబ్బతింది. ఈ దాడిని తీవ్రవాద చర్యగా రష్యా అధికారులు పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. యుద్ధ రంగంలో నిషేధించిన రసాయన ఆయుధాలను ఉక్రెయిన్‌పై వినియోగించారని, ఆ రకంగా కిరిలొవ్ యుద్ధ నేరస్తుడని ఉక్రెయిన్ చెబుతోంది. యుద్ధ నేరాలకు ప్రతీకారం తప్పదని ఆ వర్గాలు హెచ్చరించాయి.

2023-24లో 1,394 బ్యాచ్‌ల ఔషధాలు రీకాల్



న్యూఢిల్లీ : నాణ్యతా పరీక్షల్లో విఫలమైనందుకు దేశవ్యాప్తంగా 2023-24లో 1,394 బ్యాచ్‌ల ఔషధాలను రీకాల్ చేశారు. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ మంగళవారం రాజ్యసభలో వెల్లడించారు. అంతకు ముందు ఏడాది 2022-23లో 1,71 బ్యాచ్‌ల ఔషధాలను రీకాల్ చేసినట్లు తెలిపారు. 2023-24లో 2,988 ఔషధ నమూనాలను ప్రామాణిక నాణ్యతలకు అనుగుణంగా లేవని గుర్తించినట్లు, 282 ఔషధ నమూనాలు నకిలీ లేదా కల్తీగా గుర్తించినట్లు చెప్పారు. వీటిపై 604 విచారణలు ప్రారంభించినట్లు తెలిపారు. 2023-24లో మొత్తంగా 1,06,150 ఔషధ నమూనాలను పరీక్షించినట్లు చెప్పారు.

రానిటిడిన్‌ను నిషేధించే ప్రతిపాదన లేదు

కడుపులో యాసిడ్‌ను తగ్గించడానికి ఉపయోగించే రానిటిడిన్ ఔషధాన్ని దేశంలో నిషేధించే యోచన కేంద్ర ప్రభుత్వం వద్ద లేదని మంత్రి అనుప్రియా పటేల్ తెలిపారు. రానిటిడిన్‌లో ఎన్-నైట్రోసోడిమెథైలమైన్ (ఎన్‌డిఎంఎ) ఉనికిని యుఎస్‌ఎఫ్‌డిఎ, ఇఎంఎ వంటి సంస్థలు గుర్తించినట్లు వార్తలు నేపథ్యంలో ఈ ఔషధాన్ని కేంద్రం సమీక్షించిందా.. నిషేధం విధించే ఆలోచన ఉందా అని అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి సమాధానం రాతపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ) రానిటిడిన్ శాంపిల్స్‌ను పరీక్షిస్తోందని తెలిపారు. అయితే ప్రస్తుతానికి దేశంలో రానిటిడిన్ తయారీ, పంపిణీ, అమ్మకాలను నిషేధించే ప్రతిపాదన లేదని మంత్రి చెప్పారు.

నయా ఉదారవాదాన్ని నిరోధించే సాధనం

బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణమే లక్ష్యం : 20ఏండ్ల అల్బా-టీసీపీ ప్రస్థానం..



బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణమే లక్ష్యంగా అల్బా-టీసీపీ (బొలివారియన్ అలయన్స్ ఫర్ ది పీపుల్స్ ఆఫ్ అవర్ అమెరికా-పీపుల్స్ ట్రేడ్ (ట్రియటీ) ఏర్పడింది. ఇది ప్రజల కోసం వారి ప్రయోజనాల కోసం ఏర్పడిన కూటమి మాత్రమే, అంతేకానీ ఆధిపత్య రాజకీయ, ఆర్థిక సంపన్నుల కోసం ఏర్పడింది కాదని అల్బా-టీసీపీ కార్యదర్శి జార్జి అరెజా వ్యాఖ్యానించారు. మరే అంతర్జాతీయ సంస్థ మాదిరిగా కాకుండా ఈ సంస్థ నిర్దిష్ట కార్యాచరణ ద్వారా తన ప్రధాన లక్ష్యాలను నెరవేరుస్తోంది, విజయాలను సాధిస్తోంది. ప్రజలు, వారి సంక్షేమం ఈ సంస్థ కీలక లక్ష్యంగా వుంది. ప్రపంచంలో మరే కూటమి ఈ రీతిన లేదు. పెట్టుబడిదారీవాదానికి, నయా ఉదారవాదానికి కచ్చితమైన ప్రత్యామ్నాయ ప్రతిపాదనే ఈ కూటమి అని వెనిజులా అధ్యక్షుడు చావెజ్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సి వుంది.

ఈ ప్రాంతీయ సమగ్ర యంత్రాంగం ఏర్పడి ఇప్పటికి 20ఏళ్లు పూర్తయ్యాయి. "మనందరం సమైక్యంగా వుండాలన్న భావనను అర్థం చేసుకోలేకపోతే ఏ దేశాలైనా అవి ఎంత పెద్దవైనా సరే స్వతంత్రంగా, సంపద్వంతంగా వుండలేవు. బహుళ ధ్రువ ప్రపంచానికి ఇది చాలా అవశ్యం. లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలు కలిపితే అత్యంత శక్తివంతమైన ధ్రువాల్లో ఒకటిగా వుంటాయి." అని అరెజా వ్యాఖ్యానించారు. అప్పటి క్యూబా అధ్యక్షుడు ఫైడెల్ కాస్ట్రో, వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్‌లు సంయుక్త డిక్లరేషన్‌పై సంతకాలు చేయడం ద్వారా 2004 డిసెంబరు 14న అల్బా-టిసిపిని క్యూబా రాజధాని హవానాలో ఏర్పాటైంది. పది సభ్య దేశాలు కాగా, నాలుగు దేశాలు ప్రత్యేక అతిథి దేశాలుగా వున్నాయి. ఈ సందర్భంగా అరెజా ఒక సందేశం విడుదల చేశారు. ఈ 20ఏళ్ళ కాలంలో ఈ కూటమిలోని సభ్య దేశాలైన వెనిజులా, బొలీవియా, ఈక్వెడార్, హోండూరస్, నికరాగ్వా, క్యూబాలు సామ్రాజ్యవాద శక్తుల కుట్రలు, కుతంత్రాలకు బలయ్యాయి. సామ్రాజ్యవాద దేశాల ఆంక్షలు, జోక్యందారీ విధానాలతో ఈనాటికీ అనేక ఇక్కట్లు పడుతున్నాయని ఆ సందేశం పేర్కొంది. అల్బా-టిసిపి 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక టెలివిజన్ కార్యక్రమంలో అరెజా మాట్లాడారు. బహుళ ధ్రువ ప్రపంచాన్ని మరింత సంఘటితం చేసేందుకు ప్రజలకు ఈ సంస్థ మార్గాన్ని సుగమం చేసిందన్నారు.

మరింత మెరుగైన పంథాను మానవాళి ఎంపిక చేసుకోగలదని అల్బా-టీసీపీ ధృఢంగా విశ్వసిస్తుందని చెప్పారు. మన ప్రజలకు అంతిమ లక్ష్యం బహుళ ధ్రువ ప్రపంచ ఏర్పాటేనని స్పష్టం చేస్తోందన్నారు. ప్రజల సుఖ సంతోషాల కోసం అవసరమైన రాజకీయ, ఆర్థిక శక్తి సామర్థ్యాలను మనం సముపార్జించుకోవాల్సి వుందన్నారు. గాజాలో, లెబనాన్‌లో ఇజ్రాయిల్ మారణహోమాన్ని, ఊచకోతను వెంటనే ఖండించిన అంతర్జాతీయ సంస్థ అల్బా-టీసీపీనే అని అరెజా చెప్పారు.

శాశ్వత అతిథిగా పాలస్తీనా

20ఏళ్ళ ప్రస్థానానికి గుర్తుగా సామాజిక ఉద్యమాలు, రాజకీయ పార్టీలు, దేశాధినేతలందరూ కారకస్‌లో ఈ నెల 154న సమావేశమయ్యారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో సారధ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రత్యామ్నాయ అభివృద్ధి పంథాలను కోరుకుంటున్న దేశాల మధ్య సంఘీభావం ప్రాముఖ్యతను ఈ సమావేశం నొక్కి చెప్పింది. సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా పోరాడే ప్రజల మధ్య ఎలాంటి హద్దులు లేని సమైక్యత, సంఘీభావం అవశ్యమని స్పష్టం చేసింది. పాలస్తీనాను కూడా సోదర దేశంగా తమలో చేర్చుకున్నట్లు ప్రస్తుత సమావేశంలో ప్రకటించారు. శాశ్వత అతిథిగా చేర్చారు. ఈ మేరకు ఒక తీర్మానం ఆమోదించారు. పాలస్తీనియన్ల ఊచకోతను వారు తీవ్రంగా ఖండించారు. అక్రమంగా భూభాగాలను ఇజ్రాయిల్ ఆక్రమించుకోవడాన్ని తీవ్రంగా నిరసించారు. ఈ సందర్భంగా పాలస్తీనా వ్యవహారాల సలహాదారు రియాద్ అల్ మల్కి మాట్లాడుతూ, న్యాయం పక్షాన నిలుచున్న వారిని చరిత్ర ఎన్నటికీ గుర్తుంచుకుంటుందని వ్యాఖ్యానించారు.చివరగా మరింత సమాన అవకాశాలు కల ప్రపంచం కోసం జరిపే పోరాటంలో అల్బా-టీసీపీ చారిత్రక ప్రాధాన్యతను ప్రముఖంగా తెలియచేస్తూ సభ్య దేశాలు సంయుక్త డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయి. సమగ్ర అభివృద్ధి, సామాజిక సమానత్వానికి హామీ కల్పించడం, నాణ్యత గల జీవితాన్ని అందించడం, స్వాతంత్ర్యం, స్వయం నిర్ణయాధికారం, ప్రజల గుర్తింపునకు హామీ కల్పించేందుకు దోహదపడడం అల్బా-టీసీపీ వ్యవస్థాపక లక్ష్యాలని ఆ సంస్థ అధికార వెబ్‌సైట్ పేర్కొంది.



మంచుకురిసే వేళలో.. హిమగడ్డలా జలపాతాలు..

బారాముల్లా: శీతాకాలంలో చలి చంపేస్తోంది. ఉష్ణోగ్రతలు సున్నా కంటే తక్కువ (మైనస్)డిగ్రీలకు పడిపోతోంది. శ్రీనగర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 5.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఓ వైపు మంచు..మరోవైపు కాశ్మీర్ లోయలో చలిగాలులు తీవ్రమవుతున్నాయి. జలపాతాలు కాస్త హిమగడ్డల్లా మారిపోతున్నాయి. ఉత్తర కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని టాంగ్‌మార్గ్ వద్ద ఘనీభవించిన డ్రంగ్ జలపాతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. గడ్డకట్టిన జలపాతాలు..ఫౌంటెన్లను చూడటానికి పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు.

మళ్లీ తీవ్రమైన ఢిల్లీ వాయు కాలుష్యం



న్యూఢిల్లీ : మంగళవారం నాటికి ఢిల్లీలో వాయు కాలుష్యం మళ్లీ తీవ్రతరమయింది. 400 మార్క్‌ను దాటి 'తీవ్రమైన కేటగిరి'లోకి పడిపోయింది. కమీషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూఎం) గణాంకాల ప్రకారం మంగళవారం ఉదయం 7 గంటలకు ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) 421గా ఉంది. ఆనంద్ విహార్, అశోక్ విహార్, బవానా, జహంగీర్‌పూర్, అలీపూర్‌తో సహా అనేక ప్రాంతాల్లో ఎక్యూఐ 400 నుంచి 470గా ఉంది. దీని ప్రకారం ఢిల్లీలో గాలి నాణ్యతను 'వెరీ పూర్' కేటగిరిలో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) వర్గీకరించింది. మరోవైపు ఢిల్లీలోని కనిష్ఠ ఉష్ణోగ్రత 5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయిందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది.

సీఆర్టీలను రెగ్యులరైజ్ చేయండి

గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శికి ఎస్టీయూటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆయా ఐటీడీఏ ప్రాంతాల్లో వివిధ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్ (సీఆర్టీ)లను రెగ్యులరైజ్ చేయాలని ఎస్టీయూటీఎస్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ శరత్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. రెగ్యులరైజ్ అయ్యేంతవరకు మినిమమ్ బేసిక్ పే ఇవ్వాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ విభాగంలో సుమారుగా రెండు వేల మంది సీఆర్టీలు ఏండ్ల తరబడి పనిచేస్తున్నారని తెలిపారు. వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 16 నుంచి నిరవధిక మెరుపు సమ్మె చేస్తున్నారని పేర్కొన్నారు. వారికి పనికి తగిన వేతనం లభించడం లేదనీ, ఉద్యోగ భద్రత లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని వివరించారు. వారి సేవలకు గాను ప్రభుత్వ, విద్యా శాఖ నియామకాల్లో వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జుట్టు గజేందర్ పాల్గొన్నారు

సంఘటిత ఉద్యమాలే సమస్యలను పరిష్కరిస్తాయి

- టాప్ర ఉపాధ్యక్షులు యు.ఆంజనేయులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలు సంఘటితంగా ఉద్యమాలు చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ ఆల్ పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్ల సంఘం (టాప్ర) రాష్ట్ర ఉపాధ్యక్షులు యు ఆంజనేయులు అన్నారు. జీఎస్ నకారా సుప్రీం కోర్టులో పెన్షనర్ల సమస్యల విషయంలో చారిత్రాత్మక తీర్పుని సాధించిన రోజు డిసెంబర్ 17ని జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని జరుపుతారని చెప్పారు.

పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని టాప్ర రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంజనేయులు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో టాప్ర ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి, నాయకులు నాగేశ్వర్ రావు, ఎంఎస్ రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, రామచంద్ర, ఎస్ సోమయ్య, ఎం జనార్ధన్ రెడ్డి, సి కమలకుమారి, కృష్ణారావు, జి అశోక్, కృష్ణమోహన్, కొండల్ రావు, రామకృష్ణ, కె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిక్రూట్‌మెంట్ పరీక్షలు ఇక ఎన్టీఏ నిర్వహించదు

- కేంద్ర మంత్రి ప్రధాన్ వెల్లడి



న్యూఢిల్లీ : కొత్త సంవత్సరం నుండి ఇక ఎటువంటి రిక్రూట్‌మెంట్ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించబోదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఉన్నత విద్యకు సంబంధించిన ప్రవేశ పరీక్షలపై మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తుందని స్పష్టం చేశారు. మెడికల్ ఎంట్రన్స్ నీట్ పరీక్షా పత్రం లీక్, తదనంతరం లీక్‌ల అనుమానాలతో పలు పరీక్షలు రద్దు అయిన నేపథ్యంలో ఈ ఏడాది ప్రారంభంలో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సిఫారసుల మేరకు పరీక్షల సంస్కరణలు తీసుకువచ్చారు. అందులో భాగంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నారు. సాంప్రదాయపద్ధతిలో పెన్ను, పేపర్‌తో నిర్వహించాలా లేక కంప్యూటర్‌తో పరీక్ష నిర్వహించాలా అనే విషయమై ఆరోగ్య మంత్రిత్వ శాఖతో విద్యా శాఖ చర్చలు జరుపుతోంది. కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)-యూజీ ని ఏడాదికి ఒకసారి మాత్రమే నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. సమీప భవిష్యత్తులో కంప్యూటర్ సహాయంతో, సాంకేతి ఆధారిత ప్రవేశపరీక్షలకు మారాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. కొత్త సంవత్సరంలో ఎన్టీఏను పునర్వ్యవస్థీకరించనున్నట్లు మంత్రి తెలిపారు. కనీసం పది కొత్త పదవులను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇంకా పనితీరులో కూడా చాలా మార్పులు వస్తాయన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేని రీతిలో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

లిబియాలో రాజకీయ ప్రతిష్టంభన పరిష్కారానికి

ఐక్యరాజ్యసమితి కొత్త ప్రయత్నాలు



లిబియాలోని ఐక్యరాజ్యసమితి మిషన్ సమస్యలను పరిష్కరించడానికి, చాలా కాలంగా ఆలస్యమైన ఎన్నికలను నిర్వహించడానికి కొత్తగా చొరవను తీసుకుంది. దశాబ్దం క్రితం నాటో మద్దతుతో జరిగిన తిరుగుబాటు మాజీ నాయకుడు ముయమ్మర్ గడాఫీని పదవీచ్యుతుడిని చేసినప్పటి నుంచి ఆ ఉత్తర ఆఫ్రికా దేశం పోటీ ప్రభుత్వాల అరాచకంతో ఛిన్నాభిన్నమైంది. ఐక్యరాజ్యసమితి మిషన్ తాత్కాలిక అధిపతి, లిబియాకు డిప్యూటీ ప్రత్యేక రాయబారి స్టెఫానీ ఖౌరీ సోమవారం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరిగిన సమావేశంలో ఈ ప్రకటన చేశారు. "ఎన్నికల చట్రంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి, సాధారణ ఎన్నికలు నిర్వహించడానికి, లిబియన్లందరికీ ఒకే ప్రభుత్వానికి మార్గం సుగమం చేయడానికి ఐక్యరాజ్యసమితి మిషన్ ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయాలని భావిస్తోంది" అని ఆమె పేర్కొంది. సమయానుకూల లిబియా నిపుణుల కమిటీ నిర్ణయాలు తీసుకోవడానికి సంభాషణల సమూహం కాదని, లిబియా నిర్ణయాధికారులు తదుపరి దశలో పరిగణించవలసిన ఎంపికలను రూపొందించేదని ఖౌరీ స్పష్టం చేశారు. 2011లో గడాఫీ పదవీచ్యుతి, ఉరిశిక్ష తర్వాత లిబియా బలహీనపడింది. ప్రత్యర్థి వర్గాలు ఒకప్పటి సంపన్న దేశంలోని వివిధ ప్రాంతాలను నియంత్రిస్తున్నాయి. ప్రత్యర్థి అధికారులు రాజధాని ట్రిపోలి, తూర్పు నగరం బెంఘాజీలో ఉన్నారు. వారిని ఏకం చేయడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి, కానీ అవన్నీ విఫలమయ్యాయి. అభ్యర్థుల అర్హత, నియమాలపై భిన్నాభిప్రాయాల కారణంగా, ఫలితాలను ధవీకరించడానికి సంబంధించిన వాటితో సహా, డిసెంబర్ 2021లో జరగాల్సిన ఎన్నికలు చివరి నిమిషంలో రద్దు చేయబడ్డాయి. ప్రధాన మంత్రి అబ్దుల్ హమిద్ అల్- ద్బీబా నేతత్వంలోని తాత్కాలిక జాతీయ ఐక్యత ప్రభుత్వం (జీఎన్‌యూ) ఎన్నికలకు సిద్ధం కావడానికి ఐక్యరాజ్యసమితి మద్దతుతో కూడిన ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేయబడింది. లిబియా పార్లమెంట్ ఇకపై తాత్కాలిక జాతీయ ఐక్యత ప్రభుత్వ చట్టబద్ధతను గుర్తించదు. కానీ ఎన్నికలు విజయవంతంగా జరిగినప్పుడు మాత్రమే అధికారాన్ని వారసుడికి అప్పగిస్తానని ద్బీబా చెప్పారు.

పరిష్కరించబడని రాజకీయ సమస్యలు, లిబియా జాతీయ ఐక్యత, ప్రాదేశిక సమగ్రతకు ప్రమాదకారులుగా ఉన్నాయని, చమురు సంపన్న దేశ పరివర్తన నిర్మాణాన్ని బలహీనపరుస్తున్నాయని సోమవారంనాడు ఖౌరీ హెచ్చరించారు. ఇటీవలి వారాల్లో, మిషన్ చొరవలోని ప్రధాన అంశాలను లిబియా, ప్రాంతీయ, అంతర్జాతీయ భాగస్వాములతో చర్చించానని ఆమె జోడించారు. ఆదివారం రాత్రి, లిబియన్లతో రాజకీయ ప్రతిష్టంభనను అధిగమించడానికి తమ ప్రణాళికను వివరించానని ఐక్యరాజ్యసమితి మిషన్ తాత్కాలిక అధిపతి చెప్పారు. ఎన్నికలకు దారితీయని ప్రణాళికలను పునరావతం చేసినందుకు లిబియా ప్రజలకు క్షమాపణ చెప్పాలని దీనికి ప్రతిస్పందనగా, ఐక్యరాజ్యసమితిలో లిబియా శాశ్వత ప్రతినిధి, ట్రిపోలిలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తాహెర్ ఎల్-సోన్నీ భద్రతా మండలి సభ్యులను కోరారు. మిగిలిన విభేదాలను అధిగమించడానికి జాతీయ స్థాయిలో చర్చించటమే ఉత్తమ మార్గమని, తద్వారా మాత్రమే సార్వత్రిక ఎన్నికలను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి ఏకాభిప్రాయాన్ని సాధించగలం అని రాయబారి పేర్కొన్నారు.

దక్షిణ కొరియా అధ్యక్షుడికి రెండోసారి సమన్లు

- హాజరు కాకపోతే ఇక అరెస్టే !

సియోల్ : ఈ నెల ఆరంభంలో దేశంలో సైనిక పాలన విధించడంపై జరుగుతున్న దర్యాప్తులో సాక్ష్యమిచ్చేందుకు రావాల్సిందిగా దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు దేశ ప్రాసిక్యూషన్ సర్వీస్ రెండోసారి సమన్లు జారీ చేసింది. ఈనెల 21లోగా హాజరు కాని పక్షంలో అరెస్టు వారంటు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పింది. డిసెంబరు 3న చోటు చేసుకున్న సంఘటనలపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతోంది. ఈ బృందం సోమవారం అధ్యక్షుడికి సమన్లు జారీ చేసింది. గత ఆదివారం అధ్యక్షుడిని విచారించాల్సి వుంది, కానీ ఆయన హాజరు కాకపోవడంతో రెండోసారి సమన్లు పంపింది. యూన్ ఈ విచారణకు హాజరైనట్లైతే, అధికారంలో వుంటుండగా దర్యాప్తుకు సిద్ధమైన మొదటి దక్షిణ కొరియా అధ్యక్షుడవుతారు. అలాగే, ఒకవేళ అరెస్టు వారంటు జారీ చేయాలని ప్రాసిక్యూషన్ నిర్ణయిస్తే, అరెస్టు కాబోయే ఆసియా దేశపు మొదటి సిట్టింగ్ అధ్యక్షుడవుతారు. యూన్‌ను శనివారం పార్లమెంట్ అభిశంసించింది. పాలక కన్జర్వేటివ్ పీపుల్ పవర్ పార్టీ (పిపిపి)కి చెందిన 12మంది డిప్యూటీలు అనుకూలంగా ఓటు వేశారు. ప్రధాని హన్ డక్ సూ ప్రస్తుతం తాత్కాలిక అధ్యక్షుడిగా వున్నారు. అయితే రాజ్యాంగ కోర్టు నిర్ణయంపైనే ఆయన భవితవ్యం ఆధారపడి వుంది. దేశంలో మార్షల్ లా విధించడం ద్వారా అధ్యక్షుడు రాజ్యాంగాన్ని ఉల్లంఘించారా లేదా అని నిర్ణయించడానికి కోర్టుకు ఆరు మాసాల గడువు వుంది.

న్యూయార్క్ కోర్టులో ట్రంప్‌నకు షాక్..



న్యూయార్క్ : తనపై నమోదైన హష్ మనీ కేసును కొట్టివేయాల్సిందిగా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ చేసిన విజ్ఞప్తిని మన్‌హటన్ న్యాయమూర్తి జువాన్ మర్చన్ తిరస్కరించారు. అధ్యక్షుడికి రక్షణ కల్పిస్తూ జులైలో అమెరికా సుప్రీం కోర్టు ఇచ్చిన రూలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని తనపై అభియోగాలను కొట్టేయాలని ట్రంప్ కోరారు. అయితే అధికారిక చర్యలకు సంబంధించే ఈ రక్షణ వుంటుంది తప్ప అనధికార వ్యవహార శైలికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రక్షణ వుండదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. పోర్న్ స్టార్‌కు డబ్బు ఇచ్చిన కేసులో ట్రంప్ దోషి అని ఇప్పటికే కోర్టు తేల్చింది. ఆయనకు విధించాల్సిన శిక్షను ఖరారు చేయాల్సి వుంది. ఒకవేళ ఇదే గనుక జరిగితే శిక్ష అభియోగాలను ఎదుర్కొంటూ అధ్యక్షుడిగా శ్వేత సౌధంలో అడుగు పెట్టే తొలి అధ్యక్షుడు ట్రంప్ కానున్నారు. ఇదిలావుండగా, న్యాయమూర్తి మర్చన్ నిర్ణయాన్ని ట్రంప్ కమ్యూనికేషన్ డైరెక్టర్ స్టీవెన్ చెంగ్ విమర్శించారు. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని ఉల్లంఘించడమే కాగలదని తప్పుబట్టారు. ఇలాంటి కేసును తక్షణమే కొట్టేయాల్సి వుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ ప్రవేశపెట్టాలి

- ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం
- పట్టణాలు, నగరాల్లో కొత్త స్కూళ్లను ప్రారంభించాలి : మండలి మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల్లోనే ప్రీప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం శాసనమండలి ఆవరణలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ మండలిలో విద్యారంగంపై సంపూర్ణంగా చర్చ జరిగినట్టుగా అనిపించడం లేదన్నారు. ప్రతిపక్షంలో ఏ పార్టీ ఉంటే ఆ నాయకులు వేల సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో 1,881 ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయని వివరించారు. 2022-23 విద్యాసంవత్సరంలో 1,461 స్కూళ్లు మూతపడ్డాయని చెప్పారు. ఏటా మూతపడుతున్నాయనీ, ఎందుకు పడుతున్నాయో ప్రతిపక్షం, అధికార పార్టీ ఆలోచించడం లేదన్నారు. విద్యా ప్రయివేటీకరణ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల లేమి, సకాలంలో ఉపాధ్యాయ నియామాలు చేపట్టకపోవడం, ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వస్తున్నారని వివరించారు. ఈ కారణాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఏటా తగ్గుతున్నదని అన్నారు. అందుకే ఏటా బడులు మూతపడుతున్నాయని చెప్పారు. అయితే పట్టణాలు, నగరాల్లో జనాభా పెరుగుతున్నా అందుకు తగ్గట్టుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించడం లేదన్నారు. 2014-15లో ప్రభుత్వ పాఠశాలల్లో 31.60 (51 శాతం) లక్షల మంది విద్యార్థులు చదివితే 2025-25లో 24.50 (42 శాతం) లక్షల మంది విద్యార్థులకు పడిపోయిందన్నారు. అదే సమయంలో ప్రయివేటు పాఠశాలల్లో 2014-15లో 49 శాతం విద్యార్థులుంటే, ప్రస్తుతం 58 శాతం మంది పిల్లలు చదువుతున్నారని వివరించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో 1.50 లక్షల మంది చదివితే, ప్రయివేటు పాఠశాలల్లో నాలుగు లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. కేజీ తరగతులను ప్రవేశపెట్టకపోతే ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కిలో బియ్యం 77 శాతం ప్రజలు తీసుకుంటున్నారనీ, ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం 42 శాతం పిల్లలే ఉంటున్నారని వివరించారు. 35 శాతం మంది ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్నా ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హైదరాబాద్‌లో ఎనిమిది లక్షల మంది, ములుగులో 40,500 మంది, రంగారెడ్డి జిల్లాలో 7.60 లక్షల మంది, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 6.30 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో పది జిల్లాల్లో లక్షలోపు విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. పట్టణాలు, నగరాలకు ప్రజలు వలస పోతున్నారని చెప్పారు. అక్కడ కొత్త స్కూళ్లను ప్రారంభించాలని సూచించారు. అమెరికా, ఇంగ్లాండ్, నార్వే ఫిన్లాండ్ వంటి దేశాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోనే ఎక్కువ మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. భారత్‌లోనే ప్రయివేటు బడుల్లో ఎక్కువ చదువుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారనీ, 10,006 మంది కొత్త టీచర్లకు నియామకపత్రాలను అందించారని చెప్పారు. పాఠశాల గ్రాంట్‌ను ఇస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 30 మందిలోపు ఎనిమిది వేలు, 50 మందిలోపు 14 వేలు ఉన్నాయని వివరించారు. ఉన్న టీచర్లు, వనరులతోనే ప్రభుత్వ పాఠశాలలను బాగుచేయొచ్చని సూచించారు. విద్యారంగంలో రాజకీయాలు చేయడం మంచిది కాదన్నారు. గురుకులాలు, కేజీబీవీలు పెట్టినా విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదని అన్నారు. విద్యారంగంపై స్వల్పకాలిక చర్చ జరగాలని కోరారు.

నిర్బంధాలు.. అరెస్టులు

- అరెస్టులను నిరసిస్తూ నేడు, రేపు మండల కేంద్రాల్లో నిరసనలు
- వేతనాల పెంపు, పర్మినెంట్ కోసం 27,28 తేదీల్లో సమ్మెకు జేఏసీ పిలుపు



నవతెలంగాణ - ముషీరాబాద్

గ్రామపంచాయతీ ఉద్యోగులకు, కార్మికులకు వేతనాలు పెంచాలని, పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, పంచాయతీ కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని తదితర డిమాండ్లతో మంగళవారం గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ తలపెట్టిన చలో హైదరాబాద్ విజయవంతమైంది. పలు జిల్లాల్లో నిర్బంధాలు, అరెస్టులను ప్రయోగించినా వాటిని ఛేదించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీ సిబ్బంది ఇందిరాపార్క్‌కు తరలివచ్చారు. అనుమతి లేదంటూ అక్కడికి చేరుకున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఇచ్చిన పర్మిషన్‌నే ఎలా రద్దు చేస్తారని జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి కొన్ని గంటలపాటు కార్యక్రమాన్ని నిర్వహించుకునేందుకు అనుమతించారు. అనంతరం సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ, తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్ల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద భారీ ధర్నా జరిగింది. ధర్నాకు గ్రామ పంచాయతీ యూనియన్ ఏఐటీయూసీ నుంచి రాష్ట్ర అధ్యక్షులు టి.నర్సింహారెడ్డి, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నుంచి రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ సిబ్బంది వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, అందుకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 12,790 గ్రామ పంచాయతీల్లో సుమారు 60,000 మంది ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. 2018లో అప్పటి ప్రభుత్వం జీవో 51ని విడుదల చేసి సిబ్బంది వేతనాలను రూ.8,500కు పెంచిందని గుర్తు చేశారు. వేతనాలు పెంచుతూనే పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాళ్లను బిగిస్తూ మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందికి బకాయి వేతనాలు చెల్లించాలని, గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2వ పీఆర్సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకురావాలని, జీవో 60 ప్రకారం వేతనాలను కేటగిరీల వారీగా చెల్లించాలని డిమాండ్ చేశారు. దాంతోపాటు జీవో 51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కె.సూర్యం మాట్లాడుతూ.. పాత కేటగిరీలన్నింటినీ కొనసాగించాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లను కల్పించాలన్నారు. రాష్ట్ర కన్వీనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని, చనిపోయిన, అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో జేఏసీ రాష్ట్ర నేతలు మొటే నరసింహ, వెంకటరాజ్యం, అరుణ్ కుమార్, ఎం.వెంకటేష్, బింగి గణేష్, శివ బాబు, అరుణ, యాదయ్య, పాలడుగు సుధాకర్, వెంకన్న, చిలుకామారుతి, నాయకులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భవిష్యత్ కార్యాచరణను ప్రకటించిన జేఏసీ

ధర్నా అనంతరం జేఏసీ రాష్ట్ర కార్యవర్గం సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. పోలీసుల అరెస్టులు, నిర్బంధాన్ని నిరసిస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. డిమాండ్ల అమలు కోరుతూ ఈ నెల 27,28 తేదీల్లో రెండు రోజుల పాటు టోకెన్ సమ్మె చేయాలని నిర్ణయించింది. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మె తేదీలను ఖరారు చేస్తామని హెచ్చరించారు.

మాకు కావాల్సింది దయా దాక్షిణ్యాలు కావు

- రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి
- 19ఏండ్లుగా వెట్టి చాకిరే
- మేము అడిగేవి గొంతెమ్మ కోరికలూ కావు
- డిమాండ్లు పరిష్కరిస్తామంటేనే కాంగ్రెస్‌కు ఓట్లేసినం
- అధికారంలోకి వచ్చి ఏదాదైనా..ఇచ్చిన మాట గుర్తులేదా?
- ఆశాల పోరాట శక్తి ఏంటో గత ప్రభుత్వానికి తెలుసు
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే మా డిమాండ్లు పరిష్కరించాలి
- పీఎఫ్ ,ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి : తెలంగాణ ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.విజయలక్ష్మి
- పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో సాగిన ఆశా వర్కర్ల బస్సు జాతా
- వందలాదిగా తరలివచ్చిన ఆశా వర్కర్లు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/ కరీంనగర్/ పెద్దపెల్లి

"ఆశా వర్కర్లు 19ఏండ్లుగా వెట్టి చాకిరీ చేస్తున్నారు. ప్రభుత్వం తలపెట్టే ప్రతి పనిలోనూ క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లతోనే పాలకులు పని చేయించుకుంటున్నారు. జీతాలు మాత్రం.. పనిని లెక్కగడుతూ కనీసం నెలకు అరకొరగా ఇస్తున్నారు. పెరుగుతున్న ధరలకు తగ్గ వేతనం రాక ఆశాల కుటుంబాలు అల్లాడుతున్నాయి. ధర్నాలు, రాస్తారోకోలు, వంటావార్పులు ఇలా ఎన్నో రకాలుగా తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ పోరాటాలు చేసినప్పుడల్లా ఉపశమన హామీలు, కమిటీలు వేస్తూ కాలయాపన చేశారు. మాకు దయా దాక్షిణ్యాలు అవసరం లేదు. నెలకు రూ.18వేల ఫిక్స్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సహా ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం చేయాలి." అని తెలంగాణ ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశాల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 15న రాష్ట్రవ్యాప్తంగా బస్సుజాత ప్రారంభమైంది. ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఏడుగురు సభ్యులతో కూడిన బృందం బస్సు జాత మంగళవారం పెద్దపెల్లి, కరీంనగర్ జిల్లాల్లో సాగింది. ఈ రెండు జిల్లా కేంద్రాల్లో వందలాదిగా వచ్చిన ఆశా వర్కర్లు డప్పు చప్పుళ్ళ నడుమ బతుకమ్మ బోనాలు కోలాటాలతో జాత బందానికి ఘన స్వాగతం పలికారు. పెద్దపెల్లి కరీంనగర్ జిల్లాలో ర్యాలీ చేపట్టి ఆయా జిల్లాల కలెక్టరేట్ల ఎదుట బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జాత బృందంలోని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి ప్రసంగించారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వంతో తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆశాలు పోరాడుతున్న సమయంలో తాము అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తామని రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడున్న



కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎంపీలు మాట ఇచ్చారని గుర్తు చేశారు ఆశాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడిచిన ఇచ్చిన మాట మరిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు విషయమై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సహా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశామని, నిరంతరం నిరసనలు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి 31వరకు రాష్ట్ర వ్యాప్త బస్సు జాత చేపట్టినట్టు తెలిపారు.

19ఏండుగా ఆశాలతో వెట్టి చాకిరీ

ఎన్‌హెచ్‌ఎం స్కీంలో భాగంగా 19ఏండ్లుగా ఆశా వర్కర్లందరూ వెట్టి చాకిరీ చేస్తున్నారని, వీరంతా బలహీన వర్గాలకు చెందిన వారేనని విజయలక్ష్మి తెలిపారు. రాత్రింబవళ్లు ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న వీరికి ప్రభుత్వం పనిని బట్టి పారితోషకం ఇస్తామనడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. దీనికితోడు చెప్పిన పని చేయకపోతే పారితోషకాల్లో కోతలు పెడతామంటూ అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రసవాల సమయంలో రెండు మూడు రోజులు కుటుంబాన్ని వదిలి గర్భిణితో పడి కాపులు కాస్తున్న ఆశా వర్కర్లకు డెలివరీ కేసుల టార్గెట్స్ పెడుతూ టార్చర్ చేస్తుందన్నారు. అసాశ్రయమైన పద్ధతిలో టీబీ స్పూటం డబ్బాలను మోయిస్తూనే ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో పని ఒత్తిడికి గురి చేస్తున్నారని చెప్పారు.

ఇంత చాకిరీ చేస్తున్నా నెలకు కేవలం రూ.9,900 పనిని బట్టి పారితోషకాలు ఇవ్వడం దారుణం అన్నారు. ఈ వేతనంలోనూ వ్యత్యాసాలు ఉంటున్నాయని తెలిపారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీ సర్కారు చెల్లించే బడ్జెట్ తగ్గిస్తూ కేవలం రూ.3వేలు మాత్రమే పారితోషకాలు ఇస్తుందని చెప్పారు.

కరోనా సమయంలో ఆశాలను శ్రమను గుర్తించిన డబ్ల్యుహెచ్‌ఓ తమను గ్లోబల్ లీడర్స్‌గా అభివర్ణించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అలాంటి సేవలు అందించిన ఆశా వర్కర్లను కేంద్ర సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉంటూ ఆశా వర్కర్లను బీఆర్ఎస్ సర్కారు మోసం చేసిందని, తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం మోసగిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 15 రోజులు రాష్ట్రవ్యాప్తంగా ఆశలు చేసిన సమ్మె గత ప్రభుత్వాన్ని గడగడలాడించిందని, వెంటనే ఓ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో కమిటీని సైతం వేసిన విషయాన్ని గుర్తు చేశారు. తీరా ఎన్నికలు రావడంతో రాష్ట్రాల్లో ప్రభుత్వం మారిందనితెలిపారు. ఆశాల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లు పరిష్కరించాలని, లేని పక్షంలో నిరవధికంగా సాగుతుందని హెచ్చరించారు.

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ అతి తక్కువ పారితోషికాల నుంచి నేడు రూ.9900 పారితోషకాలను రాష్ట్రంలో పెంచుకున్నాం న్నారు. ఇది సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశలు చేసిన పోరాట ఫలితమేనని, పారితోషకాల పెంపుతో పాటు యూనిఫామ్, సెల్ఫోన్, ప్రింటర్ రిజిస్టర్ అనేక తదితర సౌకర్యాలు సాధించుకు న్నామన్నారు.

ఆంధ్రప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర మాదిరిగా రాష్ట్రంలో ఫిక్స్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బస్సు జాతా బందంలో తెలంగాణ ఆశా వర్కర్ యూనియ న్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ నీలాదేవి ఉపాధ్యక్షులు ఆర్ సాధన రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎస్ పద్మ, కే సునీత, రాష్ట్ర కోశాధికారి పి గంగమణి రాష్ట్ర నాయకులు ఎం బాలమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గిట్ల ముకుంద రెడ్డి జిల్లా కోశాధి కారి జి రాజేశం ఉపాధ్యక్షులు యు శ్రీనివాస్ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి నగర కన్వీనర్ పుల్లెల మల్లయ్య ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షులు రంగవేణి శారద, ఉపాధ్యక్షు లు రాజమణి, శంకరమ్మ, ప్రియాంక, లక్ష్మి, సరిత సహా పెద్ద ఎత్తున ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- రిక్రూట్‌మెంట్ రాత పరీక్ష నిలిపివేయాలి : తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ (జేఏసీ) డిమాండ్
- డీఎంహెచ్ఎస్ ఆవరణలో ఏఎన్ఎంల ధర్నా



నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

ఈనెల 29న జరగనున్న ఏఎన్ఎం, ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) రిక్రూట్‌మెంట్ రాత పరీక్షను నిలిపివేయాలని, కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ కోఠిలోని డీఎంహెచ్ఎస్ ఆవరణలో తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట సమితి జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు యాద నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, ప్రాథమిక ఆస్పత్రుల్లో 20 ఏండ్లుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు వారి వయస్సు 45 నుంచి 55 వరకు ఉందని, ఈ వయసులో పోటీ పరీక్ష రాసే పరిస్థితి లేదని అన్నారు. ఇప్పుడు వారికి రాత పరీక్ష పెట్టడం అర్థరహితమని, తక్షణమే రాత పరీక్ష నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 20 ఏండ్ల కిందట నాటి వైద్య ఆరోగ్యశాఖ అవసరానికి రాత పరీక్ష, మెరిట్, స్థానికత ఆధారంగా రోల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి నియమించినట్టు గుర్తు చేశారు. ఇన్ని సంవత్సరాల సర్వీస్‌కు 50 మార్కులు, ఏఎన్ఎం ట్రైనింగ్‌లో పొందిన మార్కుల ఆధారంగా రాత పరీక్ష లేకుండా వీరందరినీ రెగ్యులరైజేషన్ చేయడానికి పరిశీలించాలని కోరారు. రిక్రూట్‌మెంట్ నిబంధనలను సవరించి సర్వీసులో ఉన్న వారికి వయోప రిమితిని ఎత్తేయాలన్నారు. కాంట్రాక్ట్ సర్వీసులోని వివిధ రిజర్వేషన్ క్యాటగిరీల్లో 50 నుంచి 55 వయసు పైబడిన వారు 700 మంది రెగ్యులరై జేషన్ కోసం దరఖాస్తు చేసుకునే అర్హతను కోల్పోతున్నారన్నారు. వీరికి న్యాయం జరగాలంటే వయోపరిమితిని ఎత్తేయాలని కోరారు. జేఏసీ నాయకులు కె.సాయిరెడ్డి మాట్లాడుతూ.. 70 ఏండ్ల కిందట ఏర్పాటైన సబ్ సెంటర్ల పరిధిలో జనాభా ప్రాతిపదికన కొత్తవి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో 3000 జనాభాకు, పట్టణ ప్రాంతంలో 5,000 జనాభాకు సబ్ సెంటర్ పెట్టాలన్నారు. ఆనాడు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో నియామకాలు చేసి ఎలాంటి సర్వీసు నిబంధనలూ పెట్టకుండా 20 ఏండ్లు నెట్టుకొచ్చారన్నారు. ఈ 20 ఏండ్ల కాలంలో అనేకమంది చనిపోయారని, కొందరు రోడ్డు ప్రమాదాల్లో పాక్షికంగా, పర్మినెంట్‌గా వైకల్యానికి గురయ్యారని చెప్పారు. అలాంటి వారి కుటుంబాలకు నష్టపరిహారం, ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు భూపాల్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 61 ఏండ్లు నిండి ఉద్యోగ విరమణ పొందిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చివరి నెల వేతనంలో సగం ప్రతినెలా పింఛన్‌గా ఇవ్వాలని కోరారు. అనంతరం కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలపై వెంటనే స్పందించాలని కోరారు. ఈ ధర్నాలో జేఏసీ నాయకులు పసియోద్దీన్, రాజశేఖర్, మధురిమ, జ్యోతి, రాజమణి, సీతమ్మ, సుగుణ, మమత, హసీనా, సరోజా, కిరణ్మయి, కుమార్, పెద్దఎత్తున ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సంధ్య థియేటర్‌కు షోకాజ్ నోటీసులు

- బాలుడికి నగర సీపీ పరామర్శ

నవతెలంగాణ-సిటీబ్యూరో

సంచలనంగా మారిన సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు ఊహించని మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో నటుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. ఆ తర్వాత మధ్యంతర బెయిల్ రావడంతో విడుదల చేశారు. తాజాగా బన్నీ బెయిల్ రద్దు కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించాలని హైదరాబాద్ పోలీసులు నిర్ణయించారు. ఇదే సమయంలో సంధ్య థియేటర్ యాజమాన్యానికి చిక్కడపల్లి పోలీసులు షాక్ ఇచ్చారు. థియేటర్ నిర్వహణ లోపాలపై వివరణ ఇవ్వాలంటూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఒక మహిళ మరణానికి దారి తీసిన ఘటనపై సినిమాటోగ్రాఫ్ లైసెన్స్‌ను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలన్నారు. 10 రోజుల్లోపు వివరణ ఇవ్వాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. సంధ్య 70ఎంఎంతో పాటు సంధ్య 35ఎంఎం థియేటర్లు ఒకే ప్రాంగణంలో ఉన్నాయని, వీటి ఎంట్రీ, ఎగ్జిట్ కూడా ఒకే వైపు ఉన్నాయని, ఎంట్రీ, ఎగ్జిట్‌లను సూచించే సరైన సైన్ బోర్డులు లేకపోవడంపై పోలీసులు షోకాజ్ నోటీసులో ప్రశ్నించారు. ఇదిలావుండగా, తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న



బాలుడు శ్రీతేజ్‌ను నగర సీపీ సీవీ ఆనంద్ మంగళవారం పరామర్శించారు. ఈనెల 4న సంధ్య థియేటర్ వద్ద హీరో అల్లు అర్జున సమయంలో జరిగిన తొక్కిసలాటలో తల్లి మృతిచెందగా, శ్రీతేజ్‌కు ఆక్సి జన్ అందక బ్రెయిన్ డ్యామేజ్ అయిన విషయం తెలిసిందే. బాలుడికి వెంటిలేటర్ సాయంతో చికిత్స అందిస్తున్నారు. బాలుడి ఆరోగ్యంపై సీపీ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోలుకునేందుకు సమయం పడుతుందని వైద్యులు చెప్పారని సీపీ తెలిపారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని సీపీ తెలిపారు.

చెన్నూరులో డిపో ఏర్పాటు చేస్తాం

- వేములవాడ-ధర్మపురి-కొండగట్టు సర్వీసు నడుపుతాం : మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చెన్నూరు నియోజకవర్గంలో ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, సభ్యులు వివేక్ వెంకటస్వామి, పాల్వాయి హరీశ్‌బాబు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. ముందు ములుగు, పెద్దపల్లి జిల్లా కేంద్రాల్లో డిపోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామనీ, సిర్పూర్ కాగజ్‌నగర్‌లో డిపో ఏర్పాటు అంశం ఇప్పుడు తమ పరిశీలనలో లేదన్నారు. అయితే, డిపో భూమిని రక్షిస్తామని హామీనిచ్చారు. భక్తుల సౌక ర్యార్థం వేములవాడ-కొండగట్టు-ధర్మపురి మధ్య ప్రత్యేక సర్వీసు నడుపుతామని ప్రకటిం చారు.

రెండేండ్లలో కాళేశ్వరం 19 ఏ ప్యాకేజీ పూర్తిచేస్తాం

కాళేశ్వరం 19-ఏ ప్యాకేజీని రెండేండ్లలో పూర్తిచేస్తామని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీనిచ్చారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు పటోళ్ల సంజీవరెడ్డి, ఆదినారాయణ, మాణిక్‌రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో 19ఏ నిర్లక్ష్యానికి గురైందన్నారు. పలు ప్రాజెక్టుల పనుల ఎస్టిమే షన్, నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. పెద్దారెడ్డి పేట ఎత్తిపోతల పథకం కింద 39 వేల ఆయకట్టు ప్రతిపాదించామన్నారు. అశ్వరావుపేట, జహీరాబాద్ నియోజకవర్గాల్లో తాగు, సాగు నీటి లిఫ్టులకు, ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చి త్వరిత గతిన పనులను పూర్తిచేస్తామని హామీనిచ్చారు.

మా బావగారు చెప్పారు..ప్రత్యేకంగా పరిశీలిస్తాం

'ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు తమ దృష్టిలో ఉంది. వీలైనంత త్వరలో పాజిటివ్ నిర్ణయం తీసుకుంటాం. సహచర మంత్రివర్యులు, మా బావగారు కోమటిరెడ్డి చెప్పారు కాబట్టి చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటును ప్రత్యేకంగా పరిశీలిస్తాం' అని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీనిచ్చారు. సభ్యులు బీర్ల అయిలయ్య, వాకిటి శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్‌జాదవ్, మురళీధర్, నాగరాజు, మనోహర్‌రెడ్డి, సంజీవరెడ్డి, అనిరుధ్‌రెడ్డి, తదితర ఎమ్మెల్యేలు అడిడిన ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సమాధానాలిచ్చారు. తమ వద్ద ప్రతిపాదిత రెవెన్యూ డివిజన్లు 11 ఉన్నాయనీ, వాటిలో నాలుగింటికి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశామని చెప్పారు. అందులో ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రతిపాదన పరిశీలనలో ఉందని చెప్పారు. జిల్లా కలెక్టర్ల నుంచి మరో ఆరు ప్రతిపాదనలు అందాయని తెలిపారు. చారిత్రక నేపథ్యమున్న చేర్యాలతో పాటు ఆత్మకూర్, మక్తల్, బోథ్, జడ్చర్ల రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు అంశంపై అధికారులతో సాధ్యాసాధ్యాలపై వివరాలు తెప్పించుకుని పరిశీలిస్తామని హామీనిచ్చారు. అట్లాగే సభ్యుల కోరికమేరకు పలు మండలాల ఏర్పాటు గురించి కూడా పరిశీలిస్తామన్నారు.



ఏడో తరగతి విద్యార్థి ఆత్మహత్య

- హయత్‌నగర్ నారాయణ స్కూల్‌లో ఘటన

నవతెలంగాణ-హయత్ నగర్

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన జరిగింది. నారాయణ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు, విద్యార్థి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా రేవల్లి మండలం శానాయిపల్లి గ్రామానికి చెందిన పండుగ మధుసూదన్‌రెడ్డి కుమారుడు లోహితస్య రెడ్డి(12) హయత్‌నగర్ నేతాజీనగర్‌లో ఉన్న నారాయణ స్కూల్‌లో 7వ తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. అయితే, అతను అనారోగ్యంతో బాధపడుతూ హాస్టల్‌లో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. రెండు నెలల నుంచి తండ్రికి ఫోన్‌లో సమాచారం ఇస్తున్నాడు. 7వ తరగతి పూర్తయ్యేదాక కొన్ని నెలలు ఆగాలని తండ్రి సూచించాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి లోహితస్యరెడ్డి తన గదిలోకి వెళ్లి టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తోటి విద్యార్థులు, సిబ్బంది గమనించి అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. స్కూల్ యాజమాన్యం తండ్రికి ఫోన్ చేసి సమాచారమివ్వడంతో వెంటనే ఆస్పత్రికి చేరుకున్నారు. బాలుని తండ్రి ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నారాయణ రెసిడెన్షియల్ స్కూల్‌ను సీజ్ చేయాలి: ఏఐఎస్ఎఫ్ విద్యార్థి మరణాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు హయత్‌నగర్‌లో ఉన్న నారాయణ రెసిడెన్షియల్ స్కూల్ ముందు ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలను అధికారులు వెంటనే సీజ్ చేయాలని కోరారు. ఫీజుల పేరుతో లక్షలు వసూలు చేస్తూ విద్యార్థులను బలి తీసుకుంటున్నా చూసీచూడనట్టు ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు.

బాధిత కుటుంబానికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్ గౌడ్, భూక్యా వినోద్, హయత్‌నగర్ మండల నాయకులు భాను ప్రకాష్, ఎన్నేపల్లి ఉపేందర్ పాల్గొన్నారు.

కుట్రలకు తెరలేపిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల ముందిచ్చిన హామీలను అమలు చేయలేని అధికార కాంగ్రెస్ ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద ఆరోపించారు. మంగళవారం శాసనసభ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిలదీస్తున్నందుకే కేటీఆర్‌ను ఫార్ములా ఈ రేస్ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు "కాళేశ్వరం కూలిపోయిందని అసత్య ప్రచారం చేశారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో ఇరికించేందుకు కుట్ర పన్నారు. కేటీఆర్ బామ్మర్ది ఇంట్లో డ్రగ్స్ ఉన్నాయని నిందలు మోపారు. మహిళా మంత్రి తో వ్యక్తిగత ఆరోపణలు చేయించారు. లగచర్లలో రైతులు తిరుగుబాటు చేస్తే కేటీఆర్ పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. బీఆర్ఎస్ నేతలను ఎలా అరెస్ట్ చేయా లనే ఆలోచన తప్ప సీఎంకు మరో పనిలేకుండా పోయింది. రాష్ట్ర ప్రజ ల సమస్యల గురించి క్యాబినెట్‌లో చర్చించకుండా కేసీఆర్, కేటీఆర్‌ను ఎలా జైలు పంపాలా అనే అంశంపైనే చర్చించారు" అని సీఎం రేవంత్‌రెడ్డిపై వివేకా నంద తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం, మంత్రులు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల మధ్య తుతో ధైర్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన పేరును బాంబుల శ్రీనివాసరెడ్డిగా మార్చుకోవాలని హితవు పలికారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నవంబర్ జీతం ఇవ్వాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర సచివాలయంలో సాధారణ పరిపాలనా శాఖలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులకు నవంబర్ జీతాలను వెంటనే ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జె కృష్ణారెడ్డి, కార్యదర్శి జె కుమారస్వామి, ఉపాధ్యక్షులు పద్మశ్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళ వారం సీఎస్ శాంతికుమారికి వినతి పత్రాన్ని సమర్పించారు. గత 20 ఏండ్లు గా వారు డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లుగా పని చేస్తు న్నారనీ, వారికి ప్రతి నెల ఐదు లోపు వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

మిషన్ భగీరథ వచ్చాకే తాగునీటి సరఫరా జరిగిందా?

- దానికి ముందే సరఫరా చేసిన కాంగ్రెస్ : మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలు తెలంగాణ వచ్చాకే మంచినీళ్లు తాగినట్టు, మిషన్ భగీరథ వచ్చాకే తాగునీటి సరఫరా జరిగినట్టు బీఆర్ఎస్ సభ్యులు చెబుతున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం శాసనమండలిలో కొత్తగా నిర్మించిన ఇండ్లకు తాగునీటి నల్లా కనెక్షన్లపై తక్కెళ్లపల్లి రవీందర్ రావు వేసిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. తాగునీటి సరఫరాకు సంబంధించి రూ.460 కోట్లు నిర్వహణ బకాయిలు పెట్టారని తెలిపారు. అంతకు ముందు రవీందర్ రావు మాట్లాడుతూ 2021లోనే వంద శాతం ఇండ్లకు తాగునీటిని సరఫరా చేసిన చరిత్ర లిఖించదగిందని తెలిపారు. రూ.50 వేల కోట్లతో మిషన్ భగీరథ చేపట్టి మంచినీటి సరఫరా చేశామని తెలిపారు. కాంగ్రెస్ సభ్యులు జీవన్ రెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ లాంటి సెంట్రలైజ్డ్ స్కీంతో ఇబ్బంది అని తెలిపారు. నీరు ప్రతి 20 నుంచి 30 కిలోమీటర్లు దాటితే ఫ్లోరిఫికేషన్ పోయి రా వాటర్‌గానే అవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి బదులిస్తూ, ఫ్లోరిఫికేషన్, ప్యూరిఫై కోసం తమ శాఖ సాంకేతిక అవకాశాలను పరిశీలిస్తున్నదని చెప్పారు. 1.28 లక్షల ఇండ్లకు కనెక్షన్లు, 2.4 లక్షల ఇండ్లకు సరఫరాను మెరుగుపరచగా, 0.95 లక్షల ఇండ్లు ఇంకా మిగిలి ఉన్నాయని తెలిపారు.

ఐదేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

ప్రొఫెషనల్ విద్య కళాశాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 2019 నుంచి ఉన్నాయని మంత్రి సీతక్క తెలిపారు. శాసనమండలిలో మంగళవారం బీఆర్ఎస్ సభ్యురాలు వాణీదేవి అడిగిన ప్రశ్నకు సీతక్క సమాధానమిచ్చారు. రూ.4967.18 లక్షల బకాయిలున్నట్టు తెలిపారు. ఈ బకాయిలను తొందరగా క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు చెప్పారు. సర్టిఫికెట్లు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాణిదేవి ప్రస్తావించగా, మంత్రి, వాస్తవమేనని చెప్పారు.

79 పాఠశాలలు తిరిగి ప్రారంభించాం

- మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 6 వేల పాఠశాలలను మూసివేశారనడం సరికాదని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మంగళవారం శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యులు టి.రవీందర్ రావు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 2023-24 విద్యా సంవత్సరంలో జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు 1,745 కాగా, 2024-25 విద్యా సంవత్సరంలో 1,913 ఉన్నాయని చెప్పారు. 2024-25లో జీరో ఎన్‌రోల్‌మెంట్ అయిన 79 పాఠశాలలను తిరిగి ప్రారంభించినట్టు చెప్పారు. రూ.1,100 కోట్ల అంచనా వ్యయంతో అన్ని పాఠశాలల్లో ఏపీపీసీ క్రింద పునరుద్ధరించినట్టు తెలిపారు. గత ప్రభుత్వం మధ్యలో వదిలేసిన సివిల్ వర్క్స్ పనులను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. అంతకు ముందు మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తమ ఊరు పాఠశాలలో పనులు కూడా సగంలో ఆగిపోయాయని తెలిపారు.

దమ్ముంటే 15 రోజులు అసెంబ్లీ నిర్వహించాలి

- అన్ని వర్గాల సమస్యలపై, ప్రజా కార్యక్రమాలపై చర్చించాలి
- ఆ తర్వాత రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్న స్కాములపై చర్చకు సిద్ధం
- లగచర్ల అంశాన్ని లేవనెత్తుతూనే ఉంటాం : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే అసెంబ్లీని 15 రోజులు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కొడంగల్ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న రైతన్నలు, నేతన్నలు, ఆటో డ్రైవర్లు, గురుకుల పాఠశాలల నుంచి మొదలుకొని రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల సమస్యలపై, వారికి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చించిన తర్వాత... రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్న స్కాములపైనా... ఫార్ములా- ఈ వంటి అంశాల పైనా చర్చించేందుకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. క్యాబినెట్ మీటింగ్ అంటూ... గంటల తరబడి ఎవరిని అరెస్టు చేయాలో చర్చించడం కాదు పాలన అంటే ప్రజలకు మంచి చేసేందుకు చర్చించడమే పాలన అని తెలిపారు.

కొడంగల్ ప్రజల కోసం నిలబడిన తమ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి ఉక్కుమనిషిగా మారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భవిష్యత్తులో తుక్కుతుక్కు చేస్తారని హెచ్చరించారు. భవిష్యత్తులో లగచర్ల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం, రేవంత్ రెడ్డి పతనం మొదలవుతుందన్నారు. అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 30 శాతం కూడా రైతు రుణమాఫీ చేయకుండా రాహుల్ గాంధీ నుంచి కాంగ్రెస్ కార్యకర్త వరకు వంద శాతం రుణమాఫీ అంటూ అబద్ధాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ చేయకుండా మోసగించిన కాంగ్రెస్ కు ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తమ కార్యకర్తలు పెట్టే పోస్టింగ్‌లనే తట్టుకోలేకపోతున్న సీఎం రేవంత్ రెడ్డి స్థాయికి కేసీఆర్ అవసరం లేదన్నారు. పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ కోసం పార్టీ ప్రయత్నిస్తున్నదని తెలిపారు. కోర్టులో న్యాయం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఫార్మా విలేజ్ రద్దు చేసుకున్నామనీ, ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో నాటకమాడుతున్నారని మండిపడ్డారు. కనీసం వార్డు మెంబర్, జెడ్పీటీసీ కాని తిరుపతిరెడ్డి పోలీసుల అండతో అరాచకం చేస్తున్నారని ఆరోపించారు. కొడంగల్‌లో సేకరిస్తున్న రైతన్న భూములు పరిశ్రమల కోసం కానే కాదు కేవలం అల్లుడి కోసం, అదానీ కోసమేనని తేల్చిచెప్పారు.

పరిశ్రమలు పెట్టడం, ఉపాధి కల్పించడమే రేవంత్ రెడ్డి ప్రాధాన్యత అయితే వెల్దండలో ఉన్న 500 ఎకరాల భూమిలో పరిశ్రమలు పెట్టి ఉపాధి ఇవ్వాలని కోరారు. లగచర్ల అంశాన్ని వదిలిపెట్టము... అసెంబ్లీ నడిచినని రోజులు లేవనెత్తుతూనే ఉంటామని స్పష్టం చేశారు. మంగళవారం అరెస్టు చేసిన లగచర్ల రైతులను, పార్టీ నేతలను వెంటనే పోలీసులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొడంగల్ పార్టీ శ్రేణులను కాపాడుకునే బాధ్యత మాది .... రేవంత్ రెడ్డి అరాచకాలకు ఎవరు భయపడొద్దని కోరారు.


ఈ సమావేశంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, జగదీశ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్,నవీన్ రెడ్డి, గోరేటి వెంకన్న, పొన్నాల లక్ష్మయ్య, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పేరు మర్చిపోవడమే అల్లు అర్జున్ చేసిన తప్పా?

పుష్ప-2 సక్సెస్ మీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పేరు మర్చిపోవడమే నటుడు అల్లు అర్జున్ చేసిన తప్పా? అని కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం పేరు మర్చిపోయినంత మాత్రాన అరెస్ట్ చేస్తారా? అని నిలదీశారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను అబ్జార్సన్ చేయాలి

- ఉన్నత విద్యామండలి వద్ద కాంట్రాక్టు టీచర్ల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1,445 మంది కాంట్రాక్టు అధ్యాపకుందర్నీ అబ్జార్సన్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్, వర్కింగ్ చైర్మెన్ రామేశ్వరరావు, శ్రీధర్ కుమార్ లోధ్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులందర్నీ అబ్జార్సన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ చట్టాన్ని మార్చి కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలని కోరారు. ఆ తర్వాతే విశ్వవిద్యాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీ చట్టాన్ని మార్చి తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీ చట్టాన్ని తీసుకొచ్చి అందులో అబ్జార్సన్‌ని పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లకు సంబంధించి ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ ఈ పురుషోత్తంను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ కో చైర్మెన్ వెంకటేశ్వర్లు, ఉదయ్, హర్షిత, ఆదిత్య మూర్తి, కవిత, భరత్, రాధిక, కాళీ కృష్ణ, కళ్యాణి, శృతి, పద్మశ్రీ, శిరీష, పద్మ తదితరులు పాల్గొన్నారు

హమాలీల వేతన ఒప్పంద జీవోలు

- రేపటిలోగా విడుదల చేస్తాం : సివిల్ సప్లయ్ డీజీఎం అలివేలు మంగ
- చేయకుంటే 27 నుంచి సమ్మెలోకి వెళ్తాం : జేఏసీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సివిల్ సప్లయ్ శాఖ పరిధిలో పనిచేసే హమాలీలకు వేతన ఒప్పంద జీవోలను రేపటిలోగా విడుదల చేస్తామని ఆ శాఖ డీజీఎం అలివేలు మంగ హామీనిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం జీవోలు విడుదల చేయకుంటే ఈ నెల 27 నుంచి సమ్మెలోకి వెళ్తామని సివిల్ సప్లయ్ హమాలీ సంఘాల జేఏసీ నేతలు ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఐటీయూ) వంగూరు రాములు, సివిల్ సప్లయ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. బాలయ్య, సివిల్ సప్లయ్ యూనియన్ నాయకులు శివ, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె. సూర్యం, హమాలీ యూనియన్ నాయకులు డి. శ్రీనివాసులు, సీతారాములు హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లో సివిల్ సప్లయ్ శాఖ డీజీఎం అలివేలుమంగతో జేఏసీ నేతలు చర్చలు జరిపారు. వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ..తమపై నమ్మకం ఉంచాలనీ, రెండు రోజుల్లో జీవో విడుదల చేస్తామని హామీనిచ్చారు. పాతబకాయిలన్నీ చెల్లిస్తామన్న భరోసా ఇచ్చారు. కార్మికులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. జీవో విడుదల చేయని పక్షంలో సమ్మె తప్ప తమకు మార్గం లేదని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. 2024 జనవరి నుంచి అమలు కావాల్సిన నూతన రేట్ల వేతన ఒప్పందం నేటికీ వర్తింపజేయడం లేదని వాపోయారు.

ఫాక్స్‌కాన్ తరలిపోలేదు

తప్పుడు ప్రచారం చేయొద్దు : మంత్రి శ్రీధర్ బాబు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బహుళజాతి కంపెనీ ఫాక్స్‌కాన్ హైదరాబాద్ నుంచి తరలిపోయినట్టు తప్పుడు ప్రచారం చేయొద్దని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. మంగళవారం శాసనమండలిలో ఆయన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటుపై కాంగ్రెస్ సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ సభ్యులు తాతా మధు తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఏఐ స్కూల్ రాబోతుందని తెలిపారు. 1992లో ఐటీ ప్రయాణం మొదలైతే, తర్వాత వచ్చిన ప్రభుత్వాలేవి బేషజాలకు పోలేదని గుర్తుచేశారు. తాము కూడా బేషజాలకు పోకుండా, రాజీపడకుండా, ప్రయత్నలోపం లేకుండా, గతంలో ఉన్న పాలసీలను మరింత మెరుగ్గా మారుస్తూ ముందుకెళ్తున్నట్టు చెప్పారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు, ఉపాధి రాబోతుందని తెలిపారు. బహుళ జాతి కంపెనీల్లో స్థానికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీలెంత మంది ఉన్నారో లెక్కలు లేవని చెప్పారు. అంతర్జాతీయ పోటీ రీత్యా అది సాధ్యం కాదని స్పష్టం చేశారు. అయితే ఆయా కంపెనీలు ఆశిస్తున్న నైపుణ్యాన్ని ఆయా వర్గాలకు అందించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని వివరించారు.

నర్సింగ్ లెక్చరర్ సీనియార్టీ లిస్టులో మేల్ నర్సింగ్ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోవాలి

- డీహెచ్‌కు తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నర్సింగ్ లెక్చరర్లకు సంబంధించిన ప్రొవిజనల్ సీనియార్టీ లిస్టులో మేల్ నర్సింగ్ అభ్యర్థులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియమ్మ వైస్ ప్రెసిడెంట్ లలిత, నర్సింగ్ ఆఫీసర్ రాపోలు శేఖర్, జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్ రుదావత్, కోశాధికారి క్రిష్ణ, నర్సింగ్ ఆఫీసర్ సౌమ్య తదితరులు హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్ కు వినతిపత్రం సమర్పించారు.గతంలో ఇచ్చిన జీవోలు సవరించకపోవడంతో పురుషులను పరిగణనలోకి తీసుకోవడంలో అడ్డంకి ఉందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో పురుషులను కూడా తీసుకుంటున్నారని చెప్పారు. త్వరలోనే వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి తమ సమస్యలను వివరించనున్నట్టు అసోసియేషన్ నాయకులు తెలిపారు.

సభా పర్వం

రాష్ట్రంలో అన్ని వ్యవస్థలూ దిగజారుతున్నాయి

- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అని వ్యవస్థలూ దిగజారుతున్నాయని సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మాట్లాడారు. పోలీసులను అడ్డుపెట్టుకుని పాలన సాగిస్తున్నారని విమర్శించారు. శాసనసభను కాంగ్రెస్ వారి అబద్ధాలు చెప్పుకునే వేదికగా మార్చారన్నారు. రూల్ బుక్ పాటించడం లేదని, ప్రభుత్వానికి దీనిపై చర్చ చేసే దమ్ములేదని విమర్శించారు. లగచర్ల రైతులకు మద్దతుగా మాట్లాడటానికి తమకు సమయం ఇవ్వలేదన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు, విద్యార్థుల దగ్గరకి, హైడ్రా బాధితుల దగ్గరికి కాంగ్రెస్ నాయకులు వెళ్లరన్నారు. లీకులు ఇచ్చి కేటీఆర్ గురించి మాట్లడించడం కాదని, రేవంత్‌కు దమ్ముంటే శాసనసభలో చర్చ పెట్టాలని సవాల్ విసిరారు. స్పష్టంగా కేటీఆర్ వచ్చి సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. దొంగ రాతలు రాయించడం బంద్ చేయాలన్నారు. బిల్లులు పాస్ చేయడానికి మాత్రమే శాసన సభ అన్నారు. 15 రోజులు శాసనసభ నిర్వహించాలంటే భయపడి వాయిదా వేసుకుని పోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యాలపై చర్చకు సిద్ధమా..? తమ ప్రతి పనిపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. అసెంబ్లీని పక్కదారి పట్టించినా.. ప్రజా క్షేత్రంలో తప్పించుకపోలేరన్నారు.

సమావేశాల తీరు విస్మయం : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అసెంబ్లీ సమావేశాల తీరు విస్మయంగా ఉందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఏసీ మీటింగ్ జరగలేదని, బీఏసీ లేకుండా బిల్లులు ప్రవేశపెట్టడం అసెంబ్లీ సమావేశాల సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. ఉన్న పద్ధతులు పాటించడం లేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారన్నారు. రూల్ బుక్‌ను పక్కన పెట్టారని విమర్శించారు. లగచర్ల రైతులకు వెంటనే బెయిల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడ్జర్న్ మోషన్ ఇస్తే ఉలుకు పలుకూ లేదని, దీన్ని తాము ఖండిస్తున్నామని చెప్పారు.

ఆరు గ్యారంటీలకు ఏడాది : ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచిందని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై 420 కేసు పెట్టాలని, ప్రజలకు వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమకు చర్చకు అవకాశం ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారన్నారని, ఇది ప్రజా పాలన అవుతుందా..? అని ప్రశ్నించారు. ఏడాదిపాటు అధికారం అనుభవించి సంబురాలు చేసుకుంటున్నారని విమర్శించారు.

నియోజవర్గాలకు సీడీపీ ఫండ్ లేదు : ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఏడాది గడిచినా నియోజకవర్గాలకు సీడీపీ ఫండ్ ఇవ్వడం లేదని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మీడియా పాయింట్ వద్ద అన్నారు. ఆరు గ్యారంటీల పేరు చెప్పి అన్ని వర్గాల వారినీ మోసం చేశారన్నారు.

గ్యారంటీలకు చట్టబద్ధతేదీ : ఎమ్మెల్యే పాయల్ శంకర్

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత ఏమైందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు జరిగిన శాస్తే కాంగ్రెస్‌కూ జరుగుతుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ కాంగ్రెస్‌ను నిలదీస్తామన్నారు.

క్రీడలు, పర్యాటక పాలసీలపై మద్దతు ఇవ్వకుండా తప్పించుకున్నారు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఆర్ఎస్ విస్మరించిన క్రీడలకు ఒక పాలసీతోపాటు పర్యాటక రంగం అభివృద్ధి కోసం తాము పాలసీ తీసుకొస్తే.. మద్దతు ఇచ్చేదిపోయి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తప్పించుకున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారంకాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. రైతులకు, తల్లులకు బేడీలు వేసిన చరిత్ర మీదని, ప్రజల్లో అలజడి సృష్టించాలనేది మీ పని అని విమర్శించారు. రైతుల సమస్యలు పరిష్కరించని బీజేపీ వారు మొసలికన్నీరు కారుస్తున్నారన్నారు. ప్రతి అంశంపైనా తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

సభను అడ్డుకోవడం శోచనీయం : ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

క్రీడా, టూరిజం పాలసీలు తెస్తే మద్దతు తెలపాల్సిందిపోయి సభను అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. కనీసం స్పీకర్‌పై గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో దళితుడైన సంపత్ కుమార్‌ని సభ నుంచి శాశ్వతంగా బహిష్కరించారని గుర్తు చేశారు. తమ జిల్లాకు అన్ని విధాలుగా అన్యాయం చేసిన పార్టీ బీఆర్ఎస్ అని విమర్శించారు. ఇప్పుడు అభివృద్ధిని చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

అన్ని వ్యవస్థలను చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాం : ఎమ్మెల్యే సీహెచ్.విజయరమణారావు

గత ప్రభుత్వం నాశనం చేసిన అన్ని వ్యవస్థలనూ చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని, కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే సీహెచ్.విజయరమణారావు తెలిపారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రారు.. ఫాంహౌస్‌లో ఉంటారని, కానీ, దళిత నాయకుడైన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పది నిమిషాలు లేట్ అయితే ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఒక్కరోజన్నా ప్రతిపక్ష నాయకులు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చ చేశారా? సూచనలు చేశారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు అబద్ధాన్ని నిజం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ నాయకుల బతుకులు బస్టాండ్.. : ఎమ్మెల్యే శంకరయ్య

బీఆర్ఎస్ నాయకుల బతుకులు బస్టాండ్ అయ్యాయని, సభకు అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే శంకరయ్య అన్నారు. వీధి కుక్కల్లా ప్రవర్తిస్తున్నారని, లగచర్లలో గోరంత ఘటనను కొండంత చేశారని విమర్శించారు. ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేసింది మర్చిపోయి మాట్లాడుతున్నారన్నారు. అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తారా? ప్రతిపక్ష నేతగా ఉంటే రారా? అని ప్రశ్నించారు. ఈరోజు మీరు బేడీలు వేసుకొని వచ్చి నాటకాలు చేస్తున్నారని, రేపు మీకు అవే శాశ్వతం అని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. బీజేపీ నాయకులు కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. జన్ ధన్ ఖాతాల్లో ఎన్ని డబ్బులు వేశారో చెప్పాలని ప్రశ్నించారు.

ప్రాయశ్చిత్తం కావాల్సిందే.. : ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

బీఆర్ఎస్ నాయకులు చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం కావాల్సిందేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఒక్కొక్కరు అక్రమంగా వేల కోట్ల రూపాయలు సంపాదించారని, అది నిజం కాదా? అని ప్రశ్నించారు. మీరు చేసిన పాపాలకు జైళ్లు సరిపోవన్నారు. మీకు కావాల్సింది సభ నడవొద్దు.. మీ దొంగ లెక్కలు బయటపడొద్దు అని విమర్శించారు. రైతులకు బేడీలు వేసిన ఘనత మీదేనని గుర్తు చేశారు.

నిరసనల మధ్యే మూడు కీలక బిల్లులకు ఆమోదం

ఓ వైపు బిజినెస్.. మరోవైపు ఆందోళనలు

- అసెంబ్లీలో లగచర్ల ఘటనపై చర్చకు రెండోరోజూ విపక్షాల పట్టు
- సభావేదికగా ఇరుపక్షాల 'రాజకీయం'







నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర శాసనసభ సమావేశాలు మంగళవారం రసవత్తరంగా సాగాయి. ఒకవైపు సర్కారు బిజినెస్ నడిపిస్తుండగా, మరోవైపు విపక్షాలు లగచర్లతోపాటు ఆరు గ్యారెంటీలపై చర్చకు పట్టుబట్టాయి. వాయిదా తీర్మానాల కోసం బీఆర్ఎస్, బీజేపీ డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల నిరసనల మధ్యే అసెంబ్లీ మూడు కీలక బిల్లులను ఆమోదించింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లు, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లుతోపాటు తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లుకు సైతం అసెంబ్లీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎలాంటి చర్చ లేకుండానే ఈ మూడు బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. రాష్ట్ర పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ అనంతరం సభ బుధవారానికి వాయిదా పడింది. దాదాపు 50 నిమిషాలు సభ జరగగా, బీఆర్ఎస్ సభ్యులు నిలబడే ఉన్నారు. ఇరుపక్షాలు పోటాపోటీ పేపర్ క్లిప్పింగులను ప్రదర్శించాయి. బీఆర్ఎస్ లగచర్ల ఘటనని, కాంగ్రెస్ ఖమ్మం రైతుల బేడీలకు సంబంధించి పేపర్ క్లిప్పింగులను సభలో చూపించాయి.ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు సభ తిరిగి ప్రారంభమైంది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ వచ్చిరాగానే బీఆర్ఎస్ సభ్యులు 'హెలో స్పీకర్ సర్.. ఎలా ఉన్నారు..తిన్నారా ' అంటూ వ్యాఖ్యానాలు చేశారు. దీనికి స్పీకర్ నవ్వుతూ 'ప్రభుత్వ బిల్లులకు సహకరించాలి. మీకు మైక్ ఇస్తాను. సీట్లల్లో కూర్చోండి.. నిలబడటం సరికాదు' అని పదే పదే చెప్పారు. ఉదయమే నల్లచొక్కాలతో వచ్చిన బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ రాగానే నిరసనను తిరిగి కొనసాగించారు. నినాదాలు చేశారు. వారికితోడు బీజేపీ సభ్యులు సైతం ఆరు గ్యారెంటీలకు చట్టరూపం ఎప్పుడు కల్పిస్తారంటూ ప్రశ్నించారు. లగచర్ల ఘటన, ఆరు గ్యారెంటీలపై ప్రతిపక్షాలు పట్టుబడుతూ స్టాండింగ్ పొజిషన్ తీసుకున్నాయి. కొద్దిసేపటి తర్వాత బీజేపీ సభ్యులు బైటాయించారు. మళ్లీ స్పీకర్ స్పందిస్తూ సభా కార్యకలాపాలను కొనసాగించేందుకు సహకరించాలనీ, బిల్లులపై చర్చలో పాల్గొనాలని సూచించారు. అయినా పట్టు వీడకుండా స్పీకర్ పోడియం వద్దకు వచ్చేందుకు ఇరుపక్షాలు ప్రయత్నించాయి. దీంతో స్పీకర్ మార్షల్స్‌ను సభలోకి పిలిచి బీఆర్ఎస్, బీజేపీ పక్షాలను నిలువరించారు. ముందుకు రాకుండా అడ్డుకున్నారు.

మూడు బిల్లులకు ఓకే

సభలో స్పీకర్ యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ బిల్లును ప్రవేశపెట్టాల్సిందిగా మంత్రి కొండా సురేఖను కోరారు. ఆ మేరకు ఆమె సంబంధిత బిల్లును సభకు చదివి వినిపించారు. అలాగే యూనివర్సిటీ బిల్లులను మంత్రి దామోదర రాజనర్సింహ్మ, జీఎస్టీ సవరణ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు సభలో ప్రతిపాదించారు. వీటికి స్పీకర్ అంగీకరించి ఆమోదానికి సభ ముందుంచారు. ఎలాంటి చర్చ లేకుండానే సభ ఓకే చేసింది.

పర్యాటక రంగం అంటే సాంస్కృతిక వారసత్వం :జూపల్లి

పర్యాటక రంగ అభివృద్ధిపై స్వల్పకాలిక చర్చకు స్పీకర్ అనుమతించారు. దీంతో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పర్యాటకం అంటే సాంస్కృతిక వారసత్వమన్నారు. సృష్టిలోని అందాలతో మమేకం కావడమనీ, వినోదం కోసం ప్రయాణమని చెప్పారు. కొత్తగా ఉద్యోగాలను సృష్టించడానికి అవకాశమున్నదని వివరించారు. దుబాయ్, సింగపూర్ దేశాల్లో పర్యాటక రంగం ద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థలు బలోపేతమయ్యాయని చెప్పారు. దేశీయంగా మన పర్యాటక రంగం తొమ్మిదో స్థానంలో ఉండగా, అంతర్జాతీయంగా 12వ స్థానంలో ఉందని తెలిపారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పరిపాలనలో పర్యాటక రంగం పూర్తిగా నాశనమైంద న్నారు. ఆ విషయాలన్ని మరిచి అర్థంపర్థం లేకుండా సభలో గొడవ చేస్తున్నారని విమర్శిం చారు. ప్రభుత్వం వ్యాపారం చేయదనీ, పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. సముద్ర విమానాన్ని తెచ్చేందుకు సైతం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ విషయమై కాంగ్రెస్ సభ్యులు రాజ్ ఠాకూర్, ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఖమ్మంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో రైతులకు బేడీలు వేసిన చరిత్రను మరిచిపోతే ఎలా అని ప్రశ్నించారు. పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు భారీగా ఉన్నాయని చెప్పారు. జన్‌ధన్ ఖాతాలు తెరిచి రూ. 15 లక్షలను మోడీ ప్రభుత్వం వేసిందా అని బీజేపీ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను గొప్పగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. సభ జరగనివ్వకుండా స్పీకర్‌ను అవమానిస్తున్నారని విమర్శించారు.

పబ్లిసిటీ కోసమే.. : శ్రీధర్‌బాబు విమర్శ

బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ప్రచారం కోసమే తప్ప ప్రజల కోసం కాదని మంత్రి డి. శ్రీధర్‌బాబు చర్చలో జోక్యం చేసుకుంటూ వ్యాఖ్యానించారు.బీఏసీలో ఆమోదించిన బిజినెస్ ప్రకారమే సభ నడుస్తున్నదన్నారు. చర్చచేసే ఉద్దేశం బీఆర్ఎస్, బీజేపీకి లేదన్నారు.కేవలం ప్రెస్‌లో రావడానికి మాత్రమే ప్రాధాన్యతను ఇస్తున్నారని గుర్తు చేశారు. సభను అడ్డుకోవడం సరికాదన్నారు. సభ్యులు లేవనెత్తిన అంశాలను చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూనిర్వాసితులకు కచ్చితంగా న్యాయం చేస్తామని ప్రకటించారు. రూ. 2 లక్షల రుణమాఫీ విషయం లో ఇప్పటికే సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి తుమ్మల స్పష్టం గా చెప్పారని వివరించారు.లక్ష రుణమాఫీ చేయడానికి బీఆర్ఎస్ పదేండ్ల సమయం తీసుకుందని విమర్శించారు.

రూల్స్‌ను తుంగలో తొక్కారు : సీతక్క

అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రూల్స్‌ను తుంగలో తొక్కారని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. వాళ్లు తెచ్చిన రూల్స్‌ను వారే అతిక్రమిస్తున్నారని చెప్పారు. లగచర్ల రైతుకు బేడీలు ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి సంబంధిత అధికారిని సస్పెండ్ చేశారని వివరించారు. సభలో అందరికీ ఒకే నిబంధనలు వర్తిస్తాయనీ, చర్చ రూల్స్ ప్రకారమే జరుగుతుందని చర్చ సందర్భంగా చెప్పారు. సరైన పద్ధతిలో చర్చకు రావాలని సూచించారు.

ఇరుపక్షాల రాజకీయం

అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ రాజకీయానికి తెరలేపాయి. బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేస్తే ఆపార్టీకి ప్రజల్లో పలుకుబడి పెరుగుతుందనే భావనలో కాంగ్రెస్ ఉంది. అయితే ప్రభుత్వాన్ని రెచ్చగొట్టి సస్పెండ్ చేయించుకునే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నట్టు అసెంబ్లీ లాబీల్లో గుసగుసలు వినిపించాయి. బీఆర్ఎస్ వ్యూహాన్ని పసిగట్టిన సర్కార్ ఆ అవకాశం బీఆర్ఎస్‌కు ఇవ్వకుండా ముందుకు సాగింది. ఒకవైపు నిరసనగా జరుగుతుండగానే, మరోవైపు బిజినెస్‌ను నడిపించి సభను వాయిదా వేయడం గమనార్హం.

ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై అనుమానాలు

విచారణ జరిపి కుట్రలను బయటికి తీస్తాం

- ఆ సెక్రెటరీ బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా విమర్శలు చేశారు
- ఆ పార్టీ నాయకులు పాత ట్వీట్‌లు చూసుకోండి : మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

గురుకులాలు, హాస్టళ్లు, విద్యాలయాల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై కుట్రలు ఉన్నట్టు తమకు అనుమానాలున్నాయని మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం శాసనమండలిలో ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం విషయంపై బీఆర్ఎస్ నేత మధుసూదనాచారి సిరికొండ తదితరులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. గురుకులాల కార్యదర్శిగా గతంలో పని చేసి బయటికి వచ్చాక ఆ అధికారి వరస ట్వీట్‌లతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపైనే ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత ఘటనలపై విచారణ జరిపించి నిజాలను బయటికి తీస్తామని తెలిపారు. దీంతో తమ పేర్లను మంత్రి ప్రస్తావిస్తున్నారంటూ బీఆర్ఎస్ సభ్యులు టి.రవీందర్‌రావు అభ్యంతరం తెలుపగా, మంత్రి తానెవరి పేర్లు ప్రస్తావించలేదనీ, విచారణ అంటే భుజాలెందుకు తడుముకుంటున్నారని ఎదురు ప్రశ్నించారు.

అంతకు ముందు మధుసూదనాచారి మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థుల సమస్య తీవ్రంగా ఉందనీ, ఏడాదిలో 800 మంది ఫుడ్ పాయిజనింగ్‌కు గురి కాగా, 53 మంది చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెలా నలుగురైదుగురు మరణిస్తున్నారని చెప్పారు. వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థినిని అనేక ఆస్పత్రుల చుట్టూ తిప్పారనీ, మీడియాను కవర్ చేయనీయకుండా ఫెన్సింగ్ వేశారనీ, నేను రాను బిడ్డో ఆశ్రమ పాఠశాలకు అనే పరిస్థితి రాకుండా చూడాలని కోరారు. సభ్యులు ఎం.ఎస్.ప్రభాకర్ రావు మాట్లాడుతూ, ఒక ఐపీఎస్ అధికారి ఐదేండ్లపాటు గురుకులాల్లో కార్యదర్శిగా ఉంటూ ఒక సొంత సంస్థ ద్వారా సామ్రాజ్యం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. దీంతో గురుకులాల్లో జరుగుతున్న వాటిపై అనుమానాలు వస్తున్నాయని చెప్పారు. రాజకీయంగా కాంగ్రెస్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏసీబీతో విచారణ జరిపించాలనీ, పేద పిల్లల జీవితాలతో ఎవరు ఆటలాడుతున్నారో బయటికి వెలికి తీయాలని డిమాండ్ చేశారు.

మంత్రి సీతక్క బదులిస్తూ, గతంలో కూడా అనేక మరణాలు జరిగాయని తెలిపారు. వాంకిడి విద్యార్థినీ శైలజ మరణం చివరి మరణం కావాలని ఆకాంక్షిం చారు. నిత్యావసర, ఆహార పదార్థాల సరఫరాదారులపై నిఘా పెట్టాల్సి ఉందన్నారు. గురుకులాలకు, ఆశ్రమ పాఠశాలల్లో చేరేందుకు డిమాండ్ లేదన్న బీఆర్ఎస్ సభ్యుల వాదనలో నిజం లేదనీ, ఐదో తరగతిలో చేరేందుకు 78 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. శైలజకు మెరుగైన చికిత్సనందించామనీ, ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యవేక్షించారనీ, కుటుంబానికి ఇల్లు, తండ్రికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చినట్టు తెలిపారు. తాను కూడా ములుగు గర్ల్స్ హాస్టల్ విద్యార్థినీ తనకు అక్కడి పరిస్థితులపై అవగాహన ఉందని చెప్పారు. సెక్రెటరీగా పని చేసిన తర్వాత ఆ అధికారి బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేసి అక్కడే ఉన్నారని గుర్తు చేశారు. గురుకులాలు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాదిలో 386 ఫుడ్ పాయిజన్, 2 పాముకాటు, 2 ఎలుక కరిచిన ఘటనలు జరిగాయని చెప్పారు. ఏండ్ల తరబడి పెంచని డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను తమ ప్రభుత్వం పెంచిందని సీతక్క తెలిపారు.దీనికి మధుసూదనాచారి అభ్యంతరం చెబుతూ, తమ వద్ద 800కు పైగా ఘటనలు జరిగి, 53 మంది చిన్నారులు చనిపోయి నట్టు సమాచారం ఉందని కామెంట్ చేశారు.

బీసీ గురుకుల పాఠశాల విద్యార్థినికి తీవ్ర అస్వస్థత

- 15 సార్లు కొరికిన ఎలుకలు
- ఎలుకలు కొరికిన ప్రతిసారి వ్యాక్సిన్
- రెండు కాళ్లూ చచ్చుబడి మంచానికే పరిమితం
- తరుచూ వ్యాక్సిన్ వల్లే కాళ్లు చచ్చుబడినట్టు అనుమానాలు
- ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో వైద్యచికిత్సలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం దాన్వాయిగూడెంలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థిని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని లక్ష్మీభవాని కీర్తి (15)ని గత రెండు నెలల నుంచి 15 సార్లు ఎలుకలు కొరికాయి. పలుమార్లు ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందింది. వారం రోజుల క్రితం తన కాళ్లు, చేతులు లాగుతున్నాయని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఖమ్మంలోని మమత జనరల్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. ఆమె రెండు కాళ్లూ చచ్చుబడి పోయాయని వైద్యులు చెప్పారు. కొన్ని నెలల క్రితం నుంచి ఎలుకలు కొరికిన ప్రతిసారీ వ్యాక్సిన్ వేయిస్తుండటం వల్లనే విద్యార్థిని కాళు పడిపోయాయని అనుమానిస్తున్నారు.15 సార్లు లక్ష్మీ భవాని కీర్తిని ఎలుకలు కొరకగా 15 వాక్సిన్‌ల వరకు వేసినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా బాధిత విద్యార్థిని లక్ష్మీభవానీకీర్తి మాట్లాడుతూ.. హాస్టల్‌లో ఎలుకలు బాగా ఉన్నాయని, ప్రతిరోజూ ఎవరినో ఒకర్ని కొరుకుతున్నాయని తెలిపారు. హాస్టల్ వాతావరణం కూడా అంత బాగోలేదని, అపరిశుభ్రతతోనే ఎలుకలు ఎక్కువయ్యాయన్నారు.ఈ విషయంపై పర్యవేక్షకులకు కంప్లైంట్ చేస్తే పట్టించు కోవడం లేదని, పైగా ఉంటే ఉండండి.. లేకపోతే టీసీ తీసుకుని వెళ్లిపోండని అంటున్నారని వాపోయారు. కాగా, ఆ విద్యార్థిని ఆరోగ్యపరిస్థితి గమనిస్తే కోలుకోవడం కష్టంగానే కనిపిస్తోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థినిని ఎలుకలు కరుస్తున్నాయని బీఆర్ఎస్ రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆరోపించారు.బీఆర్ఎస్ హయాంలో గురుకుల, రెసిడెన్షియల్ హాస్టల్స్‌పై పెట్టిన శ్రద్ధ నేడు కనిపించడం లేదన్నారు.

'లగచర్ల' పై చర్చించాల్సిందే

మండలిలో బీఆర్ఎస్ సభ్యుల నిరసన

సభను వాయిదా వేసిన చైర్మెన్ గుత్తా



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

లగచర్ల సమస్యపై చర్చించాల్సిందేనని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. ఫ్లకార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. శాసనమండలి సమావేశాల్లో భాగంగా మంగళవారం భోజన విరామం తర్వాత 2.40 గంటలకు సభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ లగచర్ల సమస్య తీవ్రమైందని అన్నారు. గిరిజన రైతుకు గుండెపోటు వస్తే బేడీలు వేసి తీసుకురావడం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందని విమర్శించారు. ఆ సమస్యపై చర్చించాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని మాట్లాడుతూ వ్యవసాయం, రైతాంగ సమస్యపై స్వల్పకాలిక చర్చ ఉందన్నారు. అందులో వ్యవసాయం, రైతులకు సంబంధించిన ఏ అంశమైనా మాట్లాడొచ్చని చెప్పారు. ఇప్పుడు సభ సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. భట్టి సమాధానంపై సంతృప్తి చెందని బీఆర్ఎస్ సభ్యులు లగచర్ల సమస్యపై చర్చించాల్సిందేనని పట్టుబట్టారు. చైర్మెన్ పోడియం వద్దకు వచ్చి నిరసన చేపట్టారు. ఫ్లకార్డులు ప్రదర్శించారు. బీఆర్ఎస్ సభ్యులు సంయమనం పాటించాలనీ, ఫ్లకార్డులను ప్రదర్శించొద్దని చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. వారి స్థానాల్లో కూర్చోవాలని విజ్ఞప్తి చేశారు. అయినా పోడియం ముందు కవిత, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, శంభీపూర్ రాజు, కోటిరెడ్డి తదితరులు నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ సభ్యుల నిరసనతో సభలో గందరగోళం ఏర్పడింది. మధ్యాహ్నం 2.55 గంటలకు సభను బుధవారం ఉదయం పది గంటలకు వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

లగచర్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం : మధుసూదనాచారి

లగచర్ల బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి చెప్పారు. సభ వాయిదా పడిన వెంటనే బీఆర్ఎస్ సభ్యులు శాసనమండలి ఆవరణలో నిరసన చేపట్టారు. 'గిరిజన రైతుకు బేడీలా సిగ్గుసిగ్గు, ఇదేమి రాజ్యం కేడీల రాజ్యం, బేడీల రాజ్యం, లగచర్ల రైతులను విడుదల చేయాలి, ఇది ప్రజాపాలన కాదు ప్రజాపీడన, రైతు పీడన'అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్దకు ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్ల బాధితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. భూమి కోసం పోరాడిన వారి పట్ల అమానుషంగా వ్యవహరించి కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకు పంపిందని అన్నారు. ఈ అంశంపై చర్చించాలని పట్టుబడితే ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదన్నారు. వారికి న్యాయం జరిగే వరకు అడుగడుగునా ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు.

భయపడుతున్న ప్రభుత్వం : కవిత

లగచర్ల సమస్యపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భయపడుతున్నదని బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత అన్నారు. రైతులను అక్రమంగా అరెస్టు చేసి బేడీలు వేయడం సిగ్గుచేటన్నారు. ఈ సమస్యపై భవిష్యత్తులోనూ ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు.

ఇది ప్రజాపీడనా ప్రభుత్వం : దేశపతి శ్రీనివాస్

రైతుకు గుండెపోటు వస్తే స్ట్రెచర్ మీద తీసుకొస్తారా?, బేడీలు వేసి తీసుకొస్తారా?అని బీఆర్ఎస్ సభ్యుడు దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. ఇది ప్రజాపాలన ప్రభుత్వం కాదనీ, ప్రజాపీడన ప్రభుత్వమని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇనుపకాళ్ల కింద రైతులు నలిగిపోతున్నారని అన్నారు. పర్యాటక రంగ విధానం తప్పులతడకగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో పర్యాటక రంగంలో అభివృద్ధి లేదంటూ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నదని చెప్పారు. కరోనా సమయంలో పర్యాటకరంగం అభివృద్ధి చెందుతుందా? ఎవరైనా ఇంటి నుంచి బయటికి వచ్చారా?అని ప్రశ్నించారు.

నియోజక వర్గ సమస్యలు పరిష్కరించండి

- జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ నియోజకవర్గాల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కోరారు. సంబంధిత అంశాలను వారు సభ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం జీరో అవర్‌లో భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో సంభవించిన తుఫాను, వరదల ఉధృతి వల్ల నియోజక వర్గంలో పలు వంతెనలు, రోడ్లు తెగిపోయాయని గుర్తు చేశారు. వాటిని మరమ్మతు చేయించటంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. ఇదే క్రమంలో కొందరు చనిపోయారని తెలిపారు. ఆ కుటుంబాలకు కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆయా కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఓవర్‌సీస్ స్కాలర్ షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ ఉస్మానియా ఆస్పత్రిని ప్రస్తుతం ఉన్న స్థలంలోనే పునర్ నిర్మించాలన్నారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని చె నెంబర్ ప్రాంతంలో ఐదేండ్లుగా ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయనీ, తక్షణం వాటిని పూర్తి చేయాలన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ 20ఏండ్లనుంచి పాల్వంచలో ఎన్నికలు జరగటం లేదనీ, అందుకు అడ్డంకిగా ఉన్న సమస్యలను పరిష్కరించి,మున్సిపాల్టీని ఏర్పాటు చేయాలని కోరారు.

బాలునిపై ఎలుగుబంటి దాడి

- గాయపడటంతో ఆస్పత్రికి తరలింపు
- నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలో ఘటన

నవతెలంగాణ-ఎడపల్లి



ఉదయం పూట కాలకృత్యాలకు వెళ్లిన బాలునిపై ఎలుగుబంటి దాడి చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామ శివారులో మంగళవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన అశ్విత్ కుమార్ చెరువు కట్ట వద్ద కాలకృత్యాల కోసం వెళ్లగా.. ఎలుగుబంటి దాడి చేసింది. ఈ ఘటనలో బాలుడు అశ్విత్ తప్పించుకునే ప్రయత్నంలో మోకాలి భాగంలో తీవ్రంగా గాయమైంది. గాయపడిన బాలుడిని స్థానికులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఎలుగుబంటి సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కాగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సెలవులు పెడితే పేషెంట్ల పరిస్థితేంటి..?

- కలెక్టర్ హనుమంతరావు ఆగ్రహం
- రామన్నపేట ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-రామన్నపేట

ఆస్పత్రిలో అందుబాటులో ఉండాల్సిన వారు ఎక్కువ మంది సెలవులు పెడితే.. పేషంట్లకు వైద్యం ఎవరు చేస్తారంటూ యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు రెండు గంటలపాటు ఆస్పత్రి మొత్తం కలియదిరిగారు. ప్రతి పేషెంట్‌నూ కలిసి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీ దగ్గర ఉన్న పేషెంట్లతో మాట్లాడి.. అక్కడికక్కడే వైద్యులకు చెప్పి సంబంధిత వైద్యం చేయించారు. కొంతమంది పేషెంట్ల విషయం ఆరోగ్యశ్రీ విభాగం వారికి అప్పజెప్పి.. మెరుగైన వైద్యం అందేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అటెండెంట్ రిజిస్టర్‌లను పరిశీలించి ఒక్కో ఉద్యోగి గురించి పరిశీలించారు. లీవ్ లెటర్లు ఉన్నాయని తెప్పించుకొని పరిశీలించారు. సుమారు 60శాతం ఉద్యోగులు సెలవులో ఉండటాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. డ్యూటీలో ఉండాల్సిన వారు సెలవులు పెట్టారని, అంతగా ప్రాముఖ్యత లేని వారు డ్యూటీలో ఉన్నారని తెలిపారు. లీవ్ లెటర్లలోని సంతకాలు వారివేనా అని ప్రశ్నించారు. రిజిస్టర్‌లో ఒకరకంగా.. సెలవు చీటీలపై మరో రకంగా ఉండటంపై ఆరా తీశారు. గైనకాలజిస్ట్ పోస్ట్ ఖాళీగా ఉండటంతో ఫోన్‌లో డీసీహెచ్ఎస్‌తో మాట్లాడారు. వెంటనే ఇక్కడ గైనకాలజిస్టును నియమించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో పెట్టే భోజనాన్ని పరిశీలించారు. ఫుడ్ కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి నాణ్యమైన పౌష్టికాహార భోజనాన్ని పెట్టాలని సూచించారు. మంచినీటి సౌకర్యం లేకపోవడంతో మిషన్ భగీరథ ఉద్యోగులను పిలిపించి వెంటనే నీటిని అందించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. హెచ్పీసీఎల్ అధికారులతో మాట్లాడి రెండు వాటర్ ఫిల్టర్‌లను అందించాలని కోరారు.

రోహిణి విల్లాస్‌లో విద్యుద్ఘాతం




నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్
ఎన్టీఆర్ నగర్ ఖిల్లా మైసమ్మ సమీపంలోని రోహిణి విల్లాస్‌లో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. ఇంటి యజమాని డాక్టర్ శ్రీనిధి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందన్నారు. విల్లాపై అంతస్తులో ఒక్కసారే మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చామన్నారు. నాగోల్ అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి మంటలను అదుపు చేశారని తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంలో విలువైన వస్తువులు, నగదు కాలిపోయాయని వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి ఘటనా స్థలాన్ని చేరుకున్నారు. తర్వాత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెల ధర్మేంద్ర ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని నారాయణ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి లోహితస్య మరణాన్ని నిరసిస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ విద్యార్థి మరణానికి న్యాయం చేయాలంటూ కోరుతూ మృతుడి బంధువులతో కలిసి నారాయణ స్కూల్ ఎదుట ఆందోళనకు దిగినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంచాల శ్రీకాంత్, ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షులు సంపత్, రవికుమార్, వినయ్, శ్రావణ్ కుమార్, మంద అమర్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-హయత్‌నగర్

ప్రతిభను వెలికి తీసేందుకే
సీఎం కప్ టోర్నమెంట్



దేప భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ - ఎల్బీనగర్
గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న సీఎం కప్ ఆటల పోటీలను మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండలంలో ఉన్న జడ్పీ హెచ్ఎస్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం ఎంపీడీవో శైలజ రెడ్డి ప్రారంభించిచారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను ప్రపంచ స్థాయికి వెలికితీసేందుకే సీఎం కప్– టోర్నమెంట్ నిర్వస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పంచాయతీ స్థాయి క్రీడలు, ఫుట్ బాల్, కబడ్డీ, కోకో, వాలీబాల్ లాంటి ఆటలు ఉన్నాయని వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి టెంటు, భోజన ఏర్పాట్లకు సహకరించిన మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, ఒత్తుల రఘుపతిని దేప భాస్కర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్ రెడ్డి, పల్లె బిక్షపతి, నరసింహ, చేపంగి ప్రవీణ్, సాంబయ్య, శ్రీనివాస్ ఎంఈఓ, ఉపాధ్యాయులు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలు తొలగించాలని నిరసన

నవతెలంగాణ-ఎల్బీనగర్
పలు డివిజన్లలో జరుగుతున్నటువంటి అక్రమ వ్యాపార సముదాయలను తొలగించాలని, వారిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ సమితి, నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ..జీహెచ్ఎంసీలో టౌన్ ప్లానింగ్ డీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు డివిజన్లలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ సర్కిల్ డీసీ, ఏసీపీలకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. శివగంగ కాలనీలో సర్వేనెంబర్ 66/8లో అక్రమంగా నిర్మాణం జరుగుతున్నా దానిపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అలాగే పలు డివిజన్లలో బొమ్మల గుడి నుండి వీరన్న గుట్టకు పోయే దారిలో అనేక అక్రమ వ్యాపార సముదాయాలు రేకుల షెడ్డు నిర్మిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

అదే కాకుండా సర్వే నెంబర్ 199/1 లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఉన్నటువంటి ఒక ఎకరం 9 గుంటల భూమిని కూడా గతంలో ఫినిషింగ్ చేసినా ఓ బిల్డరు దానిని తొలగించి.. మళ్లీ రోడ్డు నిర్మాణం చేసిన కూడా చూసి చూస్తున్నట్లు అధికారులు మామూలు మత్తులో ఉండిపోయారని ఆరోపించారు. అక్రమ నిర్మాణపైన జోనల్ కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్‌కు అందజేశారు. ఈ ధర్నాలో ఎల్బీనగర్ నియోజకవర్గం సహాయ కార్యదర్శి బాతరాజు నరసింహ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి షైమిద, హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శులు బోయపల్లి రాములు గౌడ్, కందుల సుధాకర్, మర్రి శోభన్, బి. అరుణ్ కుమార్ గౌడ్, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు రామావత్ సక్రు నాయక్, శాఖా కార్యదర్శులు సరిత, అనిత, సౌజన్య, జ్యోతి, సౌజన్య, నాగరాజు, చెంది వెంకట్, పార్టీ శ్రేణులు, వివిధ కాలనీవాసులు పాల్గొన్నారు.

మాడు మూసుకుపోయిన
చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స

ఎండోస్కోపిక్ సూచరెక్టమీ, అనంతరం హెల్మెట్ థెరపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో/ హయత్‌నగర్
మాడు మూసుకుపోయిన చిన్నారికి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఎండోస్కోపిక్ సూచరెక్టమీ, అనంతరం హెల్మెట్ థెరపీ చేశారు. ఇలాంటి అరుదైన కేసును సమయానికి గుర్తించి, ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ఓ చిన్నారికి ప్రాణదానం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ న్యూరో సర్జన్, మినిమల్ యాక్సెస్ బ్రెయిన్ అండ్ స్పైన్ సర్జన్ డాక్టర్. ఎస్.రమేష్ వెల్లడించారు. "వరంగల్‌లో 3డీ ప్రింటింగ్ చేసే వ్యక్తికి శిశువు పుట్టిన తర్వాత మూడు నెలల వయసులో ఉండగా సాధారణంగానే పిల్లల వైద్యులకు చూపించారు. కానీ, ఖాళీగా ఉండాల్సిన మాడు ప్రాంతం బాగా గట్టిగా ఉండి, అక్కడ సైతం కపాలం ఏర్పడటాన్ని గుర్తించి.. అందుకు తగిన శస్త్రచికిత్స చేయాలని కామినేని ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఇక్కడ చిన్నారికి అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాత.. ఎండోస్కోపిక్ విధానంలోనే సూచరెక్టమీ అనే శస్త్రచికిత్స చేశాం. ఈ విధానంలో మూసుకుపోయిన మాడు ప్రాంతాన్ని మళ్లీ తెరిచి, మెదడు తగినంతగా ఎదిగేందుకు కావల్సిన వాతావరణాన్ని కల్పించాం. ఇలాంటి కేసులు చాలా అరుదుగా ఉంటాయి. జన్యుపరమైన కారణాల వల్లే చాలా వరకు ఇలాంటి సమస్య తలెత్తుతుంది. ప్రతి 3 వేల మంది శిశువుల్లో ఒకరికి మాత్రమే ఇలా జరుగుతుంది. ఈ శస్త్రచికిత్స చేసిన తర్వాత హెల్మెట్ థెరపీ కూడా చాలా ముఖ్యం. దాదాపు 12 నుంచి 15 నెలల పాటు ప్రతిరోజూ సుమారు 22–23 గంటలు శిశువుకు ఇది పెట్టి ఉంచాలి. దానివల్ల ఎక్కడ మెదడు ఎక్కువగా పెరగకూడదో అక్కడ నియంత్రించడం, ఎక్కడ ఎదుగుదల అవసరమో అక్కడ ఫ్రీగా ఉంచడం సాధ్యమవుతుంది. ఈ హెల్మెట్ కూడా ఇక్కడ అందుబాటులో ఉండదు. అందుకే ప్రత్యేకంగా బెంగళూరు నుంచి తెప్పించాం. ఇందులోని కనిషన్ అనేక పొరలుగా ఉంటుంది. శిశువు ఎదిగేకొద్దీ మెదడు కూడా ఎదుగుతుంది కాబట్టి.. అందుకు తగినట్టుగా కొన్ని పొరలను తొలగిస్తూ వెళ్తాం. ఇప్పుడు ఈ శిశువు పూర్తి ఆరోగ్యంతో ఉంది. మరికొన్నాళ్ల పాటు ఫాలో అప్ కోసం వస్తూ, హెల్మెట్ మాత్రం తప్పనిసరిగా ధరింపజేస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించాం" అని డాక్టర్ రమేష్ తెలిపారు.

జాటోత్ దుర్గ్యా నాయక్‌కు ఘన నివాళి



నవతెలంగాణ- చంపాపేట్
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ జాటోత్ దుర్గ్యా నాయక్ అమరులయ్యారు. ఈ మేరకు మంగళవారం గిరిజన సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. రాముకుమార్, ఎం. బాలునాయక్, మహేష్ , దుర్గే రాములు, సురేష్, మునిలాల్ హలీం భాయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో బడంగ్‌పేట్ : మేయర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్
బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్‌లోని భీష్మ నగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మంగళవారం కార్పొరేటర్ బంగారు అనిత ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.



పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు



నవతెలంగాణ-హయత్‌నగర్
ఓ మైనర్‌ను ప్రేమ పేరుతో మభ్యపెట్టి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. లైంగిక దాడికి పాల్పడి అమానుషంగా హత్య చేసిన ఘటన 2014లో వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సాహెబ్ నగర్‌కు చెందిన నిందితుడు దబ్బగోటి వెంకటేష్‌ది ప్రకాశం జిల్లా. అత్యాచారం, పోక్సో చట్టం ప్రకారం రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్‌లోని గౌరవ ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి మంగళవారం నిందితుడిని దోషిగా నిర్ధారించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత తెలిపారు. ఈ కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష, రూ.13,000 జరిమానా విధించినట్లు వెల్లడించారు.

డిపో మేనేజర్‌కు వినతి



నవతెలంగాణ - చంపాపేట్
ఉప్పుగూడ అరుంధతి నగర్ బస్తీకి ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని కోరుతూ ఐద్వా జిల్లా కార్యదర్శి శశికళ, అధ్యక్షులు లక్ష్మమ్మలు మంగళవారం ఫలక్‌నూమ డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో రకరకాల కారణా లు చెబుతూ ఆర్టీసీ వారు ఫలక్‌నూమ డిపో నుంచి గతం లో అరుంధతి నగర్ ఉప్పుగూడకు వచ్చే బస్సును తీసివేయడం దుర్మార్గమై నటువంటి చర్య అని అన్నారు. ఉప్పు గూడ సాయిబాబా నగర్ తదితర ప్రాంతాలలో చాలామంది కార్మికులు (లేబర్) పనులు చేసుకోవడం కోసం నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్తుం టారని గుర్తుచేశారు. అటువంటి వారికి ఉప్పుగూడ అరుంధతి నగర్ బ్రిడ్జి దగ్గర నుంచి గతంలో బస్సు నడిచేదని, ఈ మధ్యకాలంలో ఆ బస్సును తొలగించడం వలన ఈ బస్తీలలో ఉండే కార్మికులు, విద్యార్థులు, మహిళలు, ఎన్నో ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. అరుంధతి నగర్ ఉప్పుగూడ బస్సును పునరుద్ధరించాలని కోరారు. వినతి అందజేసిన వారిలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు ఎల్ కవిత, ఎం జ్యోతి, కే స్వరూప తదితరులు ఉన్నారు.

సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



నవతెలంగాణ-చంపాపేట్
ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని డిఎల్ఆర్ఎల్ సాయిబాబా ఆలయం వద్ద సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బందులను సృష్టిస్తున్న దుకాణదారులపై, గుడ్స్‌ఆటోలపై కేసులను నమోదు చేసి జరిమానాలను విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటప్ప, ఏఎస్ఐ అలివేలు మాట్లాడుతూ రోడ్లపైన, ఇరువైపుల వాహనాలను నిలిపి ట్రాఫిక్ ఇబ్బందులను సృష్టిస్తున్నారని, అదే విధంగా డీమార్ట్ వివిధ వైన్స్, రెస్టారెంట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందుల ఫిర్యాదులు వస్తున్నాయని దీనిపై కూడా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ కనిపించకుండా చేసినట్లయితే వాహన యజమానిపై మోటర్ వెహికల్ యాక్ట్ 129(2) రూ. 2వేలు వరకు జరిమానా లేదా నెల రోజులు జైలు శిక్ష పడే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'లగచర్ల రైతన్నలపై అరాచకాలను ఆపాలి'



లగచర్ల రైతులకు సంఘీభావంగా నల్ల షర్ట్స్‌తో నిరసన

నవతెలంగాణ -ఎల్బీనగర్
లగచర్ల రైతులకు సంఘీభావంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వినూత్న పద్ధతిలో నిరసన తెలియజేశారు. దానిలో భాగంగా ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి..సహచర ఎమ్మెల్యేలతో కలిసి నల్లరంగు షర్ట్స్, చేతులకు బేడీలు వేసుకుని అసెంబ్లీకి హాజరయ్యారు. ఇదేమి రాజ్యం, ఖాకీ రాజ్యం, దోపిడీ రాజ్యం, లాఠీ రాజ్యం, లూఠీ రాజ్యం, రైతులకు సంకెళ్లా సిగ్గు సిగ్గు అంటూ అసెంబ్లీ లాబీల్లో నినాదాలు చేశారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశం మేరకు..బడంగ్‌పేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో లగచర్ల రైతుల అరెస్ట్‌కు నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, కార్పొరేటర్ పెద్ద బావి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పెద్ద బావి ఆనంద్ రెడ్డి, ముత్యాల కృష్ణ, బీసీ, ఎస్సీ, యూత్ సెల్ అధ్యక్షులు కోటగిరి జంగయ్య, పుట్టగల్ల సంతోష్, చిత్రం సాయి, తూఫాన్ రెడ్డి, మాధవరెడ్డి, మహేందర్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్



రైతు వ్యతిరేక ప్రభుత్వం కాంగ్రెస్ అని, ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ హెచ్చరించారు. లగచర్ల రైతులను వేధిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహానికి పార్టీ నేతలతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిద్దగోని వెంకటేష్ గౌడ్, ఉద్యమ కారుడు కొండ్రు శ్రీనివాస్, పార్టీ నేతలు నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, న్యాయవాది మంత్రి రవీందర్ రావు, దేవాలయం మాజీ చైర్మెన్ గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, శ్యాం గుప్త, శ్రీకాంత్ గౌడ్, నవీన్ గౌడ్, చిన్నం రమేష్ కురుమ, జయమ్మ, శివ నాయక్, ముచ్చింతల జగన్, గణేష్ నాయక్, మల్లేష్ ముదిరాజ్, దీపక్, శంకర్, నిరంజన్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - మీర్ పేట్
లగచర్ల రైతులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఆపాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ పిలుపు మేరకు జిల్లెలగూడ చౌరస్తాలో లగచర్ల రైతులపై రేవంత్ రెడ్డి చేస్తున్న అరాచకాలు, అణచివేతల నుండి కాపాడాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు బొక్క రాజేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సిద్దాల బీరప్ప, సిద్దాల అంజయ్య, దీప్ లాల్ చౌహన్, బాల్ రాజ్, కో ఆప్షన్ సభ్యులు రజాక్, గోపి తదితరులు పాల్గొన్నారు.




భారీ శబ్దం చేసే సైలెన్సర్ వాడితే చర్యలు

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-హయత్‌నగర్
నగరంలో భారీ శబ్దాలు చేసే సైలెన్సర్‌లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుల్లెట్ ద్విచక్ర వాహన దారులు భారీ శబ్దాలు కలిగిన సైలెన్సర్‌లను ఉపయోగించి.. జాతీయ రహదారిపై తోటి వాహనదారులను భయ భ్రాంతులకు గురిచేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి నందుకుగాను వారికి జరిమానా విధించారు. తర్వాత అక్కడికక్కడే మెకానిక్ సాయంతో ఆ సైలెన్సర్‌ను మార్చివేసి వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట అదనపు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐలు రవి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాధికారం ఇవ్వడంలో
ముందున్న పార్టీ బహుజన సమాజ్

బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెల ధర్మేందర్



నవతెలంగాణ-నాగోల్
బహుజనులకు రాజ్యాధికారం ఇవ్వడంలో ముందున్న పార్టీ ఏదైనా ఉంది అంటే అది బహుజన సమాజ్ పార్టీ అని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెల ధర్మేందర్ అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ జన కళ్యాణ్ దివాస్ ఆర్థిక సహాయ దినోత్సవంలో భాగంగా మంగళవారం ఎల్బీనగర్ బీఎస్పీ అధ్యక్షులు సంపత్ వేముగంటి ఆధ్వర్యంలో నాగోల్ డివిజన్‌లో మొదలు పెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు బండారి రవి ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా బీవీఎఫ్ కన్వీనర్ దాసరి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
బుధవారం | డిసెంబర్ 18, 2024 | www.navatelangana.com

వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి : కౌన్సిలర్ తుడుం గణేష్



నవతెలంగాణ-మేడ్చల్

వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాని కౌన్సిలర్ తుడుం గణేష్ అన్నారు. మంగళవారం చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డితో కలిసి రూ.10 లక్షలవ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో గలిపించిన వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. వార్డులో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో మర్రి నర్సింహారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు వెంకటేష్, నరేష్,పవన్, యాదయ్య, అర్జున్, అంజనేయులు, భుజంగరావు, శ్రీనివాస్, శంకరయ్య నరసమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

పోచారం కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ నాయ కులు పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్డు గుంతలు మాయమై ప్రమాదం జరుగుతున్నాయని వినతి పత్రం అందజే శారు. సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ జన రల్ సెక్రటరీ మెట్టు గణేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసి డెం టట్ కృష్ణారెడ్డి, టీపీసీసీ కన్వీనర్ నల్లమల్ల ప్రవీణ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అధ్యక్షులు బద్రి హేమంత్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎర్ర రాజు, బీసీ సెల్ కన్వీనర్ చంద్రకాంత్, యూత్ ఇన్‌చార్జి మల్లికార్జున్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యుగేందర్ రెడ్డి, తదిరతరులున్నారు.

రామంతాపూర్, భగాయత్ కాలనీల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

రామంతాపూర్ భగాయత్ కాలనీల అభి వృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రామంతాపూ ర్ భగాయత్‌లో మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా నాగేశ్వరరావు కలిసి కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బాలకృష్ణానగర్ కాలనీలో డ్రయినేజీ సమస్య ఉండడం వలన విషజ్వరాల బారిన పడుతున్నారని ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రూ. 71,40,000 వ్యయంతో డ్రయినేజీ లైన్ మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు జహంగీర్, గౌరవ అధ్యక్షులు స్వామి, కాలనీ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు నరసింహ రెడ్డి, విజేందర్ రెడ్డి, నాగేష్, రాములు, మల్లేష్, జాన్ ముల్లార్, శోభన్, కాశం గౌస్ బీఆర్‌ఎస్ నాయకులు సురం శంకర్, చాంద్ పాషా, నరేష్, బోసాని పవన్, ప్రశాంత్ గౌడ్, మహేందర్, మందపాటి శ్రీనివాస్ రెడ్డి, అనంద్, సాయి, సురేష్ తదితరులున్నారు.

ఇందిరమ్మ రాజ్యమంటే రైతులకు సంకెళ్లు వేయడమేనా..







- కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపం : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- లగచర్ల రైతుల అరెస్టును నిరసిస్తూ పలు చోట్ల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు అందజేత

నవతెలంగాణ-ఉప్పల్

రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యమంటే రైతులకు సంకెళ్లు వేయడమేనా? అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. లగచర్ల లో రైతుల అక్రమ అరెస్టులకు నిరసనగా బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ ఆదేశాలకు మేరకు ఉప్పల్ రింగ్‌రోడ్డులోని డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంటు బాధ్యులు రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజక వర్గమైన కొడంగల్‌లోని లగచర్ల రైతులు తమ భూమిని తామే సాగు చేసుకుంటా మంటే, లేదు కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఇబ్బంది పెట్టడం దారుణం అన్నారు. రేవంత్ నియంతృత్వ అరాచక పరిపాలన లో దళిత రైతులను అక్రమంగా అరెస్టు చేసి గత నెల రోజులుగా వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ టెర్రరిస్టుల్లాగా జైల్లో బంధించి హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి సీఎం బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి బన్నాల గీత, కార్పొరేటర్లు ప్రభుదా స్, దేవేందర్ రెడ్డి, శాంతి సాయిజన్ శేఖర్, మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, ఉద్యమ నాయకులు, మహిళ నాయకురాలు పాల్గొన్నారు.

లగచర్ల రైతులపై సర్కారు కక్ష్య సాధింపు

బోడుప్పల్

లగచర్ల రైతులపై రేవంతర్‌రెడ్డి సర్కారు కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జక్కా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు నలుపు రంగు కండువాలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ భూమి తమకే ఉండాలని కోరుకున్నందుకు లగచర్ల గిరిజన, దళిత రైతులను కాంగ్రెస్ జైల్లో పెట్టిందని దుయ్యబట్టారు. వారిపై అప్రజాస్వామికంగా కేసులు పెటి థర్డ్ డిగ్రీ ఉప యోగిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేష్, మధుసూదన్ రెడ్డి, హరిశంకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్ రెడ్డి, మనోరంజన్‌రెడ్డి, జావీద్ ఖాన్, మహిళా అధ్యక్షురా లు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభుత్, మైనారిటీ అధ్యక్షులు జిలాని పాషా, ఆంజనేయులు, గడీల జగన్ రెడ్డి, యాసారం శ్రీనివాస్, బుల్లెట్ శంకర్, పింగళి జోగిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, బత్తుల కిరణ్, శ్రీరాములు, సరస్వతి, పల్లవి, ఇందిరా, లవణ్య, కళ్యాణి, తదితరులున్నారు.

మేడ్చల్‌లో..

లగచర్ల ఘటనలో అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి విష్ణుచారి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మేడ్చల్ పట్టణంలో ని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు రైతులను వెంటనే విడుదల చేయాలని, వద్దురా నాయన కాంగ్రెస్ పాలన అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఓట్లు వేసి గెలిపించిన పాపానికి రైతుల పై అక్రమ కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించి బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడం హేయనీయమన్నారు. వారిని విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తుడుం గణేష్, కోఆప్షన్ సభ్యులు అకిటి నవీన్ రెడ్డి,పార్టీ మండల ఉపాధ్యక్షుడు రఘుపతి రెడ్డి, యూత్ అధ్యక్షుడు హరత్ రెడ్డి,మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, నాయకులు సందీప్ గౌడ్, సంజీవరావు, మల్లేష్,మహేందర్, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి



- మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్
- అభివృద్ధికి నిధులు కేటాయించాలని అదనపు కలెక్టర్ రాధికా గుప్తాకు వినతి

నవతెలంగాణ-జవహర్ నగర్

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అభివృద్ధికి నిధులు కేటాయించాలని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తాను కలిసి వినతి పత్రం అందజేశారు. జవహర్ మున్సిపల్ పరిధి లోని అంబేద్కర్ చౌరస్తా నుండి ఫైరింగ్ కట్ట వరకు 100 ఫీట్ల రోడ్డు విస్తరించాలని, మున్సిపల్ కౌన్సిల్‌లో చేసిన తీర్మానం కాపీని అందజేశారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను త్వరగా విడుదల చేసి, జీహెచ్‌ఎంసీకి సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. నగర పాలక సంస్థలో పరిధిలోని ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కార్మికులను నియమించడానికి వీలు కల్పించాలని కోరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా ఏఎస్ రావు నగర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్‌కే నగర్ అంతయ్య కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపును లయన్స్ జిల్లా గవర్నర్ కృష్ణ ప్రసాద్‌తో పాటు వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు ఇన్నారెడ్డి, కృష్ణారెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. చుట్టు పక్కల కాలనీల ప్రజలకు వివిధ వైద్య సేవలను అందిస్తున్న క్లబ్ సేవలను కొనియాడారు. జిల్లా స్థాయిలో కూడా క్లబ్ కార్యక్రమాలలో పాలు పంచుకుంటామని తెలిపా రు. కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ డా.అనిల్ బృందం లయన్స్ కండ్ల పరీక్షలు చేశారు. 163 మంది క్యాంపులో పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 61 మంది స్త్రీలు కాన్సర్ పరీక్షలు చేయించు కున్నారు. పద్మసాయి డెంటల్ క్లినిక్ డా .దినేష్ బృందం దంతాల పరీక్షలు పరీక్ష చేశారు. డా.హరగోపాల్ జనరల్ పరీక్షలు, సీయస్ కాన్సర్ క్లినిక్ డాక్టర్లు కాన్సర్ స్క్రీనింగ్ చేశారు. క్యాంపు లో లయన్స్ జిల్లా నాయకులు హనుమంతరావు, నాగన్న సావిత్రి పాల్గొని అభినందనలు తెలిపారు. క్లబ్ ప్రెసిడెంట్ శ్రీదేవి సెక్రటరీ వరప్రసాద్, సభ్యులు సురేష్ కుమార్ ,మోహన్ , సునీల్, కాలనీ నాయకులు కెవిఎస్ నాయకుడు నర్సింగ్ రావు, సీఐటీయూ నాయకురాలు సుమిత్ర, మహిళా నాయకురాలు నాగమణి ఇతరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



- మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళ వారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెంబరు 20లోని వివిధ కాలనీలలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.12.30 లక్షలతో చేపడు తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాగారం మున్సిపాలిటీని దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ అన్నమరాజు సుమిత్ర సురేశ్ ,కాలనీ వాసులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన పెయింటర్ నరహరి ఇటీవల మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న తోటి పెయింటర్లు మంగళవారం వారి అసోసి యేషన్ తరపున మృతుడి కుటుంబ సభ్యులకు రూ.18వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ యూనియన్ లోని సభ్యులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అందరూ కలిసి ఆర్థిక సాయం చేయడం అభినందనీయమ న్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, రమేష్ సురేష్, మూర్తి, సుధాకర్, ఆసిఫ్, నజీర్, రాజేష్, చిన్నా యాదగిరి పాల్గొన్నారు.

కృష్ణానగర్ కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ పరిధిలోని కృష్ణా నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతక కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.ఎస్.ఎన్. మూర్తి, జె.రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా బి.దేవరాజ్, సంయుక్త కార్యదర్శులుగా డి.శ్రీని వాస్ యాదవ్, బి.బాలయ్య గౌడ్, శ్యామ్ సుందర్ , కోశాధికారిగా ఎ.అంజయ్య గౌడ్‌లు గెలుపొందా రు. మహిళ ఉపాధ్యక్షురాలుగా జయమ్మ, మహిళ సంయుక్త కార్యదర్శిగా కృష్ణవేణి, కార్యనిర్వహక కార్యదర్శిగా అనంత చారి, సాంస్కృతిక కార్యదర్శిగా వెంకటేశ్వరరావు లు గెలుపొందారు.

గురుకుల హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలి

- బీజేపీ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి



నవతెలంగాణ-కీసర

ప్రభుత్వం గురుకుల హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం కీసర మండల కేంద్రంలోని గురుకులంలో ఎలుకలు కరిసిన విద్యార్థులను హాస్పిటల్‌లో పరామర్శించడానికి వెళ్లిన ఏనుగు సుదర్శన్ రెడ్డిని కీసర పోలీస్‌లు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలుకలు కరిచి అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులను పలకరించడానికి వస్తే పోలీసులు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. బాత్రూం సౌకర్యం లేక హాస్టల్లోకి పాములు, ఎలుకలు వస్తున్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తుగ్లక్ పరిపాలనతోనే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికైన హాస్టల్‌లో వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, నాయకులు నల్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవు

- ప్రభుత్వ స్థలాలు కోని మోసపోవద్దు
- బోడుప్పల్ కార్పొరేషన్ ప్రజలకు మేయర్ అజయ్ యాదవ్ విజ్ఞప్తి
- రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సర్వే
- హద్దులు దాటితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరిక



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబరు 63/26 నుండి 63/38లలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని భవిష్యత్తులో ప్రజా అవసరాలకు అనుగుణంగా ఉపయోగించే స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబరు 63/26 నుండి 63/38 లలో బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ అజయ్ యాదవ్, కమిషనర్ జీ.రామ లింగం, మేడిపల్లి తహసీల్దారు హసీనాలతో కలిసి పర్యటించారు. అనంతరం మేడిపల్లి తహసీల్దారు, మేయర్ అజయ్ యాదవ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి కొంతమంది స్వార్థపరుల కారణం గా రోజు రోజుకు కుంచించుకు పోతుందన్నారు. ఇలా అయితే భవిష్యత్తులో బోడుప్పల్ కార్పొరేషన్ ప్రజలకు అవసరాలకు భూమి లేకుండా పోతుంద ని, దానిని దృష్టిలో ఉంచుకుని ఎవరూ దళారుల మాటలు నమ్మి ప్రభుత్వ భూమిలో ఎలాంటి కొనుగోళ్ళు చేయవద్దని తెలిపారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా నిర్మాణాలు చేపడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్

నవతెలంగాణ - చర్లపల్లి

భారత్ గ్యాస్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను అకారణం లేకుండా తొలగించడం అన్యాయమని, తిరిగి వారిని వీధుల్లోకి తీసుకోవాల ని యూనియన్ అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్ అన్నారు. మంగళవారం చర్లపల్లి పారిశ్రామిక వాడలోని భారత్ పెట్రోలియం ఎల్పీజీ ఫిల్లింగ్ ప్లాంట్ కార్మికులు కంపెనీ వద్ద కార్మికులు ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను తొలగించి బీహార్ కార్మికులతో పనులు చేయిస్తు న్నారని తప్పు పట్టారు. బీహార్ నుండి వచ్చిన కార్మికులను తొలగించి భారత్ గ్యాస్‌లో పనిచేసే కార్మికులను తీసుకోవాలని, లేనియెడల నిరసన ఉధృతం చేస్తామని కార్మిక నాయకులు తెలిపారు. కాగా కార్మికులు శాంతియుతంగా తన నిరసన తెలుపుతుండగా పోలీసులు చెదరగొట్టారు.

కార్మికులకు అండగా శ్రీదేవి యాదవ్



భారత్ పెట్రోలియం ఎల్పీజీ ఫిల్లింగ్ ప్లాంట్ కార్మికుల నిర్వహిస్తున్న ధర్నాకు చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అండగా నిలిచారు. భారత్ గ్యాస్ ప్లాంట్‌లో మేనేజర్ వేద ప్రకాష్, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ అశోక్‌లతో కార్పొరేటర్ చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చర్లపల్లి డివిజన్‌లోని వివిధ కాలనీలోని కార్మికులు 25 ఏండ్లుగా ఈ ప్లాంట్‌లో సేవలు అందిస్తున్నారని తెలిపారు. వారికి అన్యాయం జరగకూడదని యాజమాన్యానికి సూచించామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారిని పనిలోకి తీసుకొని తెలంగాణ బిడ్డలకు అన్యాయం జరుగుతుందని, అది ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు, సీపీఐ జిల్లా నాయకులు శంకర్ రావు, నారా నరసింహ, కార్మికులు సూరిబాబు, కడప శీను, నగేష్, అశోక్, శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ అధ్యక్షుల నియామకం



నవ తెలంగాణ- మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 17బూత్‌లకు నూతన అధ్యక్షులను జిల్లా ఎన్నికల అధికారి మురళీధర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు పార్టీ అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఎన్నికైన అధ్యక్షులు తమ తమ బూత్‌లలో పార్టీని బలోపేతం చేసే విధంగా కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి,కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్,మున్సిపాలిటీ అధ్యక్షులు ఉషిగారి శ్రీనివాస్, బీజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి కావేరి శ్రీధర్, బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షులు బట్టికడి విక్రమ్,బూత్ అధ్యక్షులు సుంకు నవీన్ ముదిరాజ్, మలిగే శ్రీకాంత్, నామాల మధుసూదన్ రెడ్డి, ముక్కిడిగాళ్ల మహేష్, అభిలాశ్, వినోద్, అశోక్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

బీజేపీ ఎన్నికల అధికారి బోడ శ్రీనివాస్



నవతెలంగాణ-కీసర

బీజేపీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ ఎన్నికల అధికారి బోడ శ్రీనివాస్ అన్నారు. కీసర మండలంలోని కరీంగూడ బూత్ 197 అధ్యక్షులుగా దేశం భానుచందర్ గౌడ్, బోగారం శక్తికేంద్రంలోని బూత్ 293, 294 అధ్యక్షులుగా దుర్గం వేణు యాదవ్ , పండుగ మురళి ముదిరాజ్ నుండి నామినేషన్ పేపర్స్‌ను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ పార్టీ పటిష్టత కోసం పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కీసర మండల అధ్యక్షుడు దేశం మల్లేష్ గౌడ్ ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ



నవతెలంగాణ-ఉప్పల్

రామంతాపూర్‌లోని శ్రీనివాసపురంలో వల్లపు జగన్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు,. అయ్యప్ప స్వాములు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యా రు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీ ఎస్‌ఎస్ ప్రభాకర్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ అయ్యప్ప మహా పడిపూజ కఠిన నియమాలతో కూడిన పూజ అని, అయ్యప్ప పూజతో భక్తులకు ఆనందం, ఆహ్లాదం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.


అయ్యప్ప స్వామి 18వ పడిపూజ



నవతెలంగాణ - జవహర్ నగర్

దైవ నామస్మరణతోనే మనిషికి ముక్తి లభిస్తుంద ని, భగవంతుని ధ్యానంతో మనిషి ప్రశాంతత పొందుతారని బీఆర్‌ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి, జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. మంగళవారం బాలాజీ నగర్‌లోని ముత్తుస్వామి కాలనీలో పొట్లపల్లి పాండురంగ గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపూజ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, బండకింది ప్రసాద్ గౌడ్, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

నాలాను పరిశీలించిన చైర్మెన్



నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని జోడిమెట్ల చౌరస్తా వద్ద ఉన్న నాలాను మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి మంగళవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. హద్దులను గుర్తించి నాలా కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకో వాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్, ఇరిగేషన్ ఏఈ పరమేష్, స్థానిక నాయకులు సామల బుచ్చిరెడ్డి, బద్దం జగన్మోహన్ రెడ్డి, అకిటిబాల్‌రెడ్డి, మోటుపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్ నేత శేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువ

- పారిశుధ్య కార్మికులకు 200 దుప్పట్ల పంపిణీ
- జీహెచ్‌ఎంసీ సిబ్బందికి కంటి పరీక్షలు



నవతెలంగాణ - చర్లపల్లి

కాంగ్రెస్ నాయకులు, డిస్ట్రిక్ క్యాబినెట్ సెక్రటరీ, లయన్ గుంటుక శేఖర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా 200మంది శానిటేషన్ సిబ్బందికి బ్లాంకెట్లను, మున్సిపల్‌కు సీసీ కెమెరా, మైక్‌కు అందజేశారు. జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు కంటి శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు శేఖర్ రెడ్డిని శాలువలతో సన్మానించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వేలకట్టలేనివని

పారిశుద్ధ కార్మికుల సేవలు వెలకట్టలేనివని శేఖర్ రెడ్డి అన్నారు. కరోనా సమయంలో వారి సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ కృష్ణ ప్రసాద్, వైస్ గవర్నర్లు కె.ఇన్నారెడ్డి, కళ్లెం కృష్ణారెడ్డి, లయన్స్ ప్రతినిధులు విజయ్ కుమార్, సదానందం, నందికొండ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ ఒనాయకులు, నాచారం మహంకాళి దేవాలయం చైర్మన్ గుంటుక కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

11

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

బుధవారం | డిసెంబర్ 18, 2024 | www.navatelangana.com

అనాథలకు అన్నదానం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు బుడ్డ గౌరీశంకర్ గౌడ్ మరణించి నెల రోజులు గడిచినందున ఆయన కుమారుడు బుడ్డ హిమవంత్ గౌడ్ హెచ్‌ఎంటీ కాలనీలోని నిర్మాణ్ అనాథశరణాలయంలో మంగళవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిలారపు జగదీశ్వర్, అభిరామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'షాప్ యాజమానులు ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలి'

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



ప్రతి షాప్ వారు తప్పని సరిగా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని మూసాపేట ఎఎంఓహెచ్ డాక్టర్ కార్తీక్ అన్నారు. మంగళవారం బిజినెస్ ట్రేడర్స్ ఓనర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ షాప్ బయట రెండు 35 ఎల్ డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేయాలన్నారు. 120 నిషేధిత ప్లాస్టిక్‌ను వాడకూడదన్నారు. హోటల్స్, ఇతర తినుబండరాలలో పనిచేసే ప్రతి ఒక్కరు వాక్సినేషన్ చేసుకోవాలన్నారు. హాండ్ గ్లౌస్స్, ఫేస్ మాస్క్, తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలన్నారు. హెల్త్‌కి సంబంధించిన రూల్స్, రేగులేషన్స్ పాటించాలని, లేనిచో భారీ జరిమానాలు వేసి పోలీసు కేస్ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్, ఎస్ఆర్పిఎస్, జవాన్లు, ఎస్ఎఫ్ఎలు తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా ఉన్న రోడ్ల సమస్యను పరిష్కరిస్తా..

- పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

భాగ్యనగర్ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని భాగ్య నగర్ కాలనీలో గల పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఎమ్మెల్యే కాలనీలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా భాగ్య నగర్ కాలనీ వాసులు మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక వసతులు కల్పించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో డ్రయినేజి సమస్యను, వరద నీటి కాల్వను నిర్మించాలని, ట్రాఫిక్ ఇబ్బందులను, మంచి నీటి వ్యవస్థను మెరుగుపర్చాలని ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భాగ్య నగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో పాదయాత్ర చేపట్టామన్నారు. త్వరలోనే సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని, కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కలిపించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకోస్తామన్నారు. అదేవిధంగా ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, ఎల్లవేళల అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనుల పరిశీలన

- బౌరంపేటలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం
- సబ్‌స్టేషన్లు, టవర్ నిర్మాణ పనులను తనిఖీ చేసిన సీఎండీ
- పనుల పట్ల ముషారఫ్ ఫరూఖీ ఆరా



నవతెలంగాణ-సిటీబ్యూరో

రానున్న వేసవి కాలంలో పెరగనున్న డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సరఫరా కోసం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తగు చర్యలు చేపట్టింది. సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వేసవి సన్నాహక చర్యల్లో భాగంగా జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. మేడ్చల్ పరిధిలోని బౌరంపేటలో నిర్మితవుతున్న 132 కేవీ సబ్ స్టేషన్‌ను, టవర్ నిర్మాణ పనులు తనిఖీ చేసిన సీఎండీ, బౌరంపేట్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించారు.

వివిధ పనులు ఇలా..

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వేసవి కాల సన్నాహక చర్యల్లో భాగంగా చేపట్టిన పనుల్లో హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలో 35 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 149 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, హబ్సిగూడ సర్కిల్ పరిధిలో 90 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 14 33 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 14 పవర్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/అదనంగా ఏర్పాటు, 545 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/అదనంగా ఏర్పాటు, సైబర్ సిటీ సర్కిల్ పరిధిలో 127 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 4 33 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 25 పవర్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, 232 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో 49 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 7 33 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 23 పవర్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/అదనంగా ఏర్పాటు, 309 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలో 46 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 73 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 67 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 9 33 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 24 పవర్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, 171 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధిలో 18 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 6 పవర్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, 137 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు వంటి వివిధ పనులు చేపట్టారు.

రంగారెడ్డి జోన్‌లో ఇలా..

విద్యుత్ డిమాండ్‌లో భారీ పెరుగుదలకు అవకాశమున్న రంగారెడ్డి జోన్ పరిధిలో 254 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 26 33 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 81 పవర్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, 1252 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు చేయనున్నారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ డిమాండ్ వినియోగం గతేడాది ఎండా కాలంతో పోల్చుకుంటే గణనీయంగా పెరుగుతున్నది. గతేడాది 3756 మెగావాట్లుగా నున్న గరిష్ట డిమాండ్ ఈ ఏడాది దాదాపు 16 శాతం వద్ధితో 4352 మెగా వాట్లుగా నమోదైంది. గతేడాది 81.39 మిలియన్ యూనిట్లుగా ఉన్న వినియోగం దాదాపు 12 శాతం వద్ధితో 90.68 మిలియన్ యూనిట్లకు చేరింది. రాబోయే 2025 వేసవిలో సైతం విద్యుత్ డిమాండ్ గతం కంటే ఎక్కువగా రికార్డు స్థాయిలో గణనీయమైన వద్ధి నమోదు అవుతుందని అంచనా వేశారు. డిమాండ్ ఎంతగా పెరిగినా సరఫరాలో ఎలాంటి ఆటంకాల్లేకుండా చూడాలనే ప్రభుత్వ ఆదేశాలనుసారం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, అధికారులు సిబ్బంది సెక్షన్ స్థాయిలో డిమాండ్‌ను ముదింపు చేస్తూ తగు ఏర్పాట్లు చేసే పనుల్లో నిమగ్నం అవున్నారు. ఈ తనిఖీల్లో టీజీఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్, మేడ్చల్, అట్లూరి కామేష్, ట్రాన్స్ కో చీఫ్ ఇంజినీర్ వై.చిరంజీవులు, ట్రాన్స్ కో సూపరింటెండింగ్ ఇంజినీర్ రాంజీ, సూపరింటెండింగ్ ఇంజినీర్, మేడ్చల్ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని, ఉషముళ్ళపూడి ప్రధాన రహదారి గోవింద్ హోటల్ చౌరస్తా వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గోవింద్ హోటల్ చౌరస్తా నుంచి ఎల్లమ్మ చెరువు వరకు జరుగుతున్న, వరద నీటి పైపులైన్ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా పైపులైన్ పనులన్నీ పూర్తయ్యాయి అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు కూడా కొంతమేర పూర్తిచేసామని, మిగిలిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని రానున్న పది రోజులలో పూర్తిచేసి వాహనదారులకు వినియోగంలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. సీసీ రోడ్డును నాణ్యతా ప్రమాణాలతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ శంకర్‌కు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, కాంట్రాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సినీ పరిశ్రమకు చేసిన కృషికి గుర్తింపుకుగాను తెలంగాణ ప్రభుత్వం స్టార్ ప్రొడ్యూసర్ దిల్‌రాజుకు ఫిలిండెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో ఆయనను సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ సుధాకర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమ గురించిన పలు అంశాలను చర్చించారు. సినీ పరిశ్రమ గురించి పూర్తి అవగాహన కలిగిన దిల్ రాజును ఎఫ్‌డీసి చైర్మెన్‌గా నియమించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో



రెండో అంతర్జాతీయ సింపోజియం

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులను ఒకే వేదికపైకి తీసుకురావడమే సింపోజియం లక్ష్యమని జేఎన్‌టీయూ-హైదరాబాద్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.బాలకిష్ట రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ హైదరాబాద్, ఐఐటీ గౌహతి సంయుక్త ఆధ్వర్యంలో "ఆల్గల్ పరిశోధనలో పురోగతులు" పై రెండవ అంతర్జాతీయ సింపోజియం నిర్వహించారు. ఈ సింపోజియం చైర్మెన్‌లుగా ఐఐటీ గౌహతికి చెందిన ప్రొఫెసర్ కౌస్తుభా మోహంతి, సీఎస్ఐఆర్-ఐఐసీటీ హైదరాబాద్‌కి చెందిన డా.ఎస్. వెంకట మోహన్ వ్యవహరించారు. కన్వీనర్‌గా జేఎన్‌టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్ వి.హిమబిందు, జాయింట్ కన్వీనర్‌గా, కోయంబత్తూరు కరుణ్య యూనివర్శిటీ డా.సత్య సుందర్ మోహంతిలు సేవలందించారు. ఈ కార్యక్రమానికి బయోటెక్నాలజీ విభాగం డీబీటీం, సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రీసెర్చ్ కౌన్సిల్ సీఎస్ఐఆర్ మద్దతు అందించారు. వివిధ దేశాల ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, ఆర్ అండ్ డి ల్యాబొరేటరీల శాస్త్రవేత్తలు తమ పరిశోధనలు ప్రదర్శించడమే కాకుండా, పరస్పర ఆలోచనలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వి.బాలకిష్ట రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావు, యూసీఇఎస్‌టీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జీ.వెంకట నరసింహ రెడ్డి హాజరై సింపోజియం ప్రాముఖ్యతను ప్రశంసించారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ.. ఈ రకమైన సదస్సులు సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సాధనకు దోహదపడతాయన్నారు. జీవ ఇంధన ఉత్పత్తి, గ్లోబల్ కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గింపు వంటి కీలక సమస్యల పరిష్కారానికి ఆల్గీ ఒక ఆశాజనకమైన పరిష్కారమని పేర్కొన్నారు. ఈ సింపోజియంలో 100కి పైగా పీహెచ్‌డీ , మాస్టర్స్ విద్యార్థులు పాల్గొని తమ పరిశోధనలపై ప్రసంగించారు. ఇతర శాస్త్రవేత్తలతో సంభాషణ ద్వారా అనేక కీలకమైన ఆవిష్కరణలను చర్చించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇలాంటి సింపోజియాలు శాస్త్రవేత్తలు, విద్యావేత్తల మధ్య ఇంటర్-ఇన్‌స్టిట్యూట్ సహకారాన్ని పెంపొందించేందుకు తోడ్పడతాయని అన్నారు. ఈ సహకారం పర్యావరణ సమస్యల పరిష్కారం లో ముఖ్య పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రారంభోత్సవ కార్యక్ర మం జాయింట్ కన్వీనర్ డా. సత్య సుందర్ మోహంతి ధన్యవాదాలతో ముగిసింది.

మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట

- పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమత నగర్, జలవాయ్ విహార్, భాగ్య నగర్ కాలనీలలో రూ.64 లక్షల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు ఆయనతో పాటు స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావులు ముఖ్యఅతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం రూ.64 లక్షలతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంద న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని హామి ఇచ్చారు. హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాల సంతోషకరమన్నారు. సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడోదన్నారు. పనులల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా శ్రీశైలం గౌడ్ ఎన్నిక



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శివంపేట్ మండల్ నవాబ్‌పేట్ విలేజ్‌లోని ఫ్లెమింగ్ లేబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని యూనియన్ ఉద్యోగులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యం, ఎంప్లాయిస్‌తో కలిసి సమావేశం అయ్యారు. యూనియన్ సభ్యులను కూన శ్రీశైలం గౌడ్ కంపెనీలో పనిచేసే ఎంప్లాయిస్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎంప్లాయిస్ సమస్యలు ఏవైనా తాను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ టి.వెంకటేశ్వరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మైసయ్య, దయాకర్, ఎస్. వి. సుబ్బారావు, బి.లక్ష్మణరావు, వెంకన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘం సభ్యులు కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి





- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్ అరెకపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్-1 కాలనీ వెల్ఫేర్ సంక్షేమ సంఘానికి నూతనంగా ఎన్నుకున్న కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కార్యవర్గ సభ్యులను శాలవతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని, కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామి ఇచ్చారు. ఎలాంటి సమస్యనైన తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీ సమస్యలపై స్పందిస్తూ, ప్రతి ఒక్కరు సమిష్టిగా కలిసి కాలనీ అభివృద్ధికి పాటుపడాలని, ఒక ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దే క్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలియజేశారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తానని, మౌలిక వసతుల కల్పనకై పెద్ద పీట వేస్తానని, కాలనీ అసోసియేషన్ భాగస్వామ్యంతో అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ ఫేస్-1 కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు బత్తిని వెంకటేశం గౌడ్ అధ్యక్షుడు, తుమ్మల రామ్ రెడ్డి ఉపాధ్యక్షుడు, మారోజు కుమార చారి, జనరల్ సెక్రటరీ, పంటకాపు రఘు జాయింట్ సెక్రటరీ, కొత్త లక్ష్మి ట్రెజరర్, నార్ని హేమలత కల్చరల్ సెక్రటరీ, కె యాదవ రెడ్డి అడ్వైజర్, టి నర్సింగ్ రావు అడ్వైజర్, వి భీష్మ కుమార్ అడ్వైజర్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సభ్యులను సత్కరించిన సురభి రవీందర్ రావు

శేరిలింగంపల్లి నియోజకవర్గ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్-1లో జరిగిన కాలనీ అసోసియేషన్ ఎన్నికల్లో గెలిచిన సభ్యులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలుపొందిన వారిని సురభి రవీందర్ రావు శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఏలాంటి సమస్యలు ఉన్న వాటిని తీర్చడంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.వెంకటేష్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ రామ్ రెడ్డి, జనరల్ సెక్రటరీ మారోజు కుమార చారి, జాయింట్ సెక్రటరీ రఘు, కోశాధికారి లక్ష్మీ, కల్చరల్ సెక్రటరీ హేమలత, అడ్వైజర్లు యాదవ రెడ్డి, నర్సింగరావు, బిష్మ , శంకర్, మనోహర్, ఖాదీర్, సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సు కోసం పోరాడేది సీపీఐ



- పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వ్యక్తి కోసం కాకుండా సమాజ శ్రేయస్సు కోసం పోరాడేది సీపీఐ అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్ అన్నారు. కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్ట శాఖ పార్టీ సభ్యత్వం పునరుద్దరణ సందర్భంగా మంగళవారం శాఖ సభ్యులకు, పార్టీ సభ్యత్వ కార్డులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమాని గుట్ట శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి అధ్యక్షత వహించగా ఉమామహేష్ ముఖ్య అతిధిగా హాజరై సభ్యత్వాలు అందచేసి మాట్లాడారు. దేశ స్వాతంత్రం కొరకు ప్రాణ త్యాగాలకైనా సిద్దమని, తెల్లదొరలు, నల్ల దొరలు కాదు సంపూర్ణ స్వాతంత్రం నినాదాన్ని ఇచ్చి అందరికి సమానమైన ఫలాలు అందించాలంటే సోషలిస్టు వ్యవస్థతోనే అది సాధ్యమని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు అనేక త్యాగాలను చేసిన చరిత్ర సీపీఐకే ఉందన్నారు. ఈ రోజు కేంద్రంలో, రాష్టంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పేద ప్రజలకు కనీస అవసరాలైనా భూమి, విద్య, వైద్యంను ప్రజలకు ఉచితంగా అందించకుండా మరిన్ని పన్నులు మోపి వాటికి దూరం అయ్యే విధానాలను అవలంభిస్తున్నాయని ఆరోపించారు. పేద మధ్యతరగతి ప్రజలపైన పన్ను భారం వేసి పారిశ్రామికావేత్తలకు పన్ను రేట్లు తగ్గించి, రుణాలు ఇచ్చి వ్యాపారం చెయ్యడానికి ఉపయోగపడుతున్నాయయే తప్ప పేద ప్రజలకు మాత్రం సంపన్నులకు ఇచ్చిన రాయితీలను కూడా ఇవ్వట్లేదని ఆక్షేపించారు. అన్ని బూర్జువా పార్టీలు వారి నాయకత్వం లేక పెట్టుబడిదారుల కోసం పని చేస్తాయని కానీ కమ్యూనిస్టులు మాత్రం పేద, మధ్యతరగతి ప్రజల కోసం అనుక్షణం పోరాటం చేస్తారని పేర్కొన్నారు. సీపీఐ సభ్యత్వం అందరికి ఇవ్వరని దాని సిద్ధాంతం కోసం ఎర్రజండా పట్టేవారికి మాత్రమే ఇస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జానకిరామ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, సభ్యులు నగేష్ చారి, సోమయ్య, సామెల్, రవి, నర్సింహరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి



మాధవరం రోజా దేవి రంగారావు



మాధవరం రంగారావు



సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టిన కార్పొరేటర్ రోజా దేవి రంగారావు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు.. కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు సూచనల ప్రకారం మంగళ వారం లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి, జైళ్లలో నిర్బంధిం చిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేస్తూ.. స్థానిక నాయకులతో కలిసి రిక్షా పుల్లర్స్ కాలనీలోని, డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు. ఈ సంద ర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. లగచర్ల రైతులు తమ భూమి అని అన్నందుకు, అరెస్టు చేసి గత 40 రోజుల నుండి వారిని జైల్లో పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగి ంచి, గుండె నొప్పికి గురైతే వారి చేతికి సంకెళ్లు వేసి దేశద్రోహులలాగా చూస్తున్నారని, కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతును రాజులు చేస్తామని చెప్పి, రైతుబంధు రైతు బీమా ఇలాంటి పథకాలు అన్ని తీసేసి, రైతులను జైలు పాలు చేస్తున్నారని వాపో యారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల గురించి, రైతుబంధు పథకం, రైతు భీమా ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేపట్టి, రైతులు ఆత్మగౌరంగా తల ఎత్తుకొని బతికేటట్టు చేసారని అన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల ను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో పెద్ద ఉద్యమం చేపట్టి రైతులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల భద్రయ్య, వేముల ఆంజనేయులు, ఎర్ర లక్ష్మయ్య, జగదీష్ గౌడ్, యశ్వంత్, ప్రవీణ్, కృష్ణ, మల్లేష్, పర్వతాల సతీష్ కుమార్, మల్లయ్య, శ్రీనివాస్ సాగర్, సత్యనా రాయణ, రాజేందర్, కిరణ్, సోమయ్య, కొండల రావు, వినోద్, రాము, రమణారెడ్డి, రవి, రమేష్ రావు, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, సాయి, శానప్ప, రాజు, శ్రీహరి, బుజ్జి, మోహన్ చారి, మాధవి రెడ్డి, శైలజ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి,వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, స్థానిక నాయకులతో కలిసి డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్‌నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ ఆర్‌జీకే ఆటో స్టాండ్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి మంగళవారం వినతి పత్రం సమర్పించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి...



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓ వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే వరంగల్ జిల్లా మహబూబాబాద్‌కు చెందిన యాకయ్య (55) గత కొన్ని సంవత్సరాలు వాచ్మెన్‌గా పని చేస్తున్నాడు. బోయిన్ పల్లి అంజయ్య నగర్ లో సోమవారం అర్ధరాత్రి మృతి చెంది కనిపించాడు. నిర్మాణం లో ఉన్న భవనంపై నుంచి పడి మృతి చెందినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పవన్ కల్యాణ్ ఆశయాల కోసం పనిచేస్తా

- సినీ దర్శకుడు వారణాసి సూర్యా...



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయాల కోసం తాను జీవితాంతం పనిచేస్తానని సినీ దర్శకుడు వారణాసి సూర్య అన్నారు.మంగళవారం సోమాజి గూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ...పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా జనసేన పార్టీని ఏర్పాటు చేసి ఎన్ని ఎదురు దెబ్బలు ఎదురైనా పోరాడి నిలిచిన మహా నాయకుడు పవన్ కల్యాణ్ అని కొనియాడారు. నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. అలాంటి నాయకుడికి మద్దతు పలకడమే లక్ష్యంగా రూ. 100 ఎమ్మెల్యే అనే కాన్సెప్ట్‌తో ప్రజల ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. ఇటీవల కొందరు పవన్ పై ఆరోపణ చేస్తుంటే సహించలేకపోతున్నానన్నారు. జనసేనను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, భవిష్యత్తులో జనసేన అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని లేనిపక్షంలో స్వతంత్రంగా పోటీ చేసి పవన్‌కు అండగా నిలుస్తానని అన్నారు.

డిప్యూటీ ఐఓఎస్ సస్పెండ్

- పాఠశాల సమయంలో పాఠశాలలను మూసివేసి లంచ్ పార్టీకి అనుమతినిచ్చిన వైనం
- పాఠశాలల విధులకు గైర్హాజరై లంచ్ పార్టీలో పాల్గొన్న 80 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

షేక్ పేట మండలంలోని ఉపాధ్యాయులు బోధన సమయంలో పాఠశాలలను మూసివేసి లంచ్ పార్టీకి అనుమతించిన షేక్ పేట మండల డిప్యూటీ ఐఓఎస్ కే.యాదగిరిని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సస్పెండ్ చేశారు.ఈనెల 13న శుక్రవారం షేక్ పేట ఉపాధ్యాయులు తరగతి గదులను బందు చేసి అంతా ఒకచోట చేరి లంచ్ పార్టీ చేసుకోవడానికి అనుమతించిన బంజారా హిల్స్ గెజిటెడ్ హెచ్ఎం, షేక్ పేట డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న కే యాదిగిరి విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు జిల్లా కలెక్టర్ అతనిని సస్పెండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఈ లంచ్ పార్టీలో పాల్గొన్న షేక్ పేట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 80 మంది ఉపాధ్యాయులు విధులను నిర్లక్ష్యం చేసి లంచ్ పార్టీలో పాల్గొన్నందుకు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారి పై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ సి.ఈ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ సీ.ఈ పనస రెడ్డిలతో కలిసి కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోన్ల వారీగా వాటర్ లాగింగ్ పాయింట్స్, రెయిన్ వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజల అవసరాల దష్ట్యా చేపట్టిన పనులను ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్దేశించిన కాల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. 141 వాటర్ లాగింగ్ పాయింట్ లను తగ్గించేందుకు శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వచ్చే వర్షాకాలంలో సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెయిన్ వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ చేపట్టిన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి దశలో 12 వాటర్ హెూల్డింగ్ నిర్మాణాలను చేపట్టగా అందులో 4 పనులు పూర్తి కాగా మిగతా పనులు వివిధ ప్రగతి దశలో ఉన్నందున అసంపూర్తి పనులు జనవరి మాసంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. హెూల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణాలకు ఫీజిబిల్టీ గుర్తించాలన్నారు. 125 జంక్షన్ల అభివృద్ధికి గుర్తించిన నేపథ్యంలో భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ సమస్య పరిష్కారానికి ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, అడ్వర్టైజ్మెంట్, యుబిడి విభాగాల అధికారులతో కమిటీ వేసినట్టు ఈ కమిటీ జంక్షన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. నగరంలో రూ. 124.68 కోట్ల అంచనా వ్యయంతో 195 సుందరీకరణ పనులు చేపట్టగా, అందులో 28 పనులు పూర్తి కాగా ఇంకా 167 పనులు వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి దశలో ఉన్నయని అట్టి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు తొందరగా పూర్తి చేసి ట్రాఫిక్ ఉన్న చోట పాదచారులకు ఇబ్బందులు తలెత్తకుండా టెక్నికల్ ఫీజిబిలిటీ ఉన్న ప్రదేశాల్లో కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలను ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజనీర్లు పద్మ, బాలాజీ, జోనల్ ఎస్.ఈ లు రత్నాకర్, మహేష్ రెడ్డి, నిత్యానంద, శంకర్ నాయక్, చిన్నా రెడ్డి, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.



తార్నాక జంక్షన్ పనులను పరిశీలించిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ

డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులు, లా అండ్ ఆర్డర్, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, అధికారులు, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి తార్నాక జంక్షన్‌లో జరుగుతున్న అభివద్ధి పనులను పరిశీలించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా మూసివేసిన తార్నాక జంక్షన్‌ను వచ్చే జనవరి 2025 నాటికి వాహనాల రాకపోకల కోసం పున్ణప్రారంభించనున్నారు. ఇప్పటికే డివైడర్ల తొలగింపు, ఇతర మార్పులను చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, "ప్రజల నుంచి ఎన్నో ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో తార్నాక జంక్షన్‌ను తిరిగి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇది ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా మారుతుందన్నారు. అధికారులతో కలిసి పరిశీలించిన సందర్భంగా రహదారి పనులు ప్రస్తుతం జరుగుతున్నట్టు, ఈ పనులు డిసెంబర్ 2024 నాటికి పూర్తవుతాయని చెప్పారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందించేందుకు జీహెచ్ఎంసీ కట్టుబడి ఉందన్నారు.



'కేసీఆర్ కనబడుట లేదు'

- ఓయూ ఏసీపీ జగన్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థులు

నవతెలంగాణ-ఓయూ

ప్రతిపక్ష నేత కేసీఆర్ కనిపించడం లేదని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ ఫౌండర్ వలిగొండ నరసింహ, ఓయూ విద్యార్థి నాయకులు వేముల సురేష్ యాదవ్, నందు, అభిలాష్, కూరపాటి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఓయూ ఏసీపీ జగన్‌కు మంగళవారం పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ప్రస్తుతం తెలంగాణ ప్రతిపక్ష నాయకుడిగా ఉండి కాంగ్రెస్ ప్రజా పాలనలో ఒక్కసారి కూడా అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకపోగా ప్రజలకు కనిపించడం లేదన్నారు. ఆయన అసెంబ్లీ కొచ్చి ప్రతిపక్ష నాయకడి హెూదాలో తన విలువైన సూచనలు, అనుభవాలు ప్రభుత్వానికి చెప్పవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వారి కుటుంబంలో వారసత్వ రాజకీయ పోరులో భాగంగా కేటీఆర్, హరీశ్ రావు ,కవిత ఒత్తిడి వల్ల బయటికి రాలేకపోతున్నాడేమోనని అనుమానం కలుగుతున్నదన్నారు. కేసీఆర్ ఆచూకీ ప్రజలకు తెలపాల్సిన బాధ్యత ఉందని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బన్సీలాల్ పేట డివిజన్ గొల్ల కొమరయ్య కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నిత్యం ఎంతో రద్దీగా ఉండే గొల్ల కొమరయ్య కాలనీలోని ప్రధాన రహదారి పై స్పీడ్ ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కమిటీ హాల్‌పై మరో అంతస్తు నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కమిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని చెప్పారు. కమిటీ హాల్‌లోని మోటార్ పని చేయడం లేదని, నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కాలనీలో స్ట్రీట్ లైట్స్ వెలగడం లేదని చెప్పగా లైట్ల ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వాసులు నల్లా కనెక్షన్ ఇప్పించాలని కోరగా, వెంటనే నల్లా కనెక్షన్ కల్పించాలని తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలనే లక్ష్యంతోనే తాను నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న విషయాన్ని గుర్తు చేశారు. గతంలో బోయగూడ కమాన్ నుంచి మల్లన్న గుడి వరకు ఎంతో అధ్వాన్నంగా ఉన్న రోడ్డు ను అద్భుతంగా నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తాననే విషయం అందరికీ తెలిసిందేనన్నారు.కార్పొరేటర్ కుర్మ హేమలత, డీసీ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశిష్, ఎలక్ట్రికల్ ఏఈ , స్ట్రీట్ లైట్ ఏఈ అనూష, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు లక్ష్మీపతి, కాలనీ కార్యదర్శి నర్సింగ్, మనీష్, వినోద్, కుమార్ యాదవ్, శంకర్, జనార్దన్, గజ్జెల శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

గొల్ల కొమరయ్య కాలనీకి చెందిన భాగ్య ను మంగళవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. కాలనీ పర్యటన కు వచ్చిన ఆయన.. భాగ్య ఇటీవల చికిత్స చేయించుకొని ఆస్పత్రి నుండి ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకొని ఆయన ఇంటికి వెళ్లారు. భాగ్య ను ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

ప్రజాపాలన కాదు.. దగా పాలన

- జేఏసీ వ్యవస్థాపక సభ్యులు అశోక్ యాదవ్



నవతెలంగాణ-ఓయూ

ప్రజాపాలన కాదు.. ఇది దగా పాలన అని బుధవారం ఓయూలో జరిగే ప్రజాపాలన కృతజ్ఞత సభను అడ్డుకుంటామని ఓయూ జేఏసీ వ్యవస్థాపక సభ్యులు అశోక్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఓయూలో సభను పెట్టుకుంటే కచ్చితంగా అడ్డుకొని తిరుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయలేదని., ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలేదని తెలిపారు. రైతుబంధు హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదని, పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయలేదని, వద్దులకు వితంతువులకు వికలాంగులకు పెన్షన్‌ను పెంచలేదని అన్నారు. కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చి ప్రజాపాలన పేరిట తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసగిస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన తీరును ఖండిస్తూ ఓయూలో జరిగే ప్రజాపాలన సభను అడ్డుకుంటామని తెలిపారు. కాదు కూడదని సభను నిర్వహించి తీరుతామని ప్రగల్భాలు పలికితే వచ్చినప్పటి నుంచి మొదలుకొని తిరిగి వెళ్లేంతవరకు ఏమి జరిగినా దానికి బాధ్యత తీసుకునే విధంగా ఉంటే మాత్రమే నిర్వాహకులు సభను నిర్వహించాలని హెచ్చరించారు.

సిరిపురి కాలనీలో డిప్యూటీ మేయర్ పర్యటన



నవతెలంగాణ-ఓయూ

తార్నాక సిరిపురి కాలనీలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్ ఈస్ట్ ఆనంద్ బాగ్ ప్రేమ్ కుమార్, జీహెచ్ఎంసీ అధికారులు, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా, భారీ వర్షాల సమయంలో వరద నీరు నిలిచిపోకుండా సాఫీగా వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, కాలనీలో ఉన్న బాక్స్ డ్రెయిన్‌ను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని గుర్తించారు. ఈ పనులకు సుమారు రూ. 1.27 కోట్లతో అంచనా వేసినట్లు తెలియజేశారు. కార్యాచరణను వేగవంతం చేసి కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



మహీంద్రా విశ్వవిద్యాలయంలో 'స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్' ప్రారంభం

నవతెలంగాణ-బేగంపేట

మహీంద్రా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్' ప్రారంభమైంది. ఈ స్కూల్లో కలినరీ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో బీఎస్సీ (హానర్స్) కోర్సును అందుబాటులోకి తెచ్చింది. ఆధునిక హాస్పిటాలిటీ రంగంలో ప్రత్యేక నైపుణ్యాలతో విద్యార్థులను సిద్ధం చేయడమే లక్ష్యంగా ఈ కోర్సు రూపొందించినట్టు మహీంద్రా విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ యాజులూ మెడూరి, మేనేజ్‌మెంట్ డీన్ చెఫ్ కే తిరుజ్ఞానసంబంతం తెలిపారు. బేగంపేటలోని తాజ్ వివన్టలో బ్రోచర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ "సంప్రదాయ నైపుణ్యాలు, ఆధునిక సాంకేతికత కలయికతో గ్లోబల్ ప్రొఫెషనల్స్‌ను తీర్చిదిద్దడానికి ఈ కోర్సు దోహదపడనుంది. 60 సీట్లతో మొదటి బ్యాచ్ 2025 ఫిబ్రవరిలో ప్రారంభమవుతుంది. అడ్మిషన్లు జనవరిలో ప్రారంభం కానున్నాయి. 80 శాతం స్కోర్‌తో ఏదైనా బోర్డు నుంచి 10 ప్లస్ 2 తర్వాత విద్యార్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఎన్సీహెచ్ఎంసీటీ, జేఈఈ ప్రవేశ పరీక్ష స్కోర్ ద్వారా లేదా మహీంద్రా యూనివర్శిటీ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్-2025 (ఎంయూహెచ్ఈటీ 2025)కి అర్హత సాధించడం ద్వారా ప్రవేశాన్ని పొందవచ్చు. విద్యార్థులు దరఖాస్తులను ఙఙఙ.ఝబష్ట్రఱఅసతీబబఅఱ-ఐవతీంఅ.వసబ.ఱఅ లో చేసుకోవచ్చు. ఈ స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మా అత్యాధునిక ప్రోగ్రామ్‌ల పోర్ట్‌ఫోలియోకు ఒక అద్భుతమైన జోడింపు" అని అన్నారు. ఈ స్కూల్ విద్యార్థులకు మారుతున్న తాజా ట్రెండ్స్, టెక్నాలజీపై ప్రావీణ్యం కలిగించేందుకు కషి చేస్తుందన్నారు. ప్రసిద్ధ ఫ్యాకల్టీ ద్వారా విద్యార్థులు మాస్టర్ క్లాసులు, ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు, వాస్తవిక అనుభవంతో అత్యుత్తమ విద్యను పొందుతార న్నారు. ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, వ్యూహాత్మక ఆలోచన శక్తితో కూడిన సమగ్ర నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రోగ్రామ్ విద్యార్థులలో కలినరీ నైపుణ్యాలు మాత్రమే కాకుండా నాయకత్వం, వ్యాపారాత్మక ఆలోచన, స్థిరమైన అభ్యాసాలను పెంపొందించేలా ఉంటుందన్నారు.

స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ప్రపంచంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలతో భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. వీటిలో వర్జీనియా టెక్, యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్‌లోని కాన్రాడ్ ఎన్. హిల్టన్ కాలేజ్ ఆఫ్ గ్లోబల్ హాస్పిటాలిటీ లీడర్‌షిప్, స్విస్ హెూటల్ మేనేజ్‌మెంట్ స్కూల్, సెసార్ రిట్జ్ కాలేజెస్, కలినరీ ఆర్ట్స్ అకాడమీ, స్విట్జర్లాండ్ ప్రముఖంగా ఉన్నాయి. మహీంద్రా హాలిడేస్, క్లబ్ మహీంద్రా వంటి దేశంలోని అత్యంత ప్రఖ్యాత హాస్పిటాలిటీ బ్రాండ్‌లతో భాగస్వామ్యం కలిగి ఉంది. ఇవి విద్యార్థులకు పరిశ్రమపై అవగాహన, ప్రత్యక్ష శిక్షణ అందిస్తాయి. భారతదేశ హాస్పిటాలిటీ, కలినరీ రంగం సంవత్సరానికి సుమారు 250 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సాధిస్తుంది. ఇది దేశ జీడీపీలో 7.5 శాతం వాటాను కలిగి ఉంది. దేశ, విదేశీ టూరిజం వల్ల ఈ పరిశ్రమ 2033 నాటికి పది మిలియన్లకు పైగా కొత్త ఉద్యోగాలను సష్టించనుంది. ఈ రంగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ, ఉద్యోగావకాశాలు, వ్యాపారాత్మక అవకాశాలు, నైపుణ్యాభివద్ధికి ప్రాధాన్యత ఇస్తుంది.

వర్గీకరణ సమస్య కొనసాగాలని ఆకాంక్షించే వారున్నారు



- డాక్టర్ పిడమర్తి రవి...

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్రం లో కొంతమందికి వర్గీకరణ జరిగితే ఎక్కడ తమ ఉనికి కోల్పోతమో అని ఉందని, వర్గీకరణ సమస్య ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించే వారు రాష్ట్రంలో ఉన్నారని మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. లక్డీకపూల్‌లోని కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీం అక్తర్‌ను వారు మంగళవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ ఫలాలు అందాలని, అందుకు జిల్లాలను యూనిట్ గా తీసుకోవాలని అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్, రంగారెడ్డి లో మాదిగలు అధిక సంఖ్యలో ఉన్నారని వారికి జనాభాకు తగిన విధంగా వర్గీకరణ ఫలాలు అందించి న్యాయం చేయాలన్నారు. మూడు దశాబ్దాల మాదిగ ఉద్యమంలో అనేక కీలక మలుపులు తిరిగాయని ఇప్పుడు రాష్ట్రం విడిపోయాక మాదిగలు తెలంగాణలో మెజారిటీ కులంగా, అతిపెద్ద కులంగా ఉన్నారని అన్నారు. మాదిగలకు జనాభా దామాషా ప్రకారం విద్యాఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు.మాదిగ మాల కులాల మధ్య వైరం పెరగకముందే వర్గీకరణ చేసి ఎవరి రిజర్వేషన్ ఫలాలను వాళ్లకు అందించాలన్నారు.

వివేక్ వెంకటస్వామి వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం చేయలేదని కేవలం తన మంత్రి పదవి కోసం మాత్రమే ఉద్యమం చేసి తన దగ్గర ఉన్న డబ్బుతో మహాసభలు ఏర్పాటు చేస్తున్నాడని అన్నారు. మాలలపై వివేక్ వెంకటస్వామికి ప్రేమ లేదని కేవలం తన మంత్రి పదవి కోసమే మాలలను రెచ్చగొడుతున్నారని అన్నారు .తెలంగాణ రాష్ట్రంలోని మాదిగలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట ఉండాలని రాష్ట్ర మాదిగలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మాదిగలు కీలక పాత్ర పోషించారని, బీజేపీ మందకృష్ణ మాదిగ వెంట మాదిగలు లేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మాదిగలకు అవినాభావ సంబంధం ఉంటుందని రేవంత్ రెడ్డి వెంట మాదిగలు ఎప్పటికీ ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నంద్రు నరసింహ రావు మాదిగ, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, బోమ్మెర స్టాలిన్, శివ మాడుగుల తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్

నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లి 119వ డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు అస్మాత్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.. లగచర్ల రైతులపై అక్రమ కేసులు, థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అణిచివేతను నిరసనగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నాయకులు కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి కార్పొరేటర్ వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ డివిజన్ ప్రెసిడెం ట్ ఇర్ఫాన్, జనరల్ సెక్రెటరీ మేకల హరినాథ్, కాన్స్టెన్సీ మైనార్టీ ప్రెసిడెంట్ సయ్యద్ ఎజాజ్, మార్కెట్ మాజీ వైస్ చైర్మెన్ మన్నే ఉదయ్ యాదవ్, బీసీ సెల్ అధ్యక్షుడు మట్టి శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి, మైనార్టీ అధ్యక్షుడు మిరాజ్, కర్రే జంగయ్య గడ్డం నర్సింగ్ రావు, వాసు యాదవ్, ఖదీర్, పిట్ల రాజు, సంతోషి, శశికళ, మంజుల, కమల, పద్మ తదితరులు పాల్గొన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కేటీఆర్ ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు సూచన మేరకు... నరేష్ కార్యక్రమాలు చేసినట్టు తెలిపారు

ఖైరతాబాద్‌లో అగ్ని ప్రమాదం



నవతెలంగాణ-బంజారా హిల్స్

విద్యుద్ఘాతంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ నెహ్రూనగర్‌లో పూసల బస్తీకి చెందిన అనామిక దంపతులు స్థానికంగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. సోమవారం ఇంటికి తాళం వేసి పనిమీద వెళ్లిపోయారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి నుంచి దట్టమైన పొగలు వస్తుండడంతో గమనించిన చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖను వారు రప్పించి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలియజేశారు.బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విద్యుద్ఘాతంతో అగ్ని ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది.

బోరబండ డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

నవతెలంగాణ-ధూల్‌పేట్


హైదరాబాద్ మహా నగరంలో మహిళల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను పెంచాలని ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పి. శశికళ, అధ్యక్షులు ఎన్. లక్ష్మమ్మలు అన్నారు. ఐద్వా మహిళా సంఘం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంతో పాటు హైదరాబాద్ నగరంలో మహిళలకు బస్సు ఫ్రీ చేసిన తర్వాత బస్సుల సంఖ్య పెంచకపోవడం వల్ల రద్దీ పెరుగుతోందన్నారు. ప్రధానంగా నగరంలో బస్సుల్లో ప్రయాణించే మహిళలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారన్నారు. మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని హైదరాబాదు రీజియన్‌లో బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. ఎక్స్‌ప్రెస్, ఆర్డీనరీ బస్సులకు బదులు ప్రభుత్వం డీలక్స్ బస్సులను పెంచడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం మహిళల సమస్యలను గుర్తించి బస్సుల సంఖ్యను పెంచడంతోపాటు హైదరాబాద్ నగరంలో డీలక్స్ బస్సుల బదులు ఆర్డినరీ బస్సులను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు ఎల్ కవిత, ఎం జ్యోతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని వినతి



నవతెలంగాణ-ముషీరాబాద్

గత ప్రభుత్వంలో ఇండ్లు పొందని అర్హులైన లబ్దిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని కోరుతూ రాంనగర్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఆవుల లోకేష్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ యువజన నాయకులు ఎం.అరవింద్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో అనేక మంది ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గత ప్రభుత్వంలో మిగిలిన ఇండ్లను వీరికి కేటాయించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో తస్లీమాబేగం, తమీన్నగం, షాబానాబేగం, రేఖ, ఫాతిమాబేగం, అజార్, సిరజ్, మజార్, తదితరులున్నారు.



తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టీఆర్ కళా మందిరంలో శివానీ ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహణలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పద్య నాటకం పోటీలో మంగళవారం మెదక్ జిల్లా బండపోతుగల్లు గ్రామానికి చెందిన భగవత్ గీత భజన మండలి బాల బాలికకు గీతా పారాయణం చేశారు. నవతెలంగాణ కల్చరల్

ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకోవాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను అలవర్చుకోవాలని నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడి కల్ సూపరింటెండెంట్ నజియా నౌషీన్ సిద్ధిఖా అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లా డుతూ.. నాంపల్లి ఏరియా ఆస్పత్రి ఆవరణలో ప్రజలకు ఉచితంగా యోగా శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. నిత్యం ప్రజలకు వివిధ శారీరక ధృఢత్వంతో పాటు, మానసికంగా కూడా ధృఢంగా ఉండాలంటే యోగా మంచి సాధనమని తెలిపారు. ప్రజలు ప్రతి ఒక్కరు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. యోగా ఆవశ్యకత తెలుసుకోని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. యోగా నేర్చుకొనుటకు ఎలాంటి డబ్బులు కట్టాల్సిన అవసరం లేదన్నారు. యోగ నేర్పడానికి శిక్షణ నిపుణులను ఆయుష్ శాకే నియమిం చిందన్నారు. ప్రభుత్వం ఉచితంగా నిర్వహించే యోగా శిక్షణనేర్చుకోవడానికి ప్రతి ఒక్కరూ యోగ సెంటర్‌కు రావాలని పిలుపునిచ్చారు. యోగ వల్ల ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం ఉంటుందని చెప్పారు. మూడు షిఫ్టులుగా యోగ శిక్షణ ఇస్తారని తెలిపారు. ఉదయం 6 :30గంటల నుండి 7:30 గంటల వరకు, 9 గంటల నుండి 10 గం టల వరకు, 11 నుండి 12 గంటల వరకు ఈ శిక్షణ ఉం టుందన్నారు. ప్రజలందరూ సద్వినియోగించుకోవాలన్నా రు. యోగ శిక్షణ కోసం 8008553888 నెంబర్ సంప్ర దించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగ ఇ న్‌చార్జి, హెూమియోపతి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి తదితరు పాల్గొన్నారు.

'ఎరుకలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న ప్రభుత్వాలు'

- తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు ఎరుకల జనాభా 8 లక్షలకు పైగా ఉంటుందని, అలాంటి తమను ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని ఎరుకల ప్రజల అభివృద్ధి గురించి మాట్లాడకపోవడం బాధాకరమని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి (టీవైపీఎస్) రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి ఆవేదన వ్యక్తం చేశారు. సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో సమితి రాష్ట్ర ప్రతినిధుల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కెమసారం తిరుపతి మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల్లో ఉన్న ఎరుకల జనాభాలో 90 శాతం మంది కేవలం పందుల పెంపకంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. పందులపై ఆధారపడే ప్రతి ఎరుకల కుటుంబానికి 5 గుంటల భూమి కేటాయించాలని, ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి రూ.10 లక్షల రుణాలు ఇవ్వాలని, ఎరుకల యువతీ, యువకుల కోసం ప్రత్యేక స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటు చేసి బ్యాంకులతో సంబంధం లేకుండా 100 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని, హైదరాబాద్ కేంద్రంగా ఏకలవ్య యూత్ హాస్టలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. వివిధ శాఖల్లో భర్తీ చేస్తున్న ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎరుకలకు ఇందిరమ్మ ఇండ్లలో మొదటి అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ఉపేందర్, ఉపాధ్యక్షులు మనువాటి రవి, ఉండాడి అంజయ్య, రేవెల్లి తిరుపతి, సహాయ కార్యదర్శులు ఉండాడి వెంకటేష్, సాగర్, నడిగడ్డ కుమారస్వామి, సోషల్ మీడియా ఇన్‌చార్జి మొగిలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికుల కేటగిరి మార్పు చేయకుంటే ఉద్యమమే

హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బీ వాటర్ వర్క్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు నారాయణ



నవతెలంగాణ-ముషీరాబాద్

వాటర్‌వర్క్స్‌లో పనిచేసే ఔట్ సోర్సింగ్ కార్మికుల గత జీఓ మార్చిన సందర్భంగా మిగిలిపోయిన వారందరిని కేటగిరి మార్చి జీవితాలు పెంచాలని యూనియన్ అధ్యక్షుడు నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ వాటర్‌వర్క్స్‌లో పనిచేసే ఔట్ సోర్సింగ్ కార్మికులు చాలీ, చాలనీ వేతనాలు రూ.13,500లతో హైదరాబాద్ నగరంలో బ్రతకడం చాలా కష్టంగా మారుతు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత 2023 ఆగస్టులో జీఓ 60 ద్వారా వేతనాలు పెంచిన సందర్భంగా కేటగిరి 2 లో చేర్చాల్సిన కార్మికులను కేటగిరి 1 లో చేర్చడం ద్వారా ప్రతి కార్మికునికి నెలకు రూ.4వేలు నష్టపోతున్నారు. కనుక అధికారుల తప్పిదాన్ని సరిదిద్ది కేటగిరి మార్చి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్‌టీపీ కార్మికులకు ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలని, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో అధికారులకు, ఎమ్మెల్యేలకు, ఎండీకి వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే బోర్డు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, నాయకులు శ్రీనివాసరెడ్డి, కుమార్, ఆంజనేయులు,రమేష్, కుమార్,వీరాస్వామి, బాల్‌రాజ్., సురేష్, ప్రవీణ్, యాదగిరి, విజయ్, రమాదేవి, తార, బాబు, అశోక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ పిల్లలకు హోమ్ ఆఫ్ హోప్

కర్నూలు నగరంలోని ఓ మారుమూల ప్రాంతంలో ఓ చిన్న ఆశ్రమం. కానీ అది అసాధారణమైన ప్రయత్నం చేస్తోంది. సుమారు 300 మందికి పైగా అనాథలు, నిరాశ్రయులు, పేద పిల్లలకు ఆశాకిరణంగా మారింది. ఈ గొప్ప ప్రయత్నం వెనుక ఇద్దరు పోస్ట్ గ్రాడ్యుయేట్ సోదరీమణులు ఉన్నారు. వారే బ్లెస్సీ, బ్లిస్సీ. చనిపోయిన వారి తండ్రి ప్రారంభించిన మిషన్‌ను ముందుకు తీసుకువెళుతున్నారు. ఆయన స్థాపించిన హోప్ అనాథాశ్రమాన్ని నిర్వహించడానికి తమ జీవితాలను అంకితం చేసిన ఆ అక్కచెల్లెళ్ల సేవా కార్యక్రమాల గురించి నేటి మానవిలో...

కంపాషన్ సొసైటీ పేరుతో 2010లో స్థాపించబడిన ఈ అనాథాశ్రమం రాజభూషణం, అతని భార్య ప్రమీలా దేవి ఆలోచనల నుండి పుట్టుకొచ్చింది. ఇది నిరుపేద పిల్లల కోసం స్థాపించిన ఓ ఆశ్రమం. జగన్నాథ గట్టుకు వెళ్లే దారిలో జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న ఈ అనాథాశ్రమంలో కుటుంబ వాతావరణాన్ని తలపించేలా బాలబాలికలకు వేర్వేరుగా వసతి ఉంది.

తల్లి మార్గదర్శకత్వంలో

తండ్రి కోవిడ్‌తో మరణించినప్పుడు బ్లెస్సీ, బ్లిస్సీ ఆయన కలను కొనసాగించడానికి గొప్ప సంకల్పంతో అడుగుపెట్టారు. వారి సేవా స్ఫూర్తిని పంచుకునే తల్లి మార్గదర్శకత్వంలో ఈ సోదరీమణులు తమ సేవా కార్యకలాపాలను విస్తరించారు. 'మా ఆశ్రమానికి వచ్చారంటే ఈ పిల్లలు నిజమైన కుటుంబంలో భాగమైనట్లే. ప్రేమ, విలువైన అనుభూతిని అందించే ఓ అందమైన స్థలాన్ని సృష్టించాలని మేము కోరుకుంటున్నాం' అని బ్లెస్సీ చెప్పారు. ఆహారం, ఆశ్రమంతో పాటే ఈ హోమ్ ఆఫ్ హోప్ ఖైదీలకు విద్య, వృత్తి శిక్షణ, భావోద్వేగ మద్దతును అందిస్తుంది. వారి భవిష్యత్తును గౌరవం, స్వావలంబన భావంతో రూపొందిస్తుంది. టైలరింగ్, క్రాఫ్ట్‌లు వంటి ఇంటి వృత్తిపరమైన కార్యక్రమాలతో పాటు పిల్లలకు అవసరమైన నైపుణ్యాలను కూడా అందిస్తుంది. ఆశ్రమంలోని పిల్లలకు 18 ఏండ్లు నిండిన తర్వాత వారిని స్వతంత్ర జీవితాలకు సిద్ధం చేస్తాయి.





కొత్త జీవితం

ప్రస్తుతం అనాథాశ్రమం పనులు దాని నాలుగు గోడలకు మించి విస్తరించాయి. కొన్నేండ్లుగా ఈ ఆశ్రమం తరపున సుమారు ఐదుగురు యువతులకు వివాహాల జరిపించి వారికంటూ ఓ సొంత కుటుంబాన్ని ఏర్పాటు చేశారు. వారు తమ కొత్త జీవిత ప్రయాణాన్ని ప్రేమ, గౌరవం, భద్రతతో ప్రారంభించేలా చేయూత నిచ్చారు. 'అనాథలకు సేవ చేయడం గొప్ప బహుమతిగా భావిస్తున్నాం. ప్రతిరోజూ కొత్త వ్యక్తులను కలవడం, వారి జీవితాల్లో శాశ్వత ప్రభావాన్ని చూపడానికి మాకు దొరికిన మంచి అవకాశం ఇది' అని బ్లిస్సీ పంచుకున్నారు.

కలలను కొనసాగించడంలో...

అక్కచెల్లెళ్ల నిబద్ధత ఆ పిల్లల చిరునవ్వుల్లో ప్రతిబింబిస్తుంది. ప్రియా (పేరు మార్చాం) అనే అమ్మాయి గుర్తు చేసుకుంటూ 'నేను ఇక్కడికి వచ్చిన రోజును ఎప్పటికీ మరచిపోలేను. ఈ ఇల్లు నాకు కుటుంబాన్ని ఇచ్చింది. నా కలలను కొనసాగించడంలో నాకు సహాయపడింది. హోమ్ ఆఫ్ హోప్ లేకుంటే ఈరోజు నేను ఇలా మిగిలేదాన్ని కాదు' అంటూ పంచుకుంది. ఆరేండ్ల పాటు హోం ఇన్‌చార్జిగా పనిచేసిన బి సతీష్ మాట్లాడుతూ 'మేము వారిని మా సొంత పిల్లల్లాగే చూస్తాము. వారు ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి ముందు వారు మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా సిద్ధంగా ఉన్నారని మేము నిర్ధారిస్తాము' అని పంచుకున్నారు. ■

అలసటగా వుందా..?



కొందరు మహిళలు తరచూ అలసటకు గురవుతుంటారు. ఒక్కసారిగా కలిగిన అలసట.. చాలా రోజుల వరకు వారిని వీడదు. చిన్నపని చేసుకోవడానికి కూడా బద్ధకంగా అనిపిస్తుంది. కాలు కదపకుండా హాయిగా విశ్రాంతి తీసుకోవాలనిపిస్తుంది. ఇలా అకస్మాత్తుగా మహిళలను అలసట ఆవరించి.. రోజుల తరబడి బద్ధకస్థులని చేయడానికి గల కారణమేంటో తెలుసా..

సమయం: కొందరు ప్రతి నిమిషం విలువైనదిగా చూస్తారు. దాంతో తీరిక లేకుండా పని చేయడానికి ప్రాధాన్యం ఇస్తారు. ఇది శరీరం, మెదడు పైన తెలియని ఒత్తిడి కలిగిస్తుంది. అప్పుడే విరామం అవసరమని అర్థం చేసుకోవాలి. కాసేపు నిద్రకు సమయాన్ని కేటాయించి చూడండి.

కలిసిమెలిసి: కొందరు ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. దాంతో ఫోన్ వినియోగం ఎక్కువ. దీని ప్రభావం అకస్మాత్తుగా శరీరంలో శక్తి అంతా తగ్గిపోయినట్లుగా అనిపిస్తుంది. కుటుంబ సభ్యులతో గడిపితే మనసు తేలికవుతుంది.

ఒత్తిడికి దూరంగా: తెలియకుండానే మనసుని ఒత్తిడికి గురి చేస్తాం. అనవసర విషయాలకి ప్రాధాన్యం ఇస్తాం. ఇవన్నీ చెడు ప్రభావాన్ని కలిగిస్తాయి. ఏది ముఖ్యం అనే అవగాహన ఉంటే చాలు.

వ్యాయామం: రోజూ అరగంటసేపు చేసే వ్యాయామం, ధ్యానం వంటివి చేస్తే మనసును ప్రశాంతంగా మారుస్తాయి. ఉదయంపూట, అలాగే రాత్రి నిద్రపోయేముందు పది నిమిషాలు చేసే ధ్యానం మంచి నిద్రను తెచ్చిపెడుతుంది.

అలవాటు: ప్రతి ఒక్కరికీ అభిరుచులు ఉంటాయి. చిత్రలేఖనం, పుస్తకపఠనం, క్రీడలు, మొక్కల పెంపకం వంటివెన్నో ఉంటాయి. వాటిలో మనసుకు నచ్చింది ఎంచుకొని రోజూ కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. ఈ అలవాటు మనసుకు వ్యాయామంగా మారుతుంది.

ప్రయాణం: కొత్త ప్రాంతాన్ని పర్యటించి రావడం లేదా బాల్యంలో తిరిగిన ప్రాంతాలను చూసి రావడం వంటివి మనసును తేలికపరుస్తాయి. అలాగే స్నేహితులను కలవడం, వారితో చిన్నప్పటి జ్ఞాపకాలను చర్చించడం చేస్తే మానసిక సంతోషం దరి చేరుతుంది. ■

ఇంట్లోనే మందు...



ప్రస్తుతం చాలా మంది.. చర్మ ఛాయ తగ్గడం, నల్లని మచ్చలు, ఇలా చాలా రకాల పిగ్మెంటేషన్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అయితే కాస్త జాగ్రత్త తీసుకుంటే ఈ సమస్య పరిష్కారానికి ఇంట్లోనే మందును తయారు చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

- విటమిన్ సి తగినంతగా మన శరీరానికి అందినప్పుడు పిగ్మెంటేషన్ సమస్య అదుపులో ఉంటుంది. రెండు చెంచాల నిమ్మరసంలో కాస్త గంధం కలిపి ముఖానికి రాసుకుని ఆరనివ్వండి. ఆపై నీళ్లతో శుభ్రం చేసుకుని గులాబీ నీళ్లల్లో ముంచిన దూదితో మరోసారి తుడవండి. ఇలా వారంలో రెండు, మూడు సార్లైనా చేస్తుంటే ఫలితం ఉంటుంది.
- పాలల్లో ఉండే లాక్టిక్ యాసిడ్ చర్మానికి తగిన పోషణ అందిస్తుంది. పాలల్లో చెంచా గులాబీరేకల పొడి, కొద్దిగా తేనె, చెంచా సెనగపిండి కలిపి మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని ముఖం, మెడ, చేతులకు రాసుకుని స్క్రబ్‌లా రుద్దుకోవాలి. ఇలా చేస్తే మచ్చలు పోతాయి. మృతకణాలూ తొలగిపోతాయి.
- సమాన పరిమాణంలో బొప్పాయి, కలబంద గుజ్జుల్ని తీసుకుని దానికి చెంచా ఓట్స్ పొడిని కలపాలి. దీన్ని ముఖానికి రాసి ఆరనివ్వాలి. ఆపై చేతుల్ని తడుపుకొని సవ్య, అపసవ్య దిశల్లో మునివేళ్లతో మర్దన చేయాలి. దీనివల్ల ముఖం కాంతిమంతంగా మారుతుంది. మచ్చలూ క్రమంగా పోతాయి. ■

బీజేపీది అప్రజాస్వామ్య పాలన

(మొదటిపేజి తరువాయి)


కాలంగా సందర్శించేందుకు ప్రధాని సిద్ధంగా లేరని అన్నారు. అలాగే రాజ్యాంగంపై చర్చను వినడానికీ ఆయన పార్లమెంటులో లేరని తెలిపారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, ఫెడరలిజం భారత రాజ్యాంగానికి మూలస్తంభాలని, బీజేపీ అప్రజాస్వామికంగా ఫిరాయింపులు చేస్తోందని ధ్వజమెత్తారు. 830 మంది ప్రజాప్రతినిధులు బీజేపీలోకి ఫిరాయించారని, దీంతో వారంతా 'పవిత్రులు' అయ్యారని ఎద్దేవా చేశారు. 95 ఏండ్ల విదేశీయుడు జార్జ్ సోరోస్‌పై బీజేపీ వారం రోజుల పాటు పార్లమెంట్‌ను అడ్డుకుందని, అయితే సోరోస్ డబ్బు ఎవరికి వస్తుంది? జేపీసీ విచారణ జరిపితే ప్రధాని కార్యాలయం గుమ్మం వరకు చేరుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. సోరోస్ సంస్థకు భారతదేశం నుంచి డబ్బు పొందుతోందని చెబుతున్న బీజేపీ, దీన్ని ఆపగలదా? ఆపే ఆలోచన దీనికి ఉందా? అంటూ ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. ఫెడరలిజాన్ని దెబ్బతీసేలా బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు గవర్న ర్‌షిప్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వానికి గవర్నర్లు తోడుగా మారారని విమర్శించారు. 'ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' అనేది 'ఒకే దేశం... ఒకే నాయకుడు..ఒకే ఆలోచన'కు మార్గమని విమర్శించారు. దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి ఉందని జాన్ బ్రిట్టాస్ ఎత్తిచూపారు.

'జులై 19' కటాఫ్ డేట్

నవతెలంగాణ-సిటీబ్యూరో/కూకట్‌పల్లి

ఈ ఏడాది జులై 19 తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలతో హైడ్రా పేరు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. పార్కులు, నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఇండ్లు కట్టిన అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన హైడ్రా నుంచి తాజాగా కీలక ప్రకటన వచ్చింది. మంగళవారం మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి మండలం ఖైతలాపూర్ పరిధిలోని కాముని చెరువుతో పాటు మైసమ్మ చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ చెరువులో నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని హెచ్చరిం చారు. హైడ్రా 2024 జులైలో ఆవిర్భవించిందని, అప్పటికే నివాసం ఉంటే ఆ నివాసాల జోలికి హైడ్రా వెళ్లదని చెప్పారు. అయితే ఈ నిబంధన వాణిజ్య సముదాయాలకు వర్తించదని స్పష్టం చేశారు. అలాగే సంబంధిత ప్రభుత్వ విభాగాల అనుమతులున్న నిర్మాణాల జోలికి కూడా హైడ్రా వెళ్లదన్నారు. హైడ్రా ఆవిర్భవించిన తర్వాత జరిగిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని, దాంతోపాటే ఎలాంటి పర్మిషన్స్ లేకుండా కడుతున్న వాటిని సైతం కూల్చేస్తామని తెలిపారు. నూతనంగా తీసుకున్న అనుమతులను సైతం పరిశీలిస్తామన్నారు. సర్కారు విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా పని చేస్తోందన్నారు. పేదల జోలికి హైడ్రా వెళ్లదని, వాళ్ల ఇండ్లను కూల్చేస్తామనే ప్రచారాలను నమ్మొద్దని రంగనాథ్ స్పష్టం చేశారు. కాగా, హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో కాముని చెరువుని పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో హెచ్‌ఎండీఏ, హైడ్రా అధికారులు పరిశీలించారు.

నల్ల చొక్కాలు.. చేతులకు బేడీలు..



(మొదటిపేజి తరువాయి)

బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయానికి చేరుకున్న తమ చేతులకు సంకెళ్లు వేసుకుని... రైతులకు బేడీలు, మంత్రులకు జల్సాలా...?' అంటూ నినదించారు. అక్కడి నుంచి అసెంబ్లీ లాబీల్లోకి చేరుకుని అక్కడ కూడా తమ నిరసనను కొనసాగించారు. మరోవైపు శాసనమండలిలో సైతం బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్ నల్లచీరెలు ధరించి నిరసన తెలిపారు. మాజీ మంత్రి మహమూద్ అలీ, శంభీపూర్ రాజు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు నల్లచొక్కాలు ధరించి వచ్చారు.

జమిలీ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

(మొదటిపేజి తరువాయి)

బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఓటింగ్ కోరాయి. ఈ ఓటింగ్‌లో 269 మంది సభ్యులు రాజ్యాంగ సవరణ బిల్లును సమర్పించడానికి మద్దతు ఇచ్చారు. దీనికి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. 198 మంది సభ్యులు బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. ప్రజెంటేషన్ దశలోనే తీవ్ర వ్యతిరేకత రావడంతో, వివాదాస్పద బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపిస్తామని కేంద్ర ప్రభుత్వం సభకు హామీ ఇచ్చింది. నిబంధనల మేరకు తీర్మానం తీసుకురానున్నట్టు న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అన్నారు. మనీష్ తివారీ, గౌరవ్ గొగొయ్ (కాంగ్రెస్), అమ్రారామ్ (సీపీఐ(ఎం), ధర్మేంద్ర యాదవ్ (ఎస్పీ), టిఆర్ బాలు (డీఎంకే), కళ్యాణ్ బెనర్జీ (టీఎంసీ), సుప్రియా సూలే (ఎన్సీపీ), అనిల్ దేశాయ్ (శివసేన ఠాక్రే), మహ్మద్ బషీర్ (ఐయూఎంఎల్), అసదుద్దీన్ ఓవైసీ (ఎంఐఎం), ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్పీ) వంటి ప్రతిపక్ష ఎంపీలు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. టీడీపీ, శివసేన శిండే వర్గం బిల్లుకు మద్దతు పలికాయి. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు, పెమ్మసాని చంద్రశేఖర్ (టీడీపీ), శ్రీకాంత్ ఏక్‌నాథ్ శిండే (శివసేన శిండే) మాట్లాడుతూ బిల్లును సమర్థించారు.

బిల్లుకు మద్దతుగా మాట్లాడని జేడీయూ

ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రధాన భాగమైన జేడీయూ నుంచి ఎవరూ బిల్లుకు మద్దతుగా మాట్లాడలేదు.'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనే భావన రాజ్యాంగంలోని ఫెడరలిజంతో సహా ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని ప్రతిపక్ష సభ్యులు అన్నారు. 'బిల్లులోని నిబంధనలు చట్టాన్ని రూపొందించే సభ అధికార పరిధిని ఉల్లంఘిస్తాయి. లోక్‌సభ పదవీకాలం ప్రకారం శాసన సభల పదవీకాలం నిర్ణయించబడదు. చట్టసభలు విడివిడిగా ఉంటాయి. ఈ బిల్లుతో అధిక కేంద్రీకరణ అమలులోకి వస్తుంది. ఒక వ్యక్తి కోరికల నెరవేర్పు కోసమే ఈ బిల్లులను తెస్తున్నారు.

' అని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. సమగ్ర అధ్యయనం, విస్తృత చర్చల తర్వాతే బిల్లు తీసుకొచ్చామని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేత ృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. కమిటీ రాజకీయ పార్టీల అభిప్రాయాలను కూడా కోరిందని, 31 పార్టీలు అనుకూలంగా నిలిచాయని, కేవలం 15 పార్టీలు మాత్రమే వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధం కాదని మేఘ్వాల్ అన్నారు. బిల్లులు క్యాబినెట్ పరిశీలనకు వచ్చినప్పుడు జేపీసీ పరిశీలనకు వదిలేయాలని ప్రధాని ఇప్పటికే చెప్పారని హెూం మంత్రి అమిత్ షా అన్నారు.

బిల్లు రాజ్యాంగ విరుద్ధం : డీఎంకే ఎంపీ కనిమొళి

'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని లోక్‌సభలో ఖరాఖండిగా చెప్పినట్టు డీఎంకే ఎంపీ కనిమొళి తెలిపారు. ఈ బిల్లు సమాఖ్య హక్కులకు, ప్రజల ఆకాంక్షలకు కూడా విరుద్ధమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను ప్రజలు ఐదేండ్ల కాలానికి ఎన్నుకుంటారని, కానీ మీరు వాళ్ల హక్కును దూరం చేస్తారని అనుకోవడం లేదని ఆమె వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఎన్నేళ్లు ఉండాలనే అధికారాన్ని ప్రజల నుంచి లాక్కుని కేంద్ర ఎన్నికల సంఘానికి ఇవ్వడం కరెక్ట్ కాదని అన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు, సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగానికి వ్యతిరేకమని తెలిపారు. కేంద్రం ఆ బిల్లును అమల్లోకి తీసుకొస్తే రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలకు విఘాతం కలుగుతుందని అన్నారు. కావున తాము ఈ బిల్లును అంగీకరించబోమని స్పష్టం చేశారు.

రాష్ట్రాల హక్కులను ఎలా లాక్కొంటారు?



(మొదటిపేజి తరువాయి)

ఎంపీ అమ్రారామ్, సీపీఐ(ఎం)ప్రభుత్వానికి సంబంధించినవని, కానీ ఈ బిల్లుతో కేంద్ర ప్రభుత్వం చేతుల్లో వెళ్లిపోతాయని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వివిధ విధానాలు, భాషలు, అధికారాలు ఉన్నాయని, వాటిని కేంద్రం ఎలా లాక్కొంటుందని విమర్శించారు. కేవలం ఫాసిస్ట్ విధానాలతో ఈ బిల్లును తీసుకొస్తున్నారని ధ్వజమెత్తారు.

సాయుధ పోరాట కొదమసింహం దర్గ్యానాయక్

నవతెలంగాణ-దేవరుప్పుల

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కొదమసింహం దర్గ్యా నాయక్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధర్మపురం గ్రామంలో దర్గ్యా నాయక్ (107) భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సభ అనంతరం అంతిమయాత్రగా శ్మశానవాటికకు చేరుకొని అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాపసభలో తమ్మినేని మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఫిరంగులై దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డిని ఉరికించిన గొప్ప యోధుడు దర్గ్యానాయక్ అని కొనియాడారు. దర్గ్యా అన్న ఠానునాయక్ కూడా సాయుధ పోరాటంలోనే అమరుడయ్యాడని గుర్తుచేశారు. మరో సొదరడు శాంక్రూను బతికుండగానే చితిపేర్చి విస్నూరుదొరలు కాల్చి చంపారని, ఆ త్యాగాల కుటుంబంలో జన్మించిన గొప్ప వీరుడు దర్గ్యా నాయక్ అని, అలాగే ఇంటి పెద్ద కోడలు పూలమ్మతో పాటు సోదరులందరూ యుద్ధ వీరులై కదంతొక్కి, రామచంద్రారెడ్డిని గడగడలాడించారని తెలిపారు. వీర తెలంగాణ పోరాట యోధురాలు ఐలమ్మ పోరాటానికి కూడా దర్గ్యానాయక్ అండగా నిలిచారని గుర్తు చేశారు. విస్నూరు దేశ్‌ముఖ్ కుమారుడు జగన్మోహన్ రెడ్డిని జనగామ రైల్వే స్టేషన్‌లో దర్గ్యానాయక్ నరికి చంపారని తెలిపారు. 2015 సెప్టెంబర్ 10న పాలకుర్తిలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్‌తో కలిసి వీరనారి అయిలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారని గుర్తుచేశారు. దర్గ్యానాయక్ పోరాట పటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ధర్మానాయక్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు శోభాన్ నాయక్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, సింగారపు రమేష్, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, చిట్యాల సోమన్న, జోగు ప్రకాష్, మండల కార్యదర్శులు ఇంటి వెంకటరెడ్డి, మాచర్ల సారయ్య, ఏదునూరి మదర్ తదితరులు పాల్గొన్నారు.

మీరంటే..మీరే

(మొదటిపేజి తరువాయి)

ప్రభుత్వేతర రంగాలకు గ్యారంటీ ఇచ్చింది రూ. 51,277.71 కోట్లు, డ్రా చేసిన మొత్తం రూ.51,891,44 కోట్లు, 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు డ్రా చేసిన ఎఫ్ఆర్‌బీఎం రుణాలు రూ.52,118 కోట్లు, అదే సమయంలో కార్పొరేషన్లు, ఎస్పివిలు డ్రా చేసిన ఎఫ్ఆర్‌బీఎం యేతర రుణాలు రూ.61,991 కోట్లు, ప్రభుత్వ పూచీ లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలు నవంబర్ 30వరకు తీసుకున్న రుణాలు రూ.10,099.70 కోట్లు అని వివరించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ..ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,27,208 కోట్ల అప్పు చేసిందనీ, ఇలాగైతే ఐదేండ్లలో రూ.6,37,047 కోట్లకు చేరుకుంటుందని వివరించారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు క్షేమకరం కాదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో చేసిన అప్పు 4,17,496 కోట్లు మాత్రమే అని చెప్పారు. అంత అప్పు కావడానికి వరుసగా రెండేండ్లు కరోనాతో ఆర్థిక సంక్షోభం నెలకొనడం, 1.7 శాతం అదనంగా తీసుకునేందుకు కేంద్రం అనుమతి ఇవ్వడం వల్లనే చేరిందని చెప్పారు.

ప్రశ్నోత్తరాల సమయంలో ఉపన్యాసాలేంటి? రూల్స్ బుక్‌ను మార్చేశారు : మంత్రి భట్టి

మంత్రి భట్టి జోక్యం చేసుకుని మాట్లాడుతూ..'ఇది క్వశ్చన్ అవర్. స్వల్పకాల చర్చ మాదిరిగా హరీశ్‌రావు ఉపన్యాసమేంటి? ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు మాత్రమే ఇస్తారు. చర్చ ఉండదు. కావాలంటే ఇదే అంశంపై సభలో ప్రత్యేకంగా చర్చ పెడుదాం. ప్రతి పైసాకు జవాబుదారీగా ఉంటాం. గతంలోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేశాం' అని అన్నారు. హరీశ్‌రావు సత్యదూరపు మాటలు మాట్లాడటం తగదన్నారు. బహుషా నిజాలు మాట్లాడితే వారి తలలు పగిలిపోతాయో ఏమో? అని చురకలు అంటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శాసనసభ రూల్స్ బుక్ నిబంధనలను మార్చేశారని విమర్శించారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించొద్దు..నినాదాలు చేయొద్దు అని స్పష్టంగా ఉన్నా ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. 'సభాసాక్షిగా గత సీఎం దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు..ఇచ్చారా? డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారా? ఉద్యోగాలు ఇచ్చారా?' అని కడిగిపారేశారు. బీఆర్ఎస్ సభ్యులు సభా నియమాలు, నిబంధనలు గురించి మాట్లాడితే విడ్డూరంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు రూ.66 వేలు కట్టామనీ, ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నామని అన్నారు. వ్యవసాయ కూలీలకు 12 వేలు ఇవ్వొద్దా? దానిపై ప్రివిలైజ్ మోషన్ ఏంటి? అప్పులు తీసుకున్న ప్రతి పైసాకూ లెక్క ఉంది. గత ప్రభుత్వం మాదిరిగా వేం దాచిపెట్టలేదు. కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలు ఏనాడైనా చూపెట్టారా? రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఎప్పుడైనా తాము చర్చకు సిద్ధం ' అని ప్రకటించారు. తమ ప్రభుత్వం తీసుకున్న అప్పు రూ.52 వేల కోట్లే అని చెప్పారు. గత ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు బకాయి పడితే తాము చెల్లిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.40 వేల కోట్ల రూపాయలను పెండింగ్ పెట్టిందని విమర్శించారు. తాము వాటిని క్లియర్ చేస్తూ పోతున్నామన్నారు. రైతుల నుంచి ప్రతి గింజా కొంటున్నామనీ, సన్నాలకు రూ.500 బోనస్ కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో మూడు రోజుల్లోనే డబ్బులు వేస్తున్నామని చెప్పారు.

ప్రసాద్ కుమార్ స్పీకర్ కాదా? ఆయనకు నిర్ణయాధికారం లేదా? : భట్టి

'బీఏసీ సమావేశం ఏనాడైనా గత ప్రభుత్వం సక్రమంగా నిర్వహించిందా? సభను ఎన్ని రోజులు నడపాలి? ఏయే అంశాలు చర్చించాలి? అనే దానిపై కాగితంపై రాసిస్తే స్పీకర్ ఫైనల్ చేసిన విషయం వాస్తవం కాదా? గతంలో ఆ స్థానంలో పోచారం ఉన్నారు..ఇప్పుడు ప్రసాద్ కుమార్ వచ్చారు. అవే నిబంధలను పాటిస్తున్నారు. దీనిని తప్పుబడుతూ బీఏసీలో బీఆర్ఎస్ పక్షం వాళ్లు పేపర్లు విసిరేసి పోవడమేంటి? ఇదేం పద్ధతి? ప్రసాద్‌కుమార్ స్పీకర్ కాదా? ఇది కరెక్టు కాదు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ అటాక్ చేయడం మంచి పద్ధతి కాదు. అన్నీ నిబంధనల మేరకే నడుస్తాయి. మేం చెప్పినట్టు సభ నడవాలనుకోవడం సరిగాదు' అంటూ హరీశ్‌రావుకు చురకలు అంటించారు. 'మాకు నీతులు చెబుతున్నారు. వికారాబాద్ ప్రజలు చూస్తున్నారు. మా హక్కులు కాపాడండి స్పీకర్‌సార్' అని హరీశ్‌రావు అన్న మాటలపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

తప్పుడు లెక్కలు.. తప్పుదోవ.. : హరీశ్‌రావు

ఉచిత విద్యుత్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు ఖండించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉచిత విద్యుత్‌కు రూ. 65 వేల కోట్లు విద్యుత్ శాఖకు చెల్లించామని స్పష్టం చేశారు. కానీ మంత్రి భట్టి విక్రమార్క తప్పుడు లెక్కలు చెబుతూ సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో రూ. 1,27,208 కోట్లు అప్పు చేసి కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని విమర్శించారు. తమ హయాంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించామనీ, మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆస్తులను సృష్టించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం అప్పులు చేసి కమీషన్లు పంచుకు తింటున్నారని ఆరోపించారు. ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు లేక మంత్రులు భుజాలు తడుముకుంటున్నారని విమర్శించారు. తమ హయాంలో వడ్లు కొనలేదా? రైతులకు డబ్బులు ఇవ్వలేదా?అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత కరెంటు ఇవ్వలేదని మంత్రి మాట్లాడటం తగదన్నారు. తాము కూడా విద్యుత్ సంస్థలకు బకాయిలు చెల్లించామని స్పష్టం చేశారు. భట్టి విక్రమార్క వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఇక్కడ మెడిసిన్ చేసిన వాళ్లు స్థానికులే

148,149 జీవోలు చెల్లవు : హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్



తెలంగాణలో బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ(ఎంబీబీఎస్), బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదం మెడిసిన్ అండ్ సర్జరీ(బీఏఎంఎస్), బ్యాచిలర్ ఆఫ్ హెూమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ(బీహెచ్ఎంఎస్) కోర్సులు పూర్తి చేసిన వాళ్లు స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. వారిని మెడికల్ పీజీ సీట్ల భర్తీలో 'స్థానికులు'గా పరిగణించాలంది. తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/బీఏఎంఎస్ చేసినవారికి స్థానిక కోటా పరిధిలోనే అడ్మిషన్‌లు కల్పించాలని తేల్చి చెప్పింది. రాష్ట్రం వెలుపల చదివిన, ఇన్‌సర్వీసు అభ్యర్థులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం అడ్మిషన్‌లు కల్పించాలని పేర్కొంది. ప్రభుత్వానికి నిబంధనలు తీసుకురావడంతోపాటు సవరణ తీసుకువచ్చే అధికారం ఉందనీ, అయితే అది చట్టానికి అనుగుణంగా ఉండాలని పేర్కొంది. తెలంగాణ స్థానికతతో ఇతర ప్రాంతాల్లో ఇదే కోర్సులు పూర్తి చేసిన వారిని కూడా 'లోకల్' కిందే కౌన్సిలింగ్ నిర్వహించాలంది. అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాక నిబంధనలను మార్పు చేయడాన్ని తప్పుపట్టింది. ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 148, 149లను కొట్టేస్తూ తీర్పు వెలువరించింది. ఈ జీవోలు చట్ట వ్యతిరేకమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి, పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95, రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికత వంటి వాటిని ధర్మాసనం తన తీర్పులో ఉదహరించింది. తెలంగాణ మెడికల్ కాలేజీల (పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల అడ్మిషన్ల) నిబంధనలు 2021లోని రూల్ 8(2)ను, తెలంగాణ అడ్మిషన్ పోస్టుగ్రాడ్యుయేట్(ఆయుష్) కోర్సుల నిబంధనలు 2024లోని రూల్ 8 (2)ను ప్రభుత్వం సవరించింది. గత అక్టోబర్‌లో 28న 148, 149 జీవోలను జారీ చేసింది. ఈ జీవోలు చట్టవిరుద్ధమని తీర్పులో పేర్కొంది. ఇదే హైకోర్టు గత ఏడాది ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా జీవోలు ఉన్నాయని తేల్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో జాతీయ కోటా (15 శాతం) పోను మిగిలిన కన్వీనర్ కోటా సీట్లు (85 శాతం) స్థానిక విద్యార్థులకే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 72ను సమర్థిస్తూ గత సెప్టెంబర్‌లో తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు రాష్ట్రపతి ఉత్తర్వులు 1974ను ఉల్లంఘించలేదని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి, పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95కి కూడా జీవో 72 విరుద్ధం కాదంది. పీజీ మెడికల్ అడ్మిషన్ల రూల్స్‌ను మార్పు చేయడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రజిత, మంచిర్యాలకు చెందిన సత్యనారాయణ, స్థానికత వ్యవహారంపై సుమారు వంద మంది వేర్వేరుగా వేసిన పిటిషన్లపై హైకోర్టు ఈ కీలక తీర్పును వెలువరించింది.

పెద్దల భూ దందా

(మొదటిపేజీ తరువాయి)



పేదలు భూముల్ని సాగు చేసుకుంటున్నారన్న పేరుతో అప్పట్లో రెవెన్యూ అధికారులు తమ మెజిస్టీరియల్ అధికారంతో అక్రమ ఓఆర్‌సీలు ఇచ్చారు. 1986లో 432.25 ఎకరాలకు, 1987లో 83.37 ఎకరాలకు ఆక్యూపేషన్ రైట్ సర్టిఫికెట్స్ (ఓఆర్‌సీ) ఇచ్చారు. తప్పుడుపద్ధతుల్లో ఓఆర్‌సీ పొందిన వాళ్లు ఆ భూముల్ని నారాయణరావు, రాజన్న లోహడే, ఛాయ లోహడేలకు విక్రయించారు. వివాదస్పదమైన రియల్ ఎస్టేట్ వ్యాపారి నారాయణరావుపై అప్పట్లో ఫిర్యాదులు చేయడంతో అసెంబ్లీలో హౌస్ కమిటీ ఏర్పాటు చేశారు. హౌస్ కమిటీ సూచనల మేరకు సుల్తాన్‌పూర్ ఓఆర్‌సీ వ్యవహారాన్ని తేల్చాలని 1993లో సీసీఎల్ఏ అధికారిగా ఉన్న మహంతికి బాధ్యతలు అప్పజెప్పారు. ఆయన రికార్డుల్ని పరిశీలించి విచారణ జరిపారు. అప్పట్లో ఇచ్చిన ఓఆర్‌సీలు తప్పు పద్ధతిలో జారీ అయ్యాయని తేల్చారు. సీసీఎల్ఏ అధికారి మహంతి సూచనల మేరకు 1984లో అప్పటి మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ 432.25 ఎకరాలకు సంబంధించిన భూముల ఓఆర్‌సీ సర్టిఫికెట్లను రద్దు చేశారు. అయితే 83.27 ఎకరాల భూమికి సంబంధించిన ఓఆర్‌సీలను మాత్రం కొనసాగించారు.

సర్వే నెంబర్ 30లో 722.20 ఎకరాల ప్రభుత్వ భూములు

అమీన్‌పూర్ రెవెన్యూ మండలం సుల్తాన్‌పూర్ ప్రాంతంలో సర్వే నెంబర్ 30లో 722.20 ఎకరాల భూములున్నాయి. ఇందులో 83.20 ఎకరాలు శిఖం భూమి కాగా 384 ఎకరాల్లో కొండలు, మైదానాలున్నాయి. 6.08 ఎకరాల భూమి గ్రామం పరిధిలో ఉంది. 0.17 ఎకరాల్లో శ్మశాన వాటిక ఉండగా 6.08 ఎకరాల్లో రోడ్లున్నాయి. 242.07 ఎకరాల భూములు రైతుల సాగులో ఉన్నాయి. మొత్తం భూమిలో 480.13 ఎకరాల భూములు సాగుకు అనుకూలంగా లేకపోగా 242.07 ఎకరాలు మాత్రం సాగులో ఉన్నాయి. కొండలు, మైదానంగా ఉన్న ఆ పడావు భూములపై బడా నేతలు కన్నేసి ఆక్రమణకు ఉసికొల్పారు.

ఎకరం ధర రూ.15కోట్లపైనే..

గత ప్రభుత్వంలో సాగిన భూ దందాల జోరు ఈ ప్రభుత్వంలోనూ కొనసాగుతోందనే చర్చను బలపర్చేలా సుల్తాన్‌పూర్ ప్రభుత్వ భూముల వ్యవహారం వెలుగు చూస్తోంది. ప్రభుత్వంలోని పెద్దల కనుసైగలతోనే సర్కారు భూముల్ని మింగే తతంగానికి ఒడిగట్టినట్టు విమర్శలున్నాయి. ఆర్‌సీ పురం, పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన అధికార పార్టీ నాయకులే ఈ దందాలో ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇద్దరు కీలక నేతలకు నగదు రూపంలో పెద్ద మొత్తంలో డబ్బు ముట్టచెప్పేలా ఒప్పందం కుదిరిన తర్వాతనే అవుట్ ప్రక్రియను షురూ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. అవుట్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న భూములు కావడంతో అక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుత మార్కెట్ విలువ చూస్తే అక్కడ ఎకరం ధర రూ.15 కోట్లపైనే పలుకుతోంది.

మసీదు నిర్మాణం.. విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ఇనామ్, ఓఆర్‌సీ, కొనుగోలుదారులమంటూ ప్రభుత్వ భూముల్ని కాజేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. గుట్ట, మైదానంగా ఉన్న ప్రభుత్వ భూమిలో గుట్టుగా బండరాళ్లను తొలగించారు. అంతకు ముందే పైన చిన్న మసీదును కూడా నిర్మించారు. ఇటీవల ఆ మసీదును మరింత విస్తరించినట్టు చెబుతున్నారు. భూమిని చదువును చేసి ప్లాట్లుగా మార్చారు. విక్రయించిన ప్లాట్లలో తాత్కాలిక నిర్మాణాల కోసం సిమెంట్ ఇటుకలతో నిర్మాణాలు చేశారు. బౌండ్రీ చుట్టూ రేకులతో గోడ కట్టారు. రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా లేఅవుట్ చేస్తుంటే విద్యుత్ శాఖ అధికారులు మాత్రం పదుల సంఖ్యలో స్తంభాలు పాతారు. లేవుట్ అనుమతులు, భూమి రికార్డుల్ని పరిశీలించకుండానే స్తంభాలేశారు.



తప్పిన ఫాలోఆన్

- రాణించిన రాహుల్, జడేజా
- భారత్ తొలి ఇన్నింగ్స్ 252/9
- డ్రా కోసం టీమ్ ఇండియా పోరాటం

భారత్,ఆసీస్ మూడో టెస్టు నాల్గో రోజు

గబ్బా టెస్టు ఆసక్తికరంగా మారింది. భారత బ్యాటర్లు, బౌలర్లు ఆశించిన ప్రదర్శన చేయలేదు. కానీ వరుణుడు నిలకడగా ఆటకు ఆటంకం కలిగిస్తూ ఉండటంతో బ్రిస్బేన్‌లో భారత్ డ్రా కోసం పోరాడేందుకు ఓ అవకాశం ఏర్పడింది. కెఎల్ రాహుల్ (84), రవీంద్ర జడేజా (77) స్ఫూర్తిదాయక అర్థ సెంచరీలతో కదం తొక్కారు. ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ పదో వికెట్ పోరాటంతో భారత్ ఫాలోఆన్ గండం నుంచి గట్టెక్కింది. మూడో టెస్టులో నేడు ఆఖరు రోజు. రోజంతా వర్షం సూచనలు ఉండటం భారత్‌కు అతిపెద్ద అనుకూలత.

నవతెలంగాణ-బ్రిస్బేన్



కెఎల్ రాహుల్ (84, 139 బంతుల్లో 8 ఫోర్లు), రవీంద్ర జడేజా (77, 123 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) బాధ్యతాయుత అర్థ సెంచరీలు సాధించారు. మేఘావృత వాతావరణంలో ఆసీస్ పేసర్లు నిప్పులు చెరిగినా.. రాహుల్, రవీంద్ర అసమాన ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. కీలక బ్యాటర్లు చేతులెత్తేసిన వేళ టీమ్ ఇండియా ఫాలో ఆన్ గండం గట్టెక్కేలా చేశారు. యశస్వి జైస్వాల్ (4), శుభ్‌మన్ గిల్ (1), విరాట్ కోహ్లి (3), రిషబ్ పంత్ (9), రోహిత్ శర్మ (10) దారుణంగా విఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో 74.5 ఓవర్లలో భారత్ 252/9 పరుగులు చేసింది. ఆకాశ్ దీప్ (27 నాటౌట్, 31 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), జస్‌ప్రీత్ బుమ్రా (10 నాటౌట్, 27 బంతుల్లో 1 సిక్స్) అజేయంగా ఆడుతున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మరో 193 పరుగులు వెనుకంజలో కొనసాగుతుంది.

ఆదుకున్న రాహుల్, జడేజా

తొలి ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోరు 51/4తో నాల్గో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియా.. ఐదు మాత్రమే కోల్పోయి విలువైన పరుగులు చేసింది. ఆరంభంలో కెఎల్ రాహుల్ అందించిన క్యాచ్‌ను స్మిత్ నేలపాలు చేశాడు. అంది వచ్చిన అవకాశాన్ని రాహుల్ రెండు చేతులా ఒడిసిపట్టుకున్నాడు. అద్భుత ఇన్నింగ్స్ నమోదు చేశాడు. రోహిత్ శర్మ (10) పాట్ కమిన్స్ ఓవర్లో అవుటైనా.. రవీంద్ర జడేజా (77) తోడుగా అదరగొట్టాడు. రోహిత్‌తో కలిసి ఐదో వికెట్‌కు 30 పరుగులు జోడించిన రాహుల్.. రవీంద్ర జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 67 పరుగులు సాధించాడు. ఆరు ఫోర్లతో 85 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన రాహుల్ ఆసీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. రాహుల్ నిష్క్రమించినా.. నితీశ్ కుమార్ రెడ్డి (16)తో కలిసి రవీంద్ర జడేజా పోరాటం కొనసాగించాడు. ఆరు ఫోర్లతో 82 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన జడేజా భారత్‌ను ఫాలోఆన్ గండం నుంచి తప్పించాడు. నితీశ్, జడేజా జోడీ ఏడో వికెట్‌కు 53 పరుగులు చేసింది. రాహుల్, జడేజా మెరవటంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో పోరాట పటిమ కొనసాగించింది.

బుమ్రా, ఆకాశ్ వావ్

రాహుల్, జడేజా, జడేజా నిష్క్రమణతో భారత్ 194/7తో నిలిచింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు చేయగా.. ఫాలోఆన్ మార్క్ 246 పరుగులు. బ్యాటింగ్ లైనప్ పెవిలియన్‌లో కూర్చోగా భారత్ ఫాలోఆన్ ప్రమాదంలో పడింది. ఈ సమయంలో టెయిలెండర్లు తెగువ చూపించారు. జస్‌ప్రీత్ బుమ్రా (10 నాటౌట్), ఆకాశ్ దీప్ (27 నాటౌట్) పదో వికెట్‌కు అజేయంగా 39 పరుగులు జోడించారు. దీంతో భారత్ ఫాలోఆన్ గండం గట్టెక్కింది. అదనపు భారంతో అలిసిపోయిన కమిన్స్, స్టార్క్‌లు పాత బంతితో బుమ్రా, ఆకాశ్ దీప్‌లను ఇరకాటంలో పెట్టడంలో విఫలమయ్యారు. దీంతో బుమ్రా, ఆకాశ్‌లు అలవోకగా పరుగులు పిండుకున్నారు. బుమ్రా, ఆకాశ్‌లు చెరో సిక్సర్‌తో భారత శిబిరంలో ఉత్సాహం నింపారు. ఫాలోఆన్ మార్క్ దాటడంతో స్టేడియంలో భారత అభిమానులు కేరింతలు కొట్టారు. వర్షం ప్రభావిత టెస్టులో ఆసీస్ మరోసారి బ్యాట్ పట్టేలా చేసింది. దీంతో గబ్బా టెస్టులో డ్రా అవకాశాలు రెట్టింపు అయ్యాయి!.

నేడు వర్షం సూచనలు

భారత్, ఆసీస్ మూడో టెస్టులో నేడు ఆఖరు రోజు. తొలి వర్షంతో సుమారు 90 శాతం ఆట తుడిచిపెట్టుకుపోయింది. నాల్గో రోజు ఆటలో సైతం వరుణుడు ఆటంకం కలిగించాడు. మూడు సెషన్లలో పలుమార్లు వర్షంతో ఆట నిలిచిపోయింది. దీంతో మంగళవారం కేవలం 57.5 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడింది. దీనికి తోడు పేసర్ హాజిల్‌వుడ్ గాయంతో మైదానం వీడాడు. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, నాథన్ లయాన్‌లు మాత్రమే వికెట్ల వేట బాధ్యత తీసుకున్నారు. పాత బంతితో వికెట్ల వేట ఆసీస్ పేసర్ల కష్టంగా మారింది. నేడు చివరి రోజు ఆటలో రోజంతా వర్షం సూచనలు ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురవనుంది. మధ్యాహ్నం భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. దీంతో కనీసం రెండు సెషన్ల ఆట సాధ్యపడే అవకాశం వీల్లేదు. ఆసీస్ మరోసారి బ్యాటింగ్‌కు రావాల్సి ఉండటం, ఆ తర్వాత భారత్ పది వికెట్లు నిలుపుకుంటే బ్రిస్బేన్ టెస్టు నుంచి గట్టెక్కే అవకాశం ఉంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 445/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 4, కెఎల్ రాహుల్ (సి) స్మిత్ (బి) లయాన్ 84, శుభ్‌మన్ గిల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 1, విరాట్ కోహ్లి (సి) కేరీ (బి) హాజిల్‌వుడ్ 3, రిషబ్ పంత్ (సి) కేరీ (బి) కమిన్స్ 9, రోహిత్ శర్మ (సి) కేరీ (బి) కమిన్స్ 10, రవీంద్ర జడేజా (సి) మార్ష్ (బి) కమిన్స్ 77, నితీశ్ కుమార్ రెడ్డి (బి) కమిన్స్ 16, మహ్మద్ సిరాజ్ (సి) కేరీ (బి) స్టార్క్ 1, జస్‌ప్రీత్ బుమ్రా నాటౌట్ 10, ఆకాశ్ దీప్ నాటౌట్ 27, ఎక్స్‌ట్రాలు : 10, **మొత్తం : (74.5 ఓవర్లలో 9 వికెట్లకు) 252.**

వికెట్ల పతనం : 1-4, 2-6, 3-22, 4-44, 5-74, 6-141, 7-194, 8-201, 9-213.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 24-3-83-3, జోశ్ హాజిల్‌వుడ్ 6-2-22-1, పాట్ కమిన్స్ 20.5-2-80-4, నాథన్ లయాన్ 21-0-54-1, ట్రావిశ్ హెడ్ 1-0-1-0, మిచెల్ మార్ష్ 2-0-6-0.

'బచ్చలమల్లి'కి అందరూ కనెక్ట్ అవుతారు



అల్లరి నరేష్

"గమ్యం'లో గాలి శీను ఎలా గుర్తుండిపోయాడో, 'బచ్చల మల్లి' కూడా ఓ పదేండ్ల పాటు గుర్తుండిపోతాడు. క్యారెక్టర్ ఇంపాక్ట్ అలా ఉంటుంది. నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కొత్తగా ట్రై చేశాను' అని హీరో అల్లరి నరేష్ చెప్పారు. ఆయన నటించిన రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి'.

సుబ్బు మంగాదేవి దర్శకుడు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఈనెల 20న క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో అల్లరి నరేష్ మీడియాతో సంభాషించారు.


- డైరెక్టర్ సుబ్బు ఈ కథ చెప్పినప్పుడు సింగల్ సిట్టింగ్ లోనే ఓకే అయింది. కథ అంత అద్భుతంగా ఉంది. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో చాలా వేరియేషన్స్ ఉన్న క్యారెక్టర్ ఇది. ఇందులో హాస్య రసం తప్ప అన్ని వేరియేషన్స్ ఉన్నాయి.
- 'నాంది' తర్వాత డిఫరెంట్ సినిమా చేద్దామనుకున్నాను. అలా మంచి కంటెంట్ సినిమాల కోసం చూస్తున్న టైంలో ఈ సినిమా వచ్చింది. నిర్మాత రాజేష్‌కి కూడా చాలా నచ్చింది. ఆయన చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. ఇది ఆటో బయోగ్రఫీ కాదు. డైరెక్టర్ సుబ్బు ఊర్లో బచ్చల మల్లి అనే ఒక క్యారెక్టర్ ఉంది. ఆయన ఊర్లో గొడవలను కూడా తన గొడవలుగా ఫీల్ అయ్యే మనిషి. ఆయన జీవితంలోని మూడు ఇన్సిడెంట్స్ తీసుకుని కంప్లీట్‌గా ఒక డిఫరెంట్ కథని తయారు చేశారు.
- బచ్చల మల్లి చాలా ఇంపాక్ట్ ఫుల్ క్యారెక్టర్. ప్రతి మనిషిలోనూ బచ్చలమల్లి లాంటి క్యారెక్టర్ ఉంటుంది. మనకు తెలియకుండానే జీవితంలో కొన్ని నిర్ణయాలు మూర్ఖత్వంతో తీసుకుంటాం. అందరూ రిలేట్ చేసుకునే క్యారెక్టర్ ఇది. ఇందులో తెలియకుండానే ఒక మంచి మెసేజ్ కూడా ఉంది. ఈ కథని చాలా నిజాయితీగా చెప్పాం. ఈ సినిమాలో ప్రీ క్లైమాక్స్ చాలా అద్భుతంగా ఉంటుంది. సుడిగాడు 2ని పాన్ ఇండియా స్థాయిలో చేస్తున్నాం.

శ్రీమురళి కొత్త సినిమా 'పరాక్'

తెలుగు పరిశ్రమలో బ్లాక్‌బస్టర్ ప్రాజెక్ట్‌లను అందించిన నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నేతృత్వంలోని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారి 47వ ప్రాజెక్ట్ కోసం శ్రీమురళితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉంది.

'బఘీర' ఘనవిజయం తర్వాత శ్రీమురళి, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కలిసి నిర్మాత విశ్వ ప్రసాద్ నేతృత్వంలో చేస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ కాంబినేషన్ ఇప్పటికే అభిమానులు, విమర్శకులలో క్యూరియాసిటీని పెంచింది. ఈ స్పెషల్ మూమెంట్‌కి గుర్తుగా, అలాగే శ్రీమురళి పుట్టినరోజును పురస్కరించుకుని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేసింది.

ఇదిలా ఉంటే, శ్రీమురళి పుట్టినరోజు సందర్భంగా బ్రాండ్ స్టూడియోస్ హాలేష్ కోగుండి టీమ్ రూపొందిస్తున్న కొత్త సినిమాకి 'పరాక్' అనే టైటిల్‌ని అనౌన్స్ చేశారు. ఇది అభిమానులకు, ప్రేక్షకులకు గొప్ప విజువల్ ట్రీట్ అవుతుందని, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్ట్ మార్చిలో సెట్స్‌పైకి రానుంది అని మేకర్స్ తెలిపారు.



శ్రీ మురళి

నవచిత్రం

మాజీ ప్రేయసి పై ప్రతీకారం తీర్చుకునే కథ




మృణాల్ ఠాకూర్, అడివి శేష్

అడివి శేష్ నటిస్తున్న పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'డకాయిట్'. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. హిందీ, తెలుగు భాషలలో ఏకకాలంలో ఈ చిత్రాన్ని చిత్రీకరణ చేస్తున్నారు. అడివి శేష్, షానీల్ డియో సంయుక్తంగా కథ, స్క్రీన్ ప్లే రూపొందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాకి సంబంధించి లాంగ్ షెడ్యూల్ మహారాష్ట్రలో కొనసాగుతుంది.

మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా అడివి శేష్, తన లీడింగ్ లేడీని ఈ హై ఆక్టేన్ ఫేస్ ఆఫ్‌లోకి స్వాగతిస్తున్నట్లు అనౌన్స్ చేశారు. మృణాల్ ఠాకూర్ ఈ చిత్రంలో ఫీమేల్ లీడ్‌గా చేరారు. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ పాత్రల మధ్య కెమిస్ట్రీని ప్రజెంట్ చేస్తూ చిత్ర బృందం ఇంటెన్స్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. తనకు ద్రోహం చేసిన తన ఎక్స్ లవర్ పై ప్రతీకారం తీర్చుకునే కోపంతో ఉన్న దోషి కథగా, ప్రేమ, ద్రోహం, ప్రతీకారం, పవర్ ద్వారా నడిచే యాక్షన్ డ్రామాగా ఈ సినిమా ఉండనుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

'గోదారి గట్టు' సాంగ్‌కి అద్భుతమైన రెస్పాన్స్



వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన 'గోదారి గట్టు..' సాంగ్ 27 మిలియన్ వ్యూస్ క్రాస్ చేసి చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. రమణ గోగుల పాడిన ఈ పాట సోషల్ మీడియాతో పాటు అన్నీ మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతూ వైరల్‌గా మారింది. జనవరి 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు, సింగర్ రమణ గోగుల మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- 'గోదారి గట్టు..' సాంగ్ ఆల్రెడీ 27 మిలియన్ వ్యూస్ దాటేసింది. ఈ రెస్పాన్స్ చాలా గ్రేట్ ఫుల్‌గా ఉంది. నా పాటని అభిమానించే ఎంతోమంది అభిమానులు ఉన్నారు. మళ్లీ నేనెప్పుడు పాడతానా అని ఎదురు చూశారు. నేను నా వ్యక్తిగత జీవితంలో బిజీ అయిపోయాను. యూఎస్‌లో ఉన్నాను. నేను ఎవరి సంగీతంలో ఇప్పటివరకు పాడలేదు. కానీ అనిల్, భీమ్స్ చాలా లవింగ్ పర్సన్స్. ఫెంటాస్టిక్ యాటిట్యూడ్‌తో ఉంటారు. వెంకటేష్ నాకు చాలా మంచి ఫ్రెండ్. నా తొలి సినిమా వెంకటేష్ 'ప్రేమంటే ఇదేరా.' ఇలాంటి మంచి కాంబినేషన్‌లో వస్తున్న ఈ పాటని పాడాలని అనుకున్నాను. భీమ్స్ లవ్లీగా కంపోజ్ చేశారు. పాటకి ఇంత అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా ఆనందం ఇచ్చింది. లైఫ్ ఫుల్ సర్కిల్ అయిందనే ఫీలింగ్ వచ్చింది
- పాటలో ఒక హార్ట్ ఉంది. డెఫినెట్‌గా పాడాలి అనిపించింది. అలా ఈ పాట పాడాను. ఈ పాట పాడటానికి చాలా క్రియేటివ్ ఫ్రీడమ్ దొరికింది. మధుప్రియ కూడా చాలా అద్భుతంగా పాడింది. నా వాయిస్‌కి తన వాయిస్‌కి పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ అయింది. భాస్కర భట్ల చక్కగా రాశారు. ఓ వ్యక్తి ఫోన్ చేసి మా ఊర్లో పొద్దున లేస్తే ఇదే పాట వేస్తున్నారు, అందరూ డాన్స్ చేస్తున్నారని చెప్పారు. వాయిస్‌లో అదే మ్యాజిక్ ఉందని అందరూ చెప్పడం చాలా హ్యాపీనెస్‌నిచ్చింది.
- వెంకటేష్ కాల్ చేశారు. నేను మళ్లీ పాట పాడడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఆయనకి పాట చాలా నచ్చింది. ఆయనలో అప్పటికి, ఇప్పటికీ ఎలాంటి మార్పు లేదు. అదే మ్యాజిక్ ఉంది. ఆయన రాక్ స్టార్. పాట విని ఇండస్ట్రీ నుంచి కూడా చాలా కాల్స్ వచ్చాయి. అందరూ అభినందించారు. మళ్లీ నేను కంపోజ్ చేయటానికి సిద్ధంగా ఉన్నాను. ఇప్పుడున్న మ్యూజిక్ డైరెక్టర్స్ అందరూ చాలా అద్భుతంగా సంగీతం చేస్తు న్నారు. పాటలు ఫెంటాస్టిక్‌గా ఉన్నాయి. అయినా ఒక న్యూ కైండ్ ఆఫ్ మ్యూజిక్‌కి ఎక్కడో చిన్న గ్యాప్ ఉంది. ఆ గ్యాప్‌ని ఫిల్ చేయడానికి నేను రెడీగా ఉన్నాను. నా దగ్గర కొన్ని వినూత్నమైన ఐడియాలు ఉన్నాయి.

\- రమణ గోగుల



అతిగా ఆలోచిస్తే?

షణ్ముఖ్ జస్వంత్ లీడ్ రోల్‌లో నటించిన ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ 'లీలా వినోదం'. పవన్ సుంకర దర్శకుడు.

అనగ అజిత్, గోపరాజు రమణ, ఆమని, రూపాలక్ష్మి తదితరులు కీలక పాత్రలు పోషించారు. శ్రీ అక్కియన్ ఆర్ట్స్ బ్యానర్ పై శ్రీధర్ మారిసా నిర్మించారు. ఈటీవీ విన్‌లో ఈనెల 19 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్‌ని ఘనంగా నిర్వహించారు.

హీరో షణ్ముఖ్ జస్వంత్ మాట్లాడుతూ,'నేను కంటెంట్ చేసి వన్ అండ్ హాఫ్ ఇయర్ అవుతుంది. అయినప్పటికీ ఎంతగానో సపోర్ట్ చేస్తున్నారు. మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. నాకు కరెక్ట్ టైంలో 'లీలా వినోదం' వచ్చింది. భరత్, సాయికి థ్యాంక్స్. నన్ను నమ్మి అవకాశం ఇచ్చారు. ఈ సినిమా మీ అందరికీ చాలా చాలా నచ్చుతుంది. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్నాం' అని అన్నారు. 'ఇదొక క్యూట్ లవ్ స్టోరీ. మేం ఇంట్రడ్యూస్ చేసిన 5వ డైరెక్టర్ పవన్. తను కూడా తప్పకుండా సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అవుతాడు' అని ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ చెప్పారు.

ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి మాట్లాడుతూ,' పవన్ ఈ కథ చెప్పిన వెంటనే సింగల్ సిట్టింగ్‌లో ఓకే అయింది. అలా సింగల్ సిట్టింగ్‌లో ఓకే అయిన కథలు చాలా అరుదు. తను చాలా ఫెంటాస్టిక్ రైటర్, డైరెక్టర్. ఇండస్ట్రీలో తనకంటూ ఒక మార్క్ క్రియేట్ చేసుకుంటాడు' అని అన్నారు. డైరెక్టర్ పవన్ సుంకర మాట్లాడుతూ, 'నా అనుభవాలన్ని కూడా ఇందులో చూస్తారు. ఉషా కిరణ్ మూవీస్‌లో డైరెక్టర్‌గా పరిచయం కావడం ఒక గొప్ప అదృష్టం. ఇందులో ఓవర్ థింకింగ్ అనే కాన్సెప్ట్‌ని చూపిస్తున్నాం. కచ్చితంగా ఆడియన్స్ సర్‌ప్రైజ్ ఫీల్ అవుతారు. అందరూ రిలేట్ అవుతారు. చాలా మంచి ఫీలింగ్ ఇచ్చేసి సినిమా ఇది' అని తెలిపారు.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు

రాకింగ్ రాకేష్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కెసిఆర్). గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రానికి గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు.

రాకింగ్ రాకేష్ స్వయంగా నిర్మించారు. అనన్య కృష్ణన్ కథానాయికగా నటించింది. నవంబర్ 22న విడుదలైన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకొని, ఘన విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు.

హీరో రాకింగ్ రాకేష్ మాట్లాడుతూ,'ఈ సినిమా ఆలోచనని ఓ మిత్రుడికి చెప్పినప్పుడు తను ఇచ్చిన సమాధానం, నాకు ఎదురైన బాధ, అవమానం నన్ను ఈ సినిమాని ఎట్టి పరిస్థితుల్లోనైనా చేయాలనే కసి రేకెత్తించింది.



ఒక కసితో ఈ సినిమా చేశాను. ఈ సినిమా చేయడానికి కారణం రాఘవన్న, పుష్ప వదిన వాళ్ళు లేకపోతే ఈ సినిమా లేదు. నా భార్య సుజాత కారణంగానే నేను ఈరోజు ఈ వేదికపై ఉన్నాను. నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. ఈ సినిమాకు పని చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. చరణ్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. డైరెక్టర్ అంజి నన్ను తలెత్తుకునేలా చేసే సినిమా తీశారు. ఈ నెలలోనే మరో సినిమాని ప్రకటించబోతున్నాను. ఈ సినిమాలో నటించిన నటీనటులందరికీ రుణపడి ఉంటాను. ఈ సినిమా ఆహాలో ప్రసారమవుతుంది. ఈ సినిమాకి ఖచ్చితంగా అవార్డ్స్ వస్తాయి. గొప్ప పండగ చేసుకుంటాం. ఈ సినిమాకి పార్ట్ 2 కూడా ఉంటుంది. ఇదే టీంతో మరో మంచి సినిమాతో మీ ముందుకు వస్తాం. మీ అందరి ఆశీర్వాదంతో మరో హిట్ కొడతాం' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.